నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 17-9-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:38 | పేజీలు: 8 | వెల: రూ.1/-

ప్రపంచం మెచ్చిన నగరం హైదరాబాద్

లవబుల్..లివబుల్ సిటీగా ప్రఖ్యాతి
మెట్రోతో రవాణాకు మార్గం సుగమం
మరిన్ని ప్రాంతాలకు మెట్రో విస్తరణ
ట్రాఫిక్ రద్దీ తగ్గించేలా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం
హైదరాబాద్ అభివృద్ధి కోసం రూ. 67 వేల కోట్లకు పైగా ఖర్చు
అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చలో ప్రస్తావించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): ప్రపంచం మెచ్చిన గమ్యస్థానంగా హైదరాబాద్ నగరం అవతరిస్తోందని రాష్ట్ర ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. లవబుల్ అండ్ లివబుల్ సిటీగా హైదరాబాద్ మారిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సహా ఇతర పట్టణాల్లో అభివృద్ధి పనులు, మౌళిక వసతులపై శాసనసభలో మంత్రి కేటీఆర్ స్వల్పకాలిక చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ హైదరాబాద్ ఖ్యాతిపై అనేకులు తమ అభిప్రాయాలను వెల్లడించారని అన్నారు. అలాగే అనేక ప్రశంసలు వచ్చాయని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణలో అత్యంత వేగంగా పట్టణీకరణ చెందిందని తెలిపారు. తెలంగాణ పట్టణీకరణ 42.6 శాతానికి చేరుకుంది. దేశ సగటు పట్టణ జనాభా 31.2 శాతం మాత్రమే. తెలంగాణలో అనేక పాలన సంస్కరణలను చేపట్టింది. పెరుగుతున్న పట్టణీకరణ దృష్ట్యా 74 కొత్త మున్సిపాలిటీలు, 7 కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో 142 పురపాలికలకు రూపకల్పన జరిగింది. ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తూ ఉపాధి కల్పనను పెంపొందిస్తున్నాం. కట్టుదిట్టమైన శాంతి భద్రతలను అమలు చేస్తున్నాం. ఈ క్రమంలో ప్రపంచం మెచ్చిన గమ్యస్థానంగా హైదరాబాద్ అవతరిస్తోందన్నారు. ప్రతి నెల జీహెచ్ఎంసీకి రూ. 78 కోట్లు, ఇతర మున్సిపాలిటీలకు రూ. 70 కోట్లు విడుదల చేస్తున్నాం. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు హైదరాబాద్ అభివృద్ధి కోసం రూ. 67 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో హైదరాబాద్‌ది కీలక పాత్ర అని కెటిఆర్ స్పష్టం చేశారు. నగరంలో అనేక నూతన కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో ÷÷-ల ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించామన్నారు. రాబోయే రోజుల్లో మెట్రోను మరింత విస్తరిస్తామని తెలిపారు. అన్ని పురపాలికల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. రూపాయికే ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇస్తున్నామని తెలిపారు. లాక్‌డౌన్ పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. నూతన మున్సిపల్ చట్టం ద్వారా అనుమతులను సులభతరం చేశామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో డీఆర్ఎఫ్ బృందాలను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పారు. బస్తీల్లో పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు బస్తీ దవఖానాలు ఏర్పాటు చేశామన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. జవహర్ నగర్ డంపింగ్ యార్డు వద్ద విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను త్వరలోనే ప్రారంభించబోతున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మిస్తున్నామని మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు. కరోనా వల్ల దేశంలో మౌలిక వసతులు

కార్యక్రమాలు నిలిచిపోయాయని, లాక్‌డౌన్ పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామని, హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, రాబోయే రోజుల్లో హైదరాబాద్ మెట్రోని మరింత విస్తరిస్తామని, బస్తీలో పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని, జిహెచ్ఎంసి పరిధిలోని బస్తీ దవాఖానాలను 350కి పెంచుతామని కెటిఆర్ హామీ ఇచ్చారు. పేదల సొంతింటి కలను నిజం చేయడానికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మిస్తున్నామని, జిహెచ్ఎంసి పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మిస్తున్నామని మంత్రి కెటిఆర్ తెలిపారు. కొల్లూరులో రూ. 1400 కోట్లతో 15 వేలకుపైగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ప్రాణాలకు తెగించి పని చేస్తున్నారని ప్రశంసించారు. జవహర్ నగర్‌లో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ఎ÷-లాంట్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే నాలుగు లక్షల 58 వేలకు పైగా ఎల్ఇడి లైట్లను ఏర్పాటు చేశామని, ఐదు లక్షల సిసి కెమెరాలతో భాగ్యనగరంలో తొలి స్థానంలో ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత డైనమిక్ నగరంగా హైదరాబాద్‌ను జెఎల్ఎల్ సంస్థ గుర్తించిందన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

పారదర్శకంగా పథకం అమలు: సత్యవతి రాథోడ్

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం కింద గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు పౌష్టికాహారం అందిస్తున్నామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఈ పథకాన్నిపారదర్శకంగా అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆరోగ్యలక్ష్మి పథకం అమలుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సత్యవతి సమాధానం ఇచ్చారు. ఈ పథకం కింద పాలు, గుడ్లతో పాటు పప్పు, ఆకు కూరలు అందిస్తున్నామని చెప్పారు. కొవిడ్ నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటికెళ్లి పోషకాహారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. పౌష్టికాహారం లోపం ఉన్న పిల్లలకు అదనంగా పాలు సమకూర్చుతున్నామని వెల్లడించారు. ఈ పథకాన్ని దేశంలో ఏ రాష్ట్రం కూడా అమలు చేయడం లేదు. రాష్ట్రంలో దాదాపు 12 వేల అంగన్‌వాడీలు ఉన్నాయి. వీటికి అదనంగా మరిన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెడిపోయిన గుడ్లను సరఫరా చేస్తే వారికి బిల్లులు ఆపమని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. గర్భిణి స్త్రీలను తరలించేందుకు అమ్మ ఒడి వాహనాలను సమకూర్చామని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు.

కౌలురైతులకు రైతుబంధు కుదరదు

మరోమారు స్పష్టం చేసిన ప్రభుత్వం
అసెంబ్లీలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి జవాబు

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని కౌలుదారులకు రైతుబంధు ఇవ్వడం కుదరదని ప్రభుత్వం మరోమారు స్పష్టం చేసింది. సిఎం కెసిఆర్ ఇప్పటికే దీనిపై స్పష్టతను ఇచ్చారు. ఇదే విషయాన్ని సీఎం కేసీఆర్ అనేక సందర్భాల్లో గుర్తు చేశారని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా రైతుబంధు పథకంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం కింద 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ. 12 వేల కోట్లు, 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ. 12 వేల కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 14 వేల కోట్లు కేటాయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో క్షేత్రస్థాయిలో ప్రతి 5 వేల ఎకరాలకు ఒక అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌ను నియమించామని చెప్పారు. తెలంగాణలో 2604 మంది ఏఈవోలను నియమించామన్నారు. 2,601 రైతు వేదికల నిర్మాణానికి చర్యలు చేపట్టాం. వీటి నిర్మాణానికి బ్జడెట్‌లో కేటాయింపులు చేశామన్నారు. ఈ మూడు ఆర్థిక సంవత్సరాల్లో రైతు బీమా కింద 33,884 కుటుంబాలు ప్రయోజనం పొందాయి. రైతు బీమా ప్రీమియం కోసం రూ. 2,917 కోట్ల 39 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. రైతు బంధు పథకాన్ని ఏ రాష్ట్రం కూడా అమలు చేయడం లేదు. ఈ పథకం కేసీఆర్ మానసపుత్రిక. పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉన్న రైతు మాత్రమే ఈ పథకానికి అర్హుడు అని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం కోసం ప్రతి సంవత్సరం బ్జడెట్‌లో కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. కొవిడ్ కాలంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. వ్యవసాయ రంగాన్ని అత్యవసర పరిస్థితుల కింద చేర్చి.. రైతాంగానికి రైతుబంధు ఇచ్చామన్నారు. కౌలు రైతులకు రైతుబంధు ఇవ్వడం సాధ్యం కాదన్నారు.

దుబ్బాక నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి హరీష్ రావు

నవజాత శిశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

సంరక్షణ సేవల్లో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ
అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి ఈటెల రాజేందర్

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో నవజాత శిశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా నవజాత శిశువుల సంరక్షణపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఈటల సమాధానం ఇచ్చారు. 2018 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన మదింపులో నవజాత శిశు సంరక్షణ సేవలను అందించడంలో దేశంలోనే తెలంగాణ 2వ స్థానంలో నిలిచింది అని తెలిపారు. రాష్ట్రంలో నవజాత శిశువు మరణాల రేటు 19గా ఉంది. ఇది జాతీయ సగటు అయిన 22 కంటే తక్కువ. రాష్ట్రంలో నవజాత శిశు సంరక్షణ యూనిట్ల విషయానికి వస్తే ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ యూనిట్లు 29, న్యూబార్న్ స్టెబిలైజేషన్ యూనిట్లు 46, న్యూబార్న్ కేఫ్ కార్నర్లు 562 ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతమున్న 29 ప్రత్యేక నవజాత శిశువు సంరక్షణ యూనిట్లను అదనంగా మరో 11 యూనిట్లను, రెండు మాతా నవజాత శిశు సంరక్షణ యూనిట్లను మంజూరు చేశామన్నారు. ఈ యూనిట్లను నిర్వహణలోకి తీసుకువచ్చే పని పురోగతిలో ఉందన్నారు. ఆరోగ్య రంగంపై కేంద్రం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మి పథకం వచ్చిన తర్వాత బాల్యవివాహాలను అరికట్టగలిగామని తెలిపారు. పౌష్టికాహారం లోపం వల్లే బరువు తక్కువ ఉన్న పిల్లలు పుడుతున్నారు. దీన్ని అధిగమించేందుకు ఆరోగ్యలక్ష్మి ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. నవజాత శిశువుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

సినీ ఇండస్ట్రీని టార్గెట్ చేసిన కరోనా

నాగబాబు, సింగీతంలకు పాజిటివ్

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ):కరోనా మహమ్మారి ఎవ్వరిని వదిలిపెట్టడంలేదు. సామాన్యులు సెలబ్రెటీలు అని తేడాలేకుండా అందరు కరోనా బారిన పడుతున్నారు. ఎన్నో జాగ్రత్తలు తీసుకునే సినీతారలు కూడా కరోనా బారిన పడటం అందరిని ఆందోళనకు గురిచేస్తుంది. బాలీవుడ్ నటులు అమితాబ్ ఫ్యామిలీతో సహా పలువురు కరోనా బారిన పడుతున్నారు. ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యంకు ముందుగా మైల్డ్ కరోనా సోకినప్పటికీ ఆ తర్వాత పరిస్థితి తీవ్రంగా విషమించింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. మెగా బ్రదర్ నాగబాబుకు కూడా కరోనా పాజిటివ్ అని తేలింది. తాజాగా దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాసరావు కరోనా వైరస్ బారినపడ్డారు. ఈ విషయాన్నీ అనే స్వయంగా వెల్లడించారు.కరోనా సినీ ఇండస్ట్రీని టార్గెట్ చేసిందన్నట్లుగా లెజండరీ డైరెక్టర్ రాజమౌళి, ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వంటి వారు కరోనా బారిన పడ్డారు. ఇప్పుడు కరోనా మెగా ఫ్యామిలీ మీద కన్నేసింది. నాగబాబుకు కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయింది. అయితే దీనికి గురించి నాగబాబు నోరు విప్పకముందే రెండు రోజుల నుంచి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఇప్పుడు ట్విటర్ వేదికగా నాగబాబు విషయాన్ని వెల్లడించారు. తొందరగా కరోనాను జయించి ప్లాస్మాను దానం చేస్తానని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే నాగబాబు గత కొన్నిరోజులుగా ఓ ఛానల్‌లో వచ్చే కామెడీ షోలో పాల్గొంటున్న విషయం తెలిసిందే. బహుశా అక్కడి నుంచే వైరస్ సోకి ఉండొచ్చు అంటున్నారు. ఏదేమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగబాబు సూచించారు. నాగబాబు త్వరగా కోలుకోవాలని అతని అభిమానులు రీట్వీట్లు పెడుతున్నారు. ఇకపోతే దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాసరావు కూడా కరోనా బారిన పడ్డారు. 'ఇప్పుడేంటి అరవై డెబ్భై సంవత్సరాలుగా పాజిటివ్ నే' అంటూ .. ఆయన చమత్కరించారు. ఇటీవల కొంచెం అనారోగ్యంగా ఉండటంతో కరోనా పరీక్ష చేయించుకున్నానని.. పరీక్షల్లో పాజిటివ్ తేలిందని ఆయన తెలిపారు. అప్పటినుంచి హోమ్ ఐసోలేషన్లోనే ఉంటున్నానని, ఈ నెల 23 వరకు కూడా ఐసోలేషన్ లోనే ఉంటానని ఆయన అన్నారు. నన్ను అభిమానించే వాళ్లు , నా సన్నిహితులు ఎవ్వరు కంగారు పడొద్దని, త్వరలోనే కోలుకొని మీముందుకు వస్తాను అని సింగీతం తెలిపారు.నందమూరి బాలకృష్ణ తో సింగీతం శ్రీనివాసరావు తీసిన ఆదిత్య 369 సినిమా ఎంత పెద్ద హిట్టో అందరికీ తెలిసిందే.

ప్రధాని మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని..

పారిశుధ్యకార్మికులకు బట్టలు, నిత్యావసరాలు పంపిణీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): సెప్టెంబర్ 17న ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని బీజేపీ నిర్వహిస్తున్న సేవా సప్తాహ్ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్‌కు చెందిన పారిశుధ్య కార్మికులకు బట్టలు, నిత్యవసరాలు పంపిణీ చేశారు. కరోనా వారియర్స్‌గా కోవిడ్ మహమ్మారిపై పోరాటంలో పారిశుధ్య కార్మికులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. ఈ క్లిష్ట సమయాల్లో వారి సేవలు అమూల్యమైనవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరో కేంద్రమంత్రి నిత్యానంద్ రాయ్, ఎన్‌డీఎంసీకి చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

70కిలోల లడ్డూ తయారు

ప్రధాని మోదీ ఈనెల 17వ తేదీతో 70వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని తమళనాడులోని కోయంబత్తూరులో బీజేపీ కార్యకర్తలు 70 కిలోల లడ్డూను శివన్ కామాక్షి అమ్మన్ ఆలయంలో సమర్పించారు. స్వామికి నివేదించిన అనంతరం భక్తులకు దానిని పంచిపెట్టారు. ఆలయం వెలుపల ఊరేగింపు, డప్పుల వాద్యాలతో లడ్డూను కార్యకర్తలు తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపి లడ్డూను శివునికి సమర్పించారు. మోదీ జన్మదినోత్సవాల్లో భాగంగా గత వారం రోజులుగా బీజేపీ కార్యకర్తలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు రేషన్ పంపిణీ, రక్తదాన శిబిరం నిర్వహణ, ఉచిత కంటి పరీక్షా శిబిరాలు ఏర్పాటు చేశారు. మోదీ బర్త్‌డేను పురస్కరించుకుని 'సేవా శపథ్' పేరుతో బీజేపీ వారం రోజుల దేశవ్యాప్త కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించింది. ఈ ప్రచారానికి ఉత్తరప్రదేశ్‌లోని గౌతం బుధ్ నగర్ జిల్లా చప్రౌలి గ్రామంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శ్రీకారం చుట్టారు. ఈనెల 20 వరకూ ఈ ప్రచారం కొనసాగనుంది.

370 ఆర్టికల్ రద్దుతో కాశ్మీర్‌లో తగ్గిన ఉగ్ర కార్యకలాపాలు

-పెద్ద ఘటన ఏవీ జరగలేదన్న కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. గతేడాది ఆర్టికల్ 370 రద్దు తరవాత ఇటీవలి వరకూ ఒక్క మేజర్ అటాక్ కూడా జరగలేదని కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. ఆర్టికల్ 370 ని రద్దు చేసిన తర్వాత కశ్మీర్ లో ఉగ్రవాద పరిస్థితిపై పార్లమెంట్‌లో సభ్యులడగడంతో కిషన్ రెడ్డి పై విధంగా ప్రకటించారు. ఆగస్టు 5,2019 తర్వాత జమ్మూ కశ్మీర్ లో ఉగ్రవాద దాడులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని ఆయన తెలిపారు. 2019 ఆగస్టు కంటే ముందు 455 ఉగ్రవాద సంఘటనలు జరిగాయని, ఆ తర్వాత మాత్రం 211 సంఘటనలు మాత్రమే జరిగినట్లు ఆయన తెలిపారు. కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, బెంగాల్, రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఐసిస్ కార్యకలాపాలు అత్యంత క్రియాశీలకంగా ఉన్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ తన రిపోర్టులో పేర్కొందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనికి సంబంధించిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) కార్యకలాపాలు క్రియాశీలకంగా ఉన్న రాష్ట్రాలకు సంబంధించిన ప్రశ్నకు కిషన్ రెడ్డి బదులిచ్చారు. నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఎన్ఐఏ) దర్యాప్తు ప్రకారం కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, బీహార్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, జమ్ముకశ్మీర్‌లో ఐఎస్ ఉగ్రవాదులు క్రియాశీలకంగా ఉన్నట్లు చెప్పారు. అసోం ఒప్పందంలోని 6వ నిబంధనపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ తన నివేదికను అస్సాం ప్రభుత్వానికి సమర్పించిందని, ఈ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని సంబంధిత ప్రశ్నకు కిషన్ రెడ్డి జవాబు ఇచ్చారు.

భారత్, చైనా సరిహద్దులో చొరబాట్లు లేవుభారత్, చైనా సరిహద్దులో గత ఆరు నెలలుగా ఎలాంటి చొరబాట్లు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు బుధవారం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఒక ప్రశ్నకు సమాధానంగా రాజ్యసభకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. 'భారత్, చైనా సరిహద్దులో చొరబాట్లను నియంత్రించేందుకు ప్రభుత్వం బహుముఖ విధానాన్ని అవలంబించింది. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంట బహుళ-అంచెల విస్తరణ, మెరుగైన నిఘా, సమన్వయం, సరిహద్దులో ఫెన్సింగ్, సాంకేతిక పరిష్కారాలను అమలు చేయడం వంటి అనుకూలమైన చర్యలు ఇందులో ఉన్నాయని రాయ్ చెప్పారు. మరోవైపు పాకిస్థాన్ సరిహద్దులో చొరబాట్లపైనా ఆయన సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 47 చొరబాటు ఘటనలు జరిగాయని తెలిపారు. పాక్ సరిహద్దులో ఏప్రిల్ నెలలో గరిష్ఠ సంఖ్యలో ఉగ్రవాదుల చొరబాట్లు జరిగినట్లు రాజ్యసభకు సమాధానమిచ్చారు.

కేసులు తగ్గించామనడానికి ఆధారాలు ఉన్నాయా?

రాజ్యసభ చర్చలో నిలదీసిన ఆనంద్ శర్మ

న్యూఢిల్లీ,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): ప్రధాని మోడీ అకస్మాత్తుగా లాక్‌డౌన్ ప్రకటించడంతో యావత్ దేశం షాక్‌కు గురైనట్లు కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఆనంద్ శర్మ ఆరోపించారు. కోవిడ్19 మహమ్మారిపై రాజ్యసభలో చర్చ జరిగిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున ఆనంద్ శర్మ మాట్లాడారు. లాక్‌డౌన్ వల్ల 14 నుంచి 29 లక్షల వరకు పాజిటివ్ కేసుల సంఖ్యను తగ్గించామని ఆరోగ్య మంత్రి చెప్పారని, దానికి ఏమైనా శాస్త్రీయ ఆధారం ఉందా అని ఆయన ప్రశ్నించారు. మెడికల్ ప్రొఫెషనల్స్ వివక్షకు గురైనట్లు ఆయన ఆరోపించారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం మాట్లాడాలని ఆయన సూచించారు. 70 శాతం ఐసీయూ బెడ్స్ అన్నీ ప్రైవేటు హాస్పిటళ్లలో ఉన్నట్లు చెప్పారు. లాక్‌డౌన్ ప్రకటన చేయడానికి ముందు రాష్ట్రాలతో కేంద్రం సంప్రదించాల్సి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. లాక్‌డౌన్ వేళ వసల కూలీల వెతలను ప్రపంచం అంతా చూసిందని విమర్శించారు. ఒకవేళ క్వారెంటైన్ సెంటర్లను ముందే ఏర్పాటు చేసి ఉంటే, గ్రామాల వరకు వైరస్ చేరి ఉండేంది కాదన్నారు.

జీతాల కోసం ప్రైవేట్ టీచర్ల ఆందోళన

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): ప్రైవేటు టీచర్లు అసెంబ్లీని ముట్టడించారు. ఆరు నెలల నుంచి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రైవేటు టీచర్లు అసెంబ్లీని ముట్టడించారు. కేసీఆర్ సారు మమ్మల్ని ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. తమకు ఆరు నెలలుగా.. యాజమాన్యాల నుంచి రావాల్సిన జీతాలు చెల్లించేలా సీఎం కేసీఆర్ చొరవ తీసుకోవాలి అంటూ నినాదాలు చేశారు. నల్గొండ, జగిత్యాల జిల్లాలకు సంబంధించిన ప్రైవేటు టీచర్లు అసెంబ్లీని ముట్టడించారు. మూడు లక్షలకు పైగా ప్రైవేటు టీచర్లు నిరుద్యోగులుగా మారిపోయారు.

అనుమతి లేకుండా ఫ్లెక్సీలు

షాపింగ్ మాల్స్‌కు భారీగా జరిమానాలు

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): నగరంలో అక్రమ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, బ్యానర్లపై జీహెచ్ఎంసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలు ఉల్లంఘించిన షాపింగ్ మాల్స్‌కు భారీ జరిమానా విధించింది. అమీర్‌పేటలోని చెన్నై షాపింగ్ మాల్‌కు రూ. 4 లక్షల జరిమానా, వీఆర్‌కే సిల్క్స్‌కు రూ. 2 లక్షలు, ఎస్సార్ నగర్ బజాజ్ ఎలక్ట్రానిక్స్ కు రూ. లక్ష జరిమానా విధించింది జీహెచ్ఎంసీ. అక్రమంగా ఏర్పాటు చేసే హోర్డింగ్‌లు, బ్యానర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్ర విద్యుత్ చట్టం

పేదలకు,రైతులకు ఉచిత కరెంటు ఇచ్చే అవకాశం కోల్పోతాం
మండలిలో తీర్మానం సందర్భంగా మంత్రి జగదీశ్వర్ రెడ్డి
విద్యుత్ బిల్లును వ్యతిరేకిస్తూ మండలి ఏకగ్రీవ తీర్మానం
అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేసిన ఛైర్మన్

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్ర నూతన విద్యుత్ చట్టం ఉన్నదని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. ఈ చట్టం వల్ల పేదలకు,రైతులకు ఉచిత కరెంటు ఇచ్చే అవకాశం

ఉండదని చెప్పారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లుక

బాల వికాసం

4

బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల

(ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)



(గత సంచిక తరువాయి)

ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్.శర్మ కలం నుండి జాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

-సంపాదకులు

ఆ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తుండగా కాలింగ్ బెల్ మోగింది. గేటు లోపలినుంచి వచ్చిందెవరా అని చూసాడు రాము. గేటు బయట ఎవరో వ్యక్తి తన చేతిలో ఓ పోస్టు కవర్ లాంటిది పట్టుకొని నిలబడి ఉన్నాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు రాము.

"నాగమణి గారి పేరు మీద రిజిష్టర్ పోస్టు వచ్చింది" బయట నిలబడి వున్న వ్యక్తి చెప్పాడు.

"అయితే నాకివ్వండి నేను పంపిస్తాను లోపలికి."

"అలా వీలు కాదు. ఇది వాళ్ళకే ఇవ్వాలి. రిజిస్టర్ పోస్టు. వారే సంతకం చేసి తీసుకోవాలి."

"ఫరవాలేదు. నేను సంతకం చేస్తాను."

"సారీ సర్! నా ఉద్యోగం పోతుంది. మొన్ననే ఇలా వేరేవాళ్ళకు ఇస్తే అది చేరాల్సిన వాళ్ళకు చేరలేదని నామీద కంప్లైంట్ చేసారు. దయచేసి వారినే పిలవండి!" ప్రాధేయ పడుతున్నట్టు అన్నాడు.

"సరే ఉండు!" అంటూ రాము లోపలికి వెళ్ళాడు. అప్పటికే గేటు పక్కన కట్టేసి ఉన్న ఆల్సేషియన్స్ భయంకరంగా మొరగడం మొదలుపెట్టాయి.

రాము లోపలికి వెళ్ళేసరికి నాగమణి తొట్లెలో ఉన్న బాలవర్ధన్ మొహం మీదికి వంగి, ప్రేమగా పలకరిస్తూ మాట్లాడుతున్నది. ఆ పిల్లాడు తల్లి మెడలోంచి ముందుకు జారిన లాకెట్‌ను వింతగా చూస్తున్నాడు.

"ఏరా కన్నా! ఇది నచ్చిందా? నీకు కావాలా? ఇదిగో తీసుకో" అంటూ తన మెడలోని ఆ సన్నటి గొలుసును తీసి పిల్లాడి మెడలో వేసింది.

"అమ్మా! మీకేదో రిజిస్టర్ పోస్టు వచ్చిందట. మీరే సంతకం చేసి తీసుకోవా లట" అంటూ రాము లోపలికి వచ్చాడు.

"ఏ... నీకు ఇవ్వడటనా?" నాగరత్నం అడిగింది.

"లేదమ్మా! అది రిజిష్టర్ పోస్ట్ అట. నాగమణెమ్మ గారికే ఇవ్వాలట."

"సరే పద!" అంటూ బయటకు నడిచింది నాగమణి. రాము ఆమె వెంటనే కదిలాడు.

గేటుకు బయట నాలుగడుగుల దూరంలో నిలబడి ఉన్నాడా మనిషి. భుజాన పోస్టుబ్యాగు, చేతిలో ఓ కవర్‌తో. సన్నగా పొడవుగా ఉన్నాడు. అతణ్ణి చూస్తూ భయంకరంగా అరుస్తున్న కుక్కలకు బాగా భయపడ్డట్టున్నాడు. గేటుకు నాలుగడుగుల దూరం జరిగి నిలబడి ఉన్నాడు.

"గేటు దగ్గరకు చేరుకున్న నాగమణి "బాబూ ఇలా వచ్చి కవర్ ఇస్తావా?" అని అడిగింది.

"అమ్మా! అవి నా ప్రాణం తీసేలా ఉన్నాయి. కుక్కలంటే నాకు చాలా భయం. మా అన్న ఈ మధ్యనే కుక్క కరిచి రేబీస్‌తో చచ్చిపోయాడు" అన్నాడు అక్కడే నిలబడి.

"ఫరవాలేదు. అవి కట్టేసే ఉన్నాయి" అన్నాడు రాము.

"లేదు. మీరే ఇలా రండి దయచేసి" అంటూ రెండడుగులు ముందుకు వేసి నిబడ్డాడు.

అతని భయం చూసి నవ్వు, జాలీ కలిగాయి నాగమణికి. సరేలే అని, "రామూ! చిన్న గేటు తెరూ! " అంటూ రామువైపు చూసింది.

రాము అయిష్టంగానే ఆమెను కాదనలేక చిన్న గేటు తీసాడు. తాను ముందు బయటకు వెళ్ళి, అతని పక్కన నిలబడ్డాడు. నాగమణి వచ్చి కవర్ కోసం చేయి చాపింది. అతడు ఆ కవర్ ఆమె చేతికి అందించాడు. అంతే....కళ్ళముందు ఏవో మెరుపులు మెరిసి నట్టు...తరువాత ఏం జరిగిందో వాళ్ళకు తెలియదు. అంతా చీకటిగా అనిపించింది. స్పృహ తప్పుతున్నట్టు అనిపించింది.

కళ్ళు తెరిచే సరికి అక్కడ ఆ పోస్ట్‌మెన్ కానీ, నాగమణి కానీ ఎవరూ లేరు. రాము కంగారు పడుతూ అటూ ఇటూ చూసాడు. వీధిలో ఎవరూ కనిపించడం లేదు. లోపలికి వెళ్ళిందేమో అని గబగబా చిన్న గేటు లోంచి లోపలికి వచ్చి చూసాడు. అక్కడా ఎవరూ లేరు. కుక్కలు అరవడం మానేసి అలా చూస్తూ ఉన్నాయి.



ఇంటి లోపలికి "అమ్మా!" అని నాగమణిని పిలుస్తూ వచ్చాడు.

ఒంటరిగా వచ్చిన రామును చూస్తూ "నాగమణి ఏది?" అని అడిగింది నాగరత్న. "లోపలికి రాలేదా? అయ్యో! ఏమైందో!.." అంటూ కంగారు పడుతూ మళ్ళీ బయటకు పరిగెత్తాడు రాము.

నాగమణి ఏమైందోనని అందరూ అంతటా వెతికారు. కానీ ఆమె ఎక్కడా కనిపించలేదు. వాళ్ళలో కంగారు, ఆందోళన పెరిగి పోయాయి. కాళ్ళూ చేతులూ ఆడడం లేదెవరికి.

రోడ్డు మీద వెళ్ళే వాళ్ళు కొందరు 'ఆ సమయంలో వాళ్ళ ఇంటి ముందు నుంచి ఉన్న తొవ్వలో ఓ వ్యక్తిని చూసామని' చెప్పారు. 'అతడు చాలా బలంగా, దొడ్డుగా, పొట్టిగా ఉన్నాడని' చెప్పారు. మరికొందరు 'నల్లటి ఆకారంలో వికారంగా ఉన్న మనిషి ఒకడు వెళ్ళాడని, వాడు ఆరున్నర అడుగుల ఎత్తు ఉన్నాడని' చెప్పారు. ఇంకొందరు 'ఓ నల్లటి కుక్కను వెంట బెట్టుకొని ఓ ముసలివాడు ఎవరో ఈ దారిన వెళ్ళడం చూసామని' చెప్పారు. 'అతడు నడుచుకుంటూ వెళ్ళాడని, కాదు బైక్ మీద వెళ్ళాడని, కాదు కారులో వెళ్ళాడని, మాయమై పోయాడని' ఇలా రక రకాలుగా జనం మాట్లాడారు. వీటిలో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియలేదు.

అతడెవరో ఎవరూ చెప్పలేక పోయారు. అతణ్ణి అంతకు ముందుకానీ, ఆ తరువాత కానీ ఎవరూ చూడలేదు. ఒకరు చెప్పిన దానికీ, మరొకరు చెప్పిన దానికీ పొంతనే లేదు. కులకర్ణి తాతయ్య పోలీసు కంప్లైంట్ ఇచ్చారు. ఫోన్లు చేసి చాలా మందితో మాట్లాడారు. చివరికి మీ నాన్నకు ఫోన్ చేసి నాగమణి మాయమై పోయిన విషయాన్ని చెప్పారు. మీ నాన్న ఆ రోజు రాత్రే హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చేసారు.

మీ నాన్నకూ, మీ తాతయ్యకూ చాలా పలుకుబడి ఉండేది. ఆనాటి రాష్ట్ర మంత్రుల్లో వాళ్ళకు కొందరు దగ్గరి మిత్రులున్నారు. మీ నాన్నకు తెలంగాణ ఉద్యమంలో ఓ ముఖ్య మైన ప్రజా నాయకునిగా కూడా గుర్తింపు ఉంది. కనుక ప్రభుత్వం పోలీసుల ద్వారా మాత్రమే కాకుండా, తన ఇతర యంత్రా ంగాన్ని కూడా ఎంతగానో ఉపయోగించి మీ అమ్మ కోసం చాలా వెతికించింది. రాష్ట్రమంతా గాలించింది. పత్రికలు కూడా పట్టించుకొని రాసాయి. మీ అమ్మ జాడ తెలిపితే అయిదు లక్షల బహుమతిని కూడా ప్రకటించారు. చివరికి మీ అమ్మను వెతుకుతూ వెళ్ళిన మీ నాన్న కూడా మళ్ళీ తిరిగి రాలేదు. తనుకూడా ఏమైపోయాడో ఈనాటికీ తెలియలేదు.

పిల్లలూ, ఆడవాళ్ళూ అదృశ్యమౌతున్న వార్తలు పత్రికల్లో కనబడుతూనే ఉన్నాయి. అన్నిటికీ ఒకటే కారణం కాకపోవచ్చు. కానీ కొన్ని అదృశ్యాలు మాత్రం అసాధారణంగా ఉంటున్నాయి. "పోలీసులు కొంత కాలం వెతికి, గాలించి ఊరుకుంటున్నారు. దొరికిన వాళ్ళు దొరకుతున్నారు. జాడ తెలియకుండా పోయిన వాళ్ళు 'మిస్సింగ్' కేసులుగా అలా కాలగర్భంలో మిగిలిపోతున్నారు.'' విచారంగా చెప్పింది నాగరత్న.

(మిగతా వచ్చేవారం..)

"పోలీసులు కొంత కాలం వెతికి, గాలించి ఊరుకుంటున్నారు. దొరికిన వాళ్ళు దొరకుతున్నారు. జాడ తెలియకుండా పోయిన వాళ్ళు 'మిస్సింగ్' కేసులుగా అలా కాలగర్భంలో మిగిలిపోతున్నారు."

జానపద ప్రపంచంలో బుర్రకథగా ప్రారంభమై, కథగా మారి తరతరాలుగా మనకు అందివస్తున్న అపూర్వ సాహిత్య, సాంస్కృతిక వారసత్వ సంపద బాలనాగమ్మ కథ. ఇది సుమారు ఎనభై ఏళ్ళ కిందటే సినీమాగా వచ్చింది. ఊరూరా నాటకాలుగా ప్రదర్శింప బడింది. ఇప్పుడు ఆరవ తరగతిలో పాఠ్యాంశంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పిల్లల సినీమా 'హారిపోటర్'కూ బాలనాగమ్మ కథకూ ఎన్నో దగ్గరి పోలికలు నాకు కనబడ్డాయి.

మారిన కాలమాన పరిస్థితులలో, ఆనాటి ఆకథ ప్రేరణతో ఈనాటి టీనేజీ పిల్లలకోసం నేను కల్పించి రాసిన బాలవర్ధన్ కథ ఇది. అది తల్లి తరం కథ అయితే ఇది నేటి కొడుకు తరం కథ. ఈ కథను నేను మార్చిలో మొదలు పెట్టి, మేలో పూర్తి చేశాను. అందుకే ఈనాటి పరిస్థితులు దీనిలో కనిపిస్తాయి. ఈనాటి పిల్లలకూ, తరువాత పెద్దలకూ నచ్చేలా ఉండడానికీ, సహజత్వానికి దగ్గరగా అనిపించేలా రాయడానికీ ప్రయత్నం చేశాను. ఇది బాగుందనిపిస్తే ఆ గొప్పదనమంతా నా ఈరచనకు ప్రేరణనిచ్చిన మన బాలనాగమ్మ కథది. బాలనాగమ్మ కథను సృష్టించిన ఆ అజ్ఞాత జానపద రచయితలకూ, తరతరాలుగా నిలబెట్టిన జానపద కళాకారులకూ దీన్ని అంకితం చేస్తున్నాను. నా ఈ ప్రయత్నం మీద మీ అమూల్యమైన అభిప్రాయాలను కోరుతున్నాను.

-వి.ఆర్.శర్మ





-డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

బాల గేయం

గురుశిష్యుల పొడుపుపాట-2

గురు: విద్యాబుద్ధులు నేర్పేవాడు
విధిగా అటులే వుండేవాడు
పలు శిష్యులు పాలకులైనా
పంతులుగానే మసలే వాడు
ఎవరో ఎవరో చెబుతావా?

శిష్యుడు: ఆఁ: చెబుతా చెబుతా గురుదేవా!
ఆ పంతులు మీరే గురుదేవా!

గురు: సిరి పెరిగినచో శీఘ్రంగా
సింహంలా గర్జించేది
విజ్ఞత మరచి విబుధులనైనా
అజ్ఞతతో దూషించేది
ఏదో ఏదో చెబుతావా?

శిష్యుడు: ఆఁ: చెబుతా చెబుతా గురుదేవా!
అది అహంభావమే గురుదేవా!

గురు: ఎక్కడి కేగిన చక్కంగా
ఎంతో విలువను పెంచేది
వినయముతో రాణించేది
విజయాలను సమకూర్చేది
ఏ దొంగలకూ దొరకనిది
ఎప్పుడు వెంటనె వుండే నిధి
ఏదో ఏదో చెబుతావా?

శిష్యుడు: ఆఁ! చెబుతా చెబుతా గురుదేవా!
ఆ నిధియే విశిష్ట విద్య కదా?

- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

చిట్టి చేమంతులు

పండ్లు
తింటేనే కదా!
మనిషికి
రుచి తెలిసేది.

చదువు
వస్తేనే కదా!
విద్యార్థికి
గురువు విలువ తెలిసేది

ప్రమాదం
జరిగితేనే కదా!
మనిషి
గుణపాఠం నేర్చేది.

రోగం
తగ్గితేనే కదా!
మనిషికి
వైద్యుని విలువ తెలిసేది.

-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
సెల్ నెం.9441333315

రామచిలుక

రామచిలుక వచ్చింది
చెట్టుపైన వాలింది
రామ రామని పిలిచించి
చిలుకలన్ని చేరాయి
జామకాయలను కొరికాయి
కొమ్మలపై ఆడాయి
పండ్లనన్ని రాల్చాయి
అడుగుల శబ్దం విన్నాయి
తుర్రుమని ఎగిరాయి
బామ్మ కింద పండ్లనుచూసింది
ఒడినిండా ఇంట్లోకి తీసుకొచ్చింది
చిలక కొట్టిన పండ్లని పంచింది
తమ్ముడు, చెల్లి, నేను తిన్నాము
మంచిగున్నయని మురిసాము
చిలుకలను చూడగానే రామ రామ అన్నాము
చెట్లపై చెలిమితో సాగాము

-ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

దీపము

చిరు చీకటి ముసిరెను
నీడ లేమో భయ పెట్టే.
అమ్మ దీపం వెలిగించి
గూటి లోన పెట్టెను.
దీపంకు బొట్టు పెట్టి
చేతులెత్తి మొక్కెను.
చీకట్లు తొలగి పోయి
వెలుగంతా వచ్చెను.
భయమంతా పారిపోయి
సంతోషం వచ్చెను.
దీపమే జ్ఞానమిచ్చు నని
గురువు గారు చెప్పెను.
సంధ్య వేళ దీపము
ప్రతి ఇంటికి శుభము లిచ్చు.
చదువుకునే టప్పుడు
నా వెంటే ఉంటుంది.
అన్నం తినే నప్పుడు
అమ్మ చేతిలో ఉండును.
పాఠాలు చెప్పినప్పుడు
నాన్న దగ్గర ఉండును.
చిట్టి కథలు చెప్పినప్పుడు
నాయనమ్మ కే సొంతము.
ఇల్లాలే ఇంటికి దీపమని
పెద్ద లంతా చెప్పిరి.
దీపమే సర్వస్వమని
దేవుళ్లు నుడివిరి.

-లక్ష్మి మదన్
9959186838

బడి చిన్నబోయింది

చిన్నారుల గలగలలు లేక
బడిగంట మూగబొయింది
బుడతల తోడులేక
బడి చిన్నపోయింది

వెచ్చని శ్వాసల ఆచ్ఛాదన లేక
తరగతి గది ముడుచుకున్నది
బుడి బుడి అడుగుల దరువు లేక
మైదానం మిన్నకున్నది.

వల్లెవేసే నేస్తాలు లేక
పుస్తకాలు నిదురిస్తున్నాయి
చిట్టిచేతుల కలంరాతలు లేక
కాగితాలు మక్కుతున్నాయి.

తివాచీపరచిన గడ్డి
చిరుగాలివీచే కొమ్మలు
అలసి సేదదీరే పిల్లల కానక
కదలక మెదలక మిన్నకున్నాయి.

ఇది
క్రియాశీల అభ్యాసాన్ని
సుపాత్వస్తకు చేర్చి
విద్యాలయాలను మూయించిన
పెను గ్రహణం
అనివార్య విరామపు ఒడిలో
పిల్లలు, పంతుళ్ల
అవాంఛిత విశ్రామం.

- ఎస్. మోహన్ గౌడ్
సెల్: 9440464503

జ్ఞాన పర్వత శిఖరాగ్రం
అధిరోహించలేని చేతకాని మనసు
దానికనుకూలంగా సిద్ధాంతం లేవనెత్తి
అహం చల్లబరచుకుంటుంది.
అది అభివృద్ధి నిరోధకం.

-మునిమడుగుల రాజారావు

భారత భావిపౌరులు

పిల్లల్లారా బడి పిల్లల్లారా!
భారత భావి పౌరుల్లారా!!
మీరే రేపటి భారత దేశ పాలకులు
మీరే రేపటి భారతదేశ రక్షకులు ॥భారత॥

గొప్ప గొప్ప చదువులెన్నో చదవాలి
మీ మేధస్సు తో భరతభూమి వెలగాలి
కన్నవారి కలలు తెలుసుకోవాలి
ఆ కలలు నిజం చేయ ప్రతినబూనాలి ॥భారత॥

తల్లిదండ్రులను గురువుపెద్దలను గౌరవించాలి
వినయవిధేయత సంస్కారంతో మెలగాలి
పదుగురిలో మీ గొప్పతనం పరిమళించాలి
ఎదుగుతూనే మీరంతా ఒదిగి ఉండాలి ॥భారత॥

సత్యం ధర్మం సమతా మమతా మరవద్దు
నీతి నిజాయితీ సేవానిరతి విడవద్దు
మంచితనం మానవత్వం మార్గంలోనే నడవండి
బీద సాదలను ఆదరించడం మరవకండి ॥భారత॥

కులమతాలు మీ మనసుకు అంటకూడదు
కలనైనా చెడు యోచన చేయకూడదు
మల్లెలాగ మీ అందరి మనసులుండాలి
భరతమాత మీ ప్రతిభచూసి పొంగిపోవాలి ॥భారత॥

-బూర దేవానందం
9494996143

మేల్కొన్న ప్రపంచం

అకస్మాత్తుగా మేల్కొంది
ఆదమరిచి నిద్రిస్తున్న ప్రపంచం
ఓ భయంకర సుడిగుండంలో.
ఆలింగనాలు, ముద్దులు
అనుకోకుండా రూపు దాల్చాయి
మారణాయుద్ధాల వలె.
వింత కాకపోయినా
ప్రేమించేవారిని కలవకపోవడం
మారింది కొత్త పోకడగా.
ఆరుబయట ఆటాపాటల అలికిడి
వినిపించడం లేదు నిన్నటి వలె.
లేవు జీవితంలో పూర్వపు కాంతులు
ఉరుముల మెరుపుల
భయభ్రాంతులు తప్ప.
లేవు ఇరుగుపొరుగుల పలకరింపులు
జలదరింపులు తప్ప.
కనపడని కరోనా ముప్పు పొంచి
ఉందని దివారాత్రాలు ఉలికి పాట్లు.
అందం, ఐశ్వర్యం, అంతస్తు.. అన్నీ
కరోనా ముందు బలాదూర్.
ఇవ్వలేవు అవేవీ
ఆయువు నిలిపే ప్రాణవాయువు.

బందీ అయ్యాడు మనిషి
గృహపంజరంలో కరోనాకు జడిసి.
మహమ్మారి ఇంతలా విజృంభించినా
ఆగిపోలేదు ప్రపంచం.
మనిషి ఉన్నా, లేకున్నా
ప్రపంచం నడుస్తూనే ఉంటుందని..
మనిషి మళ్ళీ తిరిగొస్తే
మామూలు 'అతిథి' గా తప్ప
'పెత్తనం' చెలాయించడానికి కాదని..
జీర్ణించుకోలేని ఓ మహా సందేశాన్ని
మానవాళికిస్తూ.

-ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007



నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 17-9-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

నమ్మలేని నిజాలు

కవికైతలు
గుజగుజ రేకులు
ఓ పరంపర.

పాత చట్టాలు
పిట్టగోడపై పిల్లి
కాసుసైగలు.

ఉత్తర కార్తె
రైతు భరోసకాలం
పాడిపంటలు.

దారులు వేరు
మారిన యుద్ధనీతి
ఎదిగె మార్గం.

బియ్యం పప్పులు
శరీర ఇంధనాలు
రోగాలు దూరం.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

సామాన్యుల రైతు స్కీం
కర్షకుడే పాలకుడా ?
అడుగుపడ్డ బడుగుజీవి
దున్నుకునే హాలికుడా ?

చట్టం కాపాడండోయ్
బక్కరైతు హక్కులు !
పేరున్నా పెద్దవాళ్లు
పెట్టవద్దు చిక్కులు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ప్రగతిశీల భావాల సమాహారం..!

"రైతు..
మన పొట్టల్ని నింపేందుకు
దుఃఖాన్నిపెట్టుబడి పెట్టే
భూమిపుత్రుడు" అంటూ రైతన్నను ఉన్నతంగా చిత్రిస్తూ.. కవి తంగళ్ళపల్లి కనకాచారిగారు "సాహసి" పేరుతో తమ ఏడో కవితా సంకలనాన్ని వెలువరిం చారు.

ఎండ చురుక్కున మండు తున్నా
కవిత్వమే శీతల పానీయంగా భావించే కవి కనకాచారిగారు అక్షరాల పొత్తుతో లేతగా తొంగి చూస్తున్న మనసు ఆహ్లాదమై మెరుస్తుందని తమ భావాలకు ఈ గ్రంథంలో చోటు కల్పించారు. పాత్రికేయునిగా..అపార అనుభవ మున్న ఆయన ఎంపిక చేసుకున్న కవితా వస్తువులన్నీ..మనం మన నిత్యం చూసే ఘటనలు.. సంఘటనలు కావడం విశేషం. అభివ్యక్తిలో ఆర్తి ఆర్ద్రతతో పాటు.. సామాజిక చైతన్యం కోసం ఆయనపడే ఆరాటం కనిపిస్తుంది.మానవతావాదానికి పెద్దపీట వేస్తూ రాసిన ఇందలి కవితల్లో.. జీవం ఉంది. జీవితమూ ఉంది. అక్కడక్కడా ధిక్కార స్వరమూ కానవస్తుంది.

ప్రేమ గోలను అక్షరాల్లో బంధిస్తూ
ఓ చిరుగాలిలా
సెలయేరులా
ఓ పూల పరిమళంలా.. ప్రేమ అని ఆవిష్కరిం చారు. చిరుగాలిలా ఉండే.. ప్రేమికుల భాషకు పట్టం కడుతూ..సంభాషణా సంద్రంపై సాగే అలల్లా.. కవిత్వీకరించారు. కురుస్తున్న ప్రేమ వెన్నెల్లో.. అస్తిత్వంలోనే దేహాలు.. ఆత్మలు ముడిపడి వుంటాయని వివరించారు.

దేహాన్ని సైతం
అగ్నికి ఆహుతి చేసే
నిద్రపట్టని కణకణమంటే విశ్వాసం
వికాస ఉద్యమం.. ఓయూ విద్యార్థి!

ఓ నిత్య సంచలనం
ఉద్యమ బావుటా
తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి..ఓయూ!
ఓయూ గడపకు సలాం..!
ఓయూను పట్టించుకోండి నేతల్లారా అంటూ కవి హితవు పలికారు.

"దుఃఖిత కావ్యం" కవితలో రోహిత్ ఓ ధిక్కార స్వరంకు అద్దం పట్టారు.

తెలంగాణను బంగారు తెలంగాణగాచేసి చూపాలనీ..పేదల అభ్యున్నతే పాలకుల లక్ష్యం కావాలనీ..హింసలేని తెలంగాణ మన స్వప్నం.. అంటూ 'పునరంకితం' కవితను రాశారు.

'పనివేళలో' కవితలో వనితలు పనిచేస్తున్న చోట పడే వ్యథలను ఏకరువు పెట్టారు. తెల్లారిందంటే ఉరుకులు.. పరుగులు.. మానసిక వికలాంగుల వ్యూహాల శిభిరాలను ధ్వంసం చేస్తూ పనివేళల్లో ఆమె పనితీలికేమి కాదని తేల్చి చెప్పారు. యుద్ధం అనివార్యమైన చోట వీర వనితలు కావాలని హితవు పలికారు.

'వానకోసం' కవితలో చెరువును త్యాగమయిగా అభివర్ణించారు.

మానవీయతను.. విజ్ఞానాన్ని సొంతం చేసుకున్న అబ్దుల్ కలాంకు నివాళి సమర్పిస్తూ అక్షరాంజలి ఘటించారు.

'పెనవేత' శీర్షికలో ప్రకటించిన భావాలు చాలా బాగున్నాయి. బంధాలు.. అనుబంధా లను..అందమైన పదబంధాల్లో బంధించిన తీరు బాగుంది.

పుస్తక సమీక్ష



"అక్షరాల పొత్తుతో లేతగా తొంగి చూస్తున్న మనసు ఆహ్లాదమై మెరుస్తుందని తమ భావాలకు ఈ గ్రంథంలో చోటు కల్పించారు"

అంతా కల్తీ
కల్తీ విత్తనం..
కల్తీ పురుగుమందు
ఇంకా..
రుణబాధ
ప్రకృతి వికృతై..
అన్నదాత బతకెట్లా? అని ప్రశ్నించారు.
పస్తులుండీ
రైతిచ్చిన ధాన్యాన్ని విదేశీ గాదెలను
నింపాలి..
సరళీకరణ.. ఓ భూతం అని వ్యాఖ్యానించారు.
ప్రపంచీకరణ
కలల్ని ఊదేది
స్వేచ్ఛకు కత్తెర వేసేదని ఆవేదనను వ్యక్తపరిచారు.

రైతన్నలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్న అర్థం ధ్వనించేలా "ఆలోచించండి" కవితను కొనసాగించారు.

"బహిష్కృతుడు"కవితలో కవి ప్రకటించిన భావాలు ఆలోచనాత్మకంగా కొలువుదీరాయి. సుదీర్ఘంగా రాయ బడిన కవితలో ఇరవై ఐదు ఖండికలో విభిన్న అంశాలను ప్రస్తావించారు.

ఒకే దృశ్యం రెండు భావాలుగా
ప్రేమైతే సుందరంగా
ఆవేశమైతే..వికారంగా
ఏది నీ యదలో ముదురుతుందో అదే..
చిన్న బతుక్కి ఇన్ని నిర్వచనాలా? అని ప్రశ్నించారు. బహిష్కృతుడే చరిత్రను కొత్తగా లిఖిస్తాడనే నిజాన్ని..తెలిపారు. ఇప్పుడు కావల్సింది ప్రేమే.. స్నేహమే.. అంటూ ముగించిన తీరు బాగుంది.

'చిలుక' శీర్షికతో రాసిన కవితలో యువతను జాగృతపరిచే ప్రయత్నం చేశారు.

నెట్, సెల్, సినిమాలు..ప్రేమలు.. వినోదాలు.. విందులు తీరికేది యువతకు? అంటూ ప్రశ్నించారు.

కేరీర్ సరే
ఆశల రెక్కలతో కలల ఉన్మాదంయువతది అంటూ వాపోయారు.

తెలంగాణ ఉద్యమ కాలంనాటి ఘటనలను.. ఆ తర్వాతి సంఘటనలను ప్రస్తావిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని.. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల గురించి ఆర్ద్రంగా ప్రకటించారు.

"కుంపటి" శీర్షికతో రాయబడిన ఈ కవితలో..
ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఓ ఉద్యత్ ప్రవాహం
ఓ యుద్ధవీరుని ఉరిమే ఆకాంక్ష

'మగువ' యొక్క ఔన్నత్యాన్ని చాటుతూ మరో కవితరాసి.. ఓ మగువ నీకు మ్రొక్కెదన్ అంటూ మగువ యొక్క సమ్మోహన సౌందర్యాన్ని, చైతన్యపు లయలాంటి అస్తిత్వాన్ని, వెలుతురుచిందే కన్నులను పండువెన్నెల వంటి మోమును వర్ణిస్తూ రాశారు.

దైవం తన అంశను కలిపి స్త్రీగా కుప్పపోశాడా?
జనారణ్యంలో తిరిగాడుతుంటే..
చల్లని వనమై.. చిరునవ్వుల సందడై
మనసును ఉల్లాస భరితంచేసేది నీవేగా! అంటూ మగువను కొనియాడారు.

స్మిత సిరిచందనం
తీపి మాటలతో ఎదను కట్టి పడేసే
రహస్యమేదో తెలుసు నీకు అంటూ
మగువ యొక్క బహుముఖాలను.. బహురూపాలను వర్ణించారు.

'ప్రాణ ప్రతిష్ఠ' కవిత ద్వారా.. మొక్కలు నాటుమని హితవు పలికారు.

మీ చిట్టి చేతులు బంగారం కాను..
రెండు మొక్కలు నాటండని ముగించారు.

'ప్రగతిశీలత' కవిత యొక్క ఎత్తుగడ చాలా కవితాత్మకంగా ఉంది.

మతాల సారం మానవత్వమే అయినప్పటికీ.. ధ్వంస రచన సాగుతుండటంపట్ల తమ వేదనను ప్రకటిస్తూ 'నేనేమీ మాట్లాడలేను..'' కవితను రాశారు.

ఇలా కవి కనకాచారిగారు ప్రతి కవితను ఔచిత్య వంతమైన అభివ్యక్తితో తీర్చిదిద్దారు.

పుస్తకం చివరన శ్రీ విరాట్ విశ్వకర్మ స్తపమును జోడించారు. ప్రగతిశీల భావాల సమాహారంగా తీర్చిదిద్దిన ఇందలి కవిత్వంలో.. కవి యొక్క ఉత్తమ మనస్తత్వంతో పాటు.. సామాజిక చింతనను అడుగడుగునా చూడగలం. తెలంగాణ పట్ల ఆయనకున్న మక్కువను మెచ్చుకోగలం. మనకబారే మానవ సంబంధాలకు మెరుగులు దిద్దాలన్న సంకల్పాన్ని గమనిస్తాం. ఆలోచనాత్మక ముఖ చిత్రంతో వెలువడిన ఈ గ్రంథానికి అందరం స్వాగతం పలుకుదాం.

ప్రతులకు: తంగెళ్ళపల్లి కనకాచారి
ఇ.నెం. 1-606
సిపిఐ కాలనీ, బాపూజీనగర్ (జవహర్ నగర్)
కాప్రా మండలం
మేడ్చల్ , మల్కాజిగిరి జిల్లా-500 087

-దాస్యం సేనాధిపతి
సెల్: 9440526644

వీడు కనిపించని దొంగ

వాడు నిజంగా దొంగే
స్టీలు సమాన్లంటే వాడికిష్టం
వాటి వెనుక కొన్ని గంటలు దాక్కుంటాడు.
బట్టలంటే ఇష్టం
కొంతసేపు వాటిని అంటిపెట్టుకుంటాడు.
కూరగాయలంటే ఇష్టం
కొంతసేపు వాటిపై వాలుతాడు.
రూపాయలన్నా ఇష్టమే
వాటిని తన కనుసన్నల్లో ఉంచుతాడు.
దొంగకు చెప్పులే చాలట
దొరికిన దాన్నల్లా పట్టుకుంటే విడువడు.
నీళ్లలోనూ గాలిలోనూ
నీ దగ్గరా నా దగ్గరా ఏముందోనని
సూక్ష్మ రూపుడై పరిశీలిస్తుంటాడు.

కనిపించని దొంగను
కష్టమే పట్టుకోవడం!
బయటికి వెళ్లితే చాలు వాడు
ప్రాణధనాన్ని దోచుకొంటాడు
వాడెక్కడ దూరుతాడోనని
భయంతో నోటికి తాళం వేసుకొంటున్నాం.
కళ్లకు గంతలు లేవుకాని
ఒళ్లు కనిపించకుండా జాగ్రత్త వహిస్తున్నాం.
ఇదెక్కడి చోద్యం
ఈ దొంగ లోకల్ దొంగ కాదు
అంతర్జాతీయంగా ఇటీవలనే
అవనిక మీదికి వచ్చిన గజదొంగ
ఎవడూ వాణ్ణి పట్టుకోలేడు.
కృష్ణుడొక చోట విశ్వరూపం చూపాడు
కాని వీడు విశ్వమంతా వ్యాపించాడు
వీని కన్న తల్లిదండ్రుల ఆచూకీ తెలిస్తే బాగుండు
పట్టుకోవడానికి, మట్టుపెట్టడానికి-
ప్రపంచమంతా ఎదురు చూస్తుంది
కనిపిస్తే మందుపెట్టి చంపాలని
మందు పాతర పేల్చాలని
ఎవరికీ చిక్కని దొంగ
మనల్ని నిదురపోనీయని దొంగ
రామ నామానికి బదులు దొంగ పేరే స్మరిస్తున్నాం
అడుగడుగున దొంగ భయం.
అణువణువున దొంగ భయం
ఇంతకా దొంగ ఇంటి బయటనే ఉన్నాడు
ఇంట్లోకి రాక ముందే భయపడుతున్నాం
మన శక్తి ముందు వాని శక్తి ఎంత?
ఊపిరాడకుండా చేసే ఆ దొంగ నెదిరించడానికి
ఇమ్యూనిటీ పెంచుకోండి
కమ్యూనిటీ అంతా కలిసిరంది!

- మసన చెన్నప్ప
సెల్:9885654381

బౌద్ధసూత్రాలే ఆసియాకు ఊపిరి..!

-డా॥ కత్తి పద్మారావు
సెల్:9849741695

చరిత్ర పొడుగునా నెత్తుటి ధారలు
సరిహద్దుల వారలో పిడిగుద్దుల సవ్వడి
అన్ని ఆధిపత్యాలు అంతరిస్తూనే వున్నాయి
మార్కెట్టు విస్తరణకు సమరం
చైనా రెండు అక్షరాలు
ఇండియా మూడు అక్షరాలు
కలిస్తే పంచశీల అవుతుంది
బౌద్ధ సూత్రాలే ఆసియాకు ఊపిరి
జీవనతత్వం జాతుల సంస్కృతులకు పునాది
బౌద్ధం జీవితాన్ని సజీవం చేసింది
సమానత్వాన్ని అందించింది
పుట్టుకకు మరణానికి అర్థం చెప్పింది.
మనిషిలో ప్రేమ స్ఫూర్తిని నింపింది
అతణ్ని అంతర్ముఖుణ్ని చేసింది
తన్ను తాను శుద్ధి చేసుకునే ధర్మాలను అందించింది
మెదడులో మానవత్వపు విత్తులు నాటింది
మనిషి సంఘజీవి..
సంఘం, ప్రకృతి సమన్వయంలో అతని శిల్పం
మనిషి మాటల్లో పరిమళాలు ఉంటేనే
జీవన సాఫల్యం చేకూరుతుంది.
కఠిన భాషలు వైరుధ్యానికి మూలం
ఏ పాలకుడైనా తన్ను తాను పాలించుకోగలిగినప్పుడే
దేశాన్ని పాలించగలుగుతాడు
తన భీరాలు, వీరాలు
మానవ హననానికి దారి తీస్తాయి సుమా!
పాలకునికి సమన్వయమే కిరీటం
అదుపు తప్పితే అంతర్ఘర్షణలే..!
ఒక్కొక్క శాస్త్రం ఒక్కొక్క పరికరాన్ని మనకందించింది
పరికరానికి మనం బానిసలం కాకూడదు
సృజనం, సృష్టి సహజ ప్రకృతులు
ఎవరి సృష్టికి వారు బానిసలైతే
సామాజిక సమతుల్యత నశిస్తుంది
వెన్నెల, చీకటి, వెలుగు సమంగా అనుభవిస్తున్నారు
ఎంతో భూమి విత్తులు విత్తక బీడువారుతుంది
బీళ్ళు బీళ్ళుగా ఊళ్ళు మారుతున్నాయి
చుక్క చినుకుతో నేల పదునుదేరుతుంది
విత్తనాలను సముద్రంలో పోస్తున్నారు
నేల, విత్తనం, మబ్బులకు సమన్వయం తప్పుతుంది
ఉత్పత్తి తగ్గుతుంది
నీరు ఉత్తుంగ తరంగాలుగా కదలిని చేరుతుంది
అక్షరం నోటిమాట దశలోనే రూపాలు మార్చుకొంటుంది
లిఖిత రూపాలకు ముసుగులు వేస్తున్నారు
ఆలోచించడం మానివేశాక మాంసపు కండలేగా మిగిలేది?
రూసో ఏమిచెప్పాడు..?
నాగరికత ముసుగులో అరాచకం వస్తుంది అన్నాడు!
సైమన్ డిబిరో పితృస్వామ్యం ఒక పెత్తనం నుండి
పుట్టింది అని చెప్పింది.
జాన్ డ్యూయి ఏమి చెప్పాడు..?
ప్రజాస్వామ్యం పెత్తనం పునాదిని కూలుస్తుందని చెప్పాడు.
అవును! సమతుల్యత లోపిస్తుంది
అనుభవం, అనుభూతి లేని ప్రవచనాలను
స్వాములు వల్లిస్తున్నారు
బలహీనమైన మెదడుల మీద పట్టు సాధిస్తున్నారు
విత్తనం గురించి తెలియనివాడు
ఖగోళ సిద్ధాంతాలు చెబుతున్నాడు
దొంగిలించినవాడు మేధావిగా పిలవబడుతున్నాడు
అవును! ఆ యానాది స్త్రీ ఇంకా ఆ చిన్న కుంటలో
నత్తలు, చిన్న చేపలు పడుతూనే వుంది
ఆమె జుట్టు నెరవలేదు
ఆమె గొంతు సరళంగా వుంది
తెల్లవారుజామున పక్షికూతతో పాటు తాను లేస్తుంది
సూర్యుణ్ణి తనలో నింపుకుంటుంది
వేపపుల్లతో పళ్ళు తోముతుంది
ఇప్పుడు అందరూ ఆమె వైపే చూస్తున్నారు
ఎండను కోల్పోయినవారంతా అభద్రతలోనే వున్నారు
మళ్ళీ ప్రకృతిలోకి ప్రవహిద్దాం..
బౌద్ధసూత్రాలు పాటిద్దాం..
పంచశీలను వరిద్దాం..
సామాజిక పునరుజ్జీవనాన్ని సాధిద్దాం..
అప్పుడే జీవితానికి వెలుగు..

వెలుగు -చీకటి

మసక మునివేళ్ళు కనురెప్పలపై
నునులేత చిలకల్లా వాలీవాలక మునుపే
మళ్ళీ కొత్తగా పుట్టినట్టుగానే ఉంటుంది.
జారిపోతున్న చీరకొంగూ సోలిపోతున్న తనువూ
సవరించుకోకుండానే
పారిపోతాయి స్వప్న సౌందర్యాలు.
వెలుగు సౌరభాలు ఇంటి నలుమూలలా
అగరు పొగలవుతాయి.
సుదీర్ఘ మౌనం తరువాత గొంతువిప్పిన
ఉషోదయం గండు కోయిల కుహూ రవాలు
కుంభవృష్టిలా ఆద్యంతం తడిపేస్తాయి

ఇహ మొదలు
ఎన్ని రూపాలో మారుస్తూ అలరింపు సేవ
రాత్రికి రాత్రి జానెడు పెరిగిన వెదురుమొక్కలా
అరవిప్పిన చూపులా వికసించే పొద్దుతిరుగుడు పువ్వులా
అర్ధరాత్రి ఎదురొచ్చిన సూర్యోదయంలా
రోజువారీ పనులను స్వాగతిస్తూ
పసికూన మనసును సమాయత్తపరుస్తూ
ఒంటికి నలుగై కంటికి మెరుపై
ఒకేసారి యజమానిగా, సేవకుడిగా
అదలిస్తూ అదలింపు స్వీకరిస్తూ
మయూఖ ప్రభంజనం

సాయంత్రపు నీరెండ పాలిపోయి పవళించే
వరకూ
రెక్కలు మొలిచిన పక్షినవుతాను
యంత్రం అమర్చిన మరమనిషినవుతాను
మళ్ళీ రంగూరుచీ వాసనా సోకని చీకట్లో
నీటిలో కరిగిన ఉప్పునవుతాను
అయితే మాత్రం
కరిగినా మరిగినా ఆగనివేకదా
వెలుగు చీకట్లు

-స్వాతీ శ్రీపాద
8297248988

తెలంగాణ భాషా సౌందర్యం

ఒక ప్రాంతపు భాష, యాస సంస్కృతి సాంప్రదాయాలు సాహిత్య ప్రక్రియతోనేబాగుగా పరిరక్షించబడతాయి. అందునా, కథ, నవల ప్రక్రియలు ప్రముఖ పాత్ర వహిస్తాయి.

1965 నుండి 1983 వరకు అంటే- సుమారు రెండు దశాబ్దాల కాలం శ్రీమతి మాదిరెడ్డి సులోచన తెలంగాణ ప్రాంతపు సంస్కృతి, మరీ ముఖ్యంగా, మధ్యతరగతి జీవితాల్ని ప్రక్షిప్తం చేసారు. ఐదు పదులు దాటకుండానే అకాల మరణం చెందినవీరు తన జీవితకాలంలో 72 నవలలు, 150 కథలు 21నాటికలు 10 ఏకాంతికలు రాసారు. ఆరడుగుల అందగాళ్ళు, పడవల్లాంటి కార్లు ఎంత ఖర్చుపెట్టినా తరగని సంపద ఉన్నవారే నాయకులని, ప్రబంధ నాయికల్లా, లావణ్యం సొగసు సోగమల్లెల లాలిత్యం ఉన్నవారే నాయకులుగా ఉండతీరుతారన్న భ్రమలో ఉన్న తెలుగు పాఠకులకు, మధ్యతరగతి మరికాస్త క్రింది తరగతి వారు, పల్లె జనాలు క్కూడా, ఆ అర్హత ఉందని నిరూపించిన రచయిత్రి శ్రీమతి సులోచన గారు, మేఘాల్లో ఊహాలోకాల్లో తేలియాడే తెలుగు పాఠకుడిని భూమ్మీదకు దింపి, నేలకు కాలూనచేసి, కాల్పనిక జగత్తుకంటే వాస్తవిక జీవితాలె స్థిరం అని నిజం అని నిరూపించారు. నిదుర పోతోన్న న్యాయాన్ని నిదుర లేసారు. గోముఖ వ్యాఘ్రాల్ని. వారి గడ్డితినే మనఃస్తత్వాల్ని బయటపెట్టారు. పల్లె ప్రాంతాల నుండి నగరానికి వచ్చి, ఇథోపియాలాంటి విదేశాల్ని కూడా సందర్శించి, తన అనుభవాల మూటల్ని మాటలుగా, సంఘటనలుగా మలిచి, నాటి పాఠకుల హృదయాల్ని దోచుకున్న రచయిత్రి శ్రీమతి మాదిరెడ్డి సులోచన. పల్లెల్లోని అమాయక, స్వచ్ఛమైన జీవితంతో, పట్నాలు/నగరాల్లోని జీవితాల్ని పోలుస్తూ నగరపు మనుషుల తగరపు పెలుగులు క్షణ కాలం పాటు కళ్ళు మిరుమిట్లు గొలుపుతాయి. కాని చొక్కపు బంగారపు పల్లె ప్రజల జీవితాలే నిలిచి వెలుగిచ్చేవిగా చూపారు.

"ఒక ప్రాంతపు భాష, యాస సంస్కృతి సాంప్రదాయాలు సాహిత్య ప్రక్రియతోనేబాగుగా పరిరక్షించబడతాయి"

వీరు రాసిన నవలలన్నింటిలోనూ 'తరం మారింది' నవలకు ఓ విశిష్ట స్థానం ఉంది.మిగతా రచనల్లో అవసరాన్ని బట్టి సందర్భాన్ని బట్టి తెలంగాణ మాండలిక పదాలు వాడారు.కాని 'తరం మారింది'' నవల ఆసాంతం తెలంగాణ ప్రాంతపు, అందునా నాటి భాగ్యనగరపు పరిసరాల పల్లె జీవితాన్ని కథావస్తువుగా చేసికున్నారు. నగర వాసుల దర్పం, డాంబికాన్ని, పల్లె ప్రజల స్వచ్ఛత, అమాయకత ముందు నిలబెట్టి తులనాత్మక శోధన గావించారు.

నగరానికి దగ్గరి పల్లెటూళ్ళో, రాంరెడ్డి యాదమ్మ చిన్న కమతందార్లు వెంకటరెడ్డి కిష్టరెడ్డి మరియు రాములమ్మ వారి సంతానం. దాబులకు దర్పాలకు పోయేరకం రాంరెడ్డి. ఇంచుమించూ అదే మనఃస్తత్వం యాదమ్మది. వెంకటరెడ్డి నిగర్విమెర మెచ్చులకు పోయే రకం కాదు. అంతగా చదూకోకున్నా అభ్యుదయవాది. తమ్ముడు కిష్టరెడ్డి పట్నంలో చదువుతుంటాడు అతిశయాలకు పోయే యువకుడు. అదే ఊళ్ళో ఉంటోన్న సుబ్బారెడ్డి స్థితిపరుడు, పొలం పుట్రాతో బాటు రాజకీయం తెలుసు ఎక్కడ అణిగి మణిగి ఉండాలో ఎక్కడ ఆధిక్యం ప్రదర్శించాలో తెలిసిన మనిషి.రుక్మమ్మ సుబ్బారెడ్డి భార్య. చంద్రకల పవాకర్ పార్వతి వారి సంతానం. దాబులకు పోయే రాంరెడ్డి తన కూతురు రాములు (రాములమ్మ)ను పట్నంలోని ఓ రెండో సంబంధం, తన అంత ఈడు ఉన్న కోటిరెడ్డికి స్థిర పరుస్తాడు. అయినింట్లో పిల్ల 'సుఖపడుతుంది' పైగా.. అంత పెద్ద ఆస్థి కల వారితో వియ్యమందటం వల్ల తన హోదా పెరుగుతుంది అని రాంరెడ్డి ఆలోచన. యాదమ్మకూ అలానే అనిపిస్తుంది. వయసు పైబడ్డ వాడు అని వెంకటరెడ్డి నిరసించినా ఫలితం ఉండదు. లోకజ్ఞానం అసలే లేని రాములమ్మ కోటిరెడ్డి కుటుంతబంలో ఇమడ లేకపోతుంది. పక్కదారులు పడుతుంది.

వెంకటరెడ్డి వ్యక్తిత్వం తెలిసిన పార్వతి ఆయన్ను ఇష్టపడుతుంది. పెద్దింటిపిల్ల అన్న 'బెరుకు' ఉన్నా, పార్వతి చొరవ స్నేహితుల ప్రోత్సాహంతో ఇద్దరూ రిజిస్టర్ పెళ్ళిచేసుకుంటారు. రాంరెడ్డి తీవ్ర ప్రతి ఘటనతో వెంకటరెడ్డి పార్వతిలు అదే ఊళ్ళో వేరు కాపురం పెడతారు. చిన్న కొడుకు కిష్టరెడ్డి తన సహధ్యాయినిని పెళ్ళి చేసుకుంటాడు. యాదమ్మ పోవటంతో రాంరెడ్డి చిన్న కొడుకు పంచన, కిష్టరెడ్డి అత్త వారింట్లో ఉంటుంటాడు. కిష్టరెడ్డి నిరసన వియ్యంపుల ఇంట్లో నిరాదరణ రాంరెడ్డిని కృంగదీస్తుంది.

వెంకటరెడ్డి దంపతులు ఊరికి చేదుడోగా నిలుస్తూ ఊరి వారి ఆదరణ చూరగొనటమే కాకుండా పంచాయితీ బోర్డు ఎన్నికలలో, మామ సుబ్బారెడ్డి మీద గెలుస్తాడు. ఊరికి ఆదర్శంగా నిలుస్తాడు వెంకటరెడ్డి పార్వతి దంపతులు.

పాత్రల పోషణ: 140 పేజీల ఈచిన్న నవలలో, పాత్రల పోషణ ఔచిత్యం అడుగడుగునా కనిపిస్తుంది. కథా నాయకుడు వెంకటరెడ్డిని పాఠకులకు పరిచయం చేస్తూ "నామం ధర్మం అంటాడు ఈ కలియుగంల ఎట్ల బతుకుతడో" (పే11) అంటుంది రచయిత్రి. కొందరు తమకు తెలియకుండానే ప్రలోభాలకు లోనవుతారు. తండ్రి రాంరెడ్డి 'ఇజ్జత్ పోయిన పర్వలేదు. పైసకావలె" (పే.54) అనుకునే మనిషి. ఎదురు దెబ్బలు తిని చివరకు పెద్ద కొడుకు పంచనే చేరుతాడు. సుబ్బారెడ్డి గురించి ''శిన్న శిన్న అవిటి(సంగతులు) తెరువుపోడు.పోతే ఆల్లంతు జూస్తడు. శెడ్డోడు కాదు. పైసపోయిన పర్వలేదు.పేరు రావలె. హోదకావలె.

పుస్తక సమీక్ష



(పే.53,54) ఇక కిష్టరెడ్డి ప్రవర్తన "చదువుకున్నోడంటే మంటపుట్టించే రకం (పే.14). రాములమ్మ: "పిచ్చిపోరి పెండ్లంటే శిరలు,సొమ్ములు అనుకునే రకం (పే.14) కథానాయిక పార్వతి ధైర్యస్తురాలు. ఆడపిల్లకు కూడా మనసుంటుందని, ధైర్యం లేకపోతే బ్రతకలేమని, పెళ్ళి విషయంలో అమ్మనాయిని ఇనమంటే, తెగించి మెచ్చినోని దగ్గరకు పోగలదు (పే.16). గ్రామీణ వాతావరణ చిత్రణ,అక్కడి ప్రజల నిష్కాపట్యం, గుంటనక్కల్లాంటి నౌకర్లు, పంతుళ్ళ ఎత్తులు చిత్తవ గానే, తోక ముడవడం అతి సహజంగా రాయ బడింది.

తెలంగాణ ప్రాంతపు సామెతలు, పలుకు బడులు, ముస్లిం రాజుల ఏలికలో రూపాంతరం చెందిన సామెతలు (కానెకు గతినయి, ఎల్లికి బులావ్-ఖానేకు (తినడానికి) గతినహి యెల్లికి (సాని దానికి) పిలువు-(పే.47) ఎన్నో కనిపిస్తాయి నవలలో. ఎక్కడా అసహజత్వం లేకుండా కళ్ళకు కట్టినట్టు వంటకాలు వివరాలు, పెళ్ళిముచ్చట్లు, తయారీలు, ఆనాటి ఆభరణ విశేషాలు నవలను పరిపుష్టం చేసాయి.

ఇంత గొప్పనవలను తిరిగి ప్రాచుర్యంలోకి తెచ్చిన తెలంగాణ సాహిత్య అకాడమీవారు అభినందనీ యులు. తెలంగాణభాషా మాధుర్యాన్ని గ్రోలదలుచు కున్న ప్రతి పాఠకుడు చదవాల్సిన నవల.

ప్రతులకు: మాదిరెడ్డి సులోచన
తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభారతి
రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్. 500 004
వెల: 60/-
ఫోన్: 040-297031422



-కూర చిదంబరం
సెల్: 8639338675

ఇప్పుడు

గాయాలకేం కొదవ
ఉదయం
నేల మీద అడుగుమోపిన
క్షణం నుండి
రకరకాల రంగులలో
పరిచయమవుతూనే ఉన్నాయి
పసిప్రాయంలో
బడి ముగిసాక
తరగతి గదిలోంచి తుళ్ళిన
అమాయకపు ముచ్చట్లు
కాలేజీ వద్ద ప్రవహించిన
యౌవనోత్సాపు తళతళలు
అనుదినం స్నేహితులతో
ఆనందంగా కరిగించిన
రోజువారీ సాయంకాలాలు
మనిషిని మనిషిగా చేసే
వెన్నెలకబురులు
కలబోసుకున్న క్షణాలు
ఆత్మీయతను కంచాలలో
వడ్డించుకుని
భోంచేసిన ఘడియలు
కలవడానికే కల్పించుకున్న
అనేకానేక సందర్భాలు
బతుకు సలపరాల కలవరాలను
కాస్తైనా తగ్గించేవి
అవన్నీ పాతజ్ఞాపకాల పుటలలోకి
ఏనాడో చేరిపోయాయి
అప్పుడప్పుడు
తిరగేయడానికి మాత్రమే అన్నట్టు
చేజారిపోయాయి
నేడు మాటలే
గాయాలవీణను మీటుతుంటే
కలయికలే ముళ్ళపొదలై కౌగిలిస్తుంటే
మనిషి గాజుగోడల నడుమ
స్వయంసిద్ధపు
జీవితకాలపు బందీ
తను పటిష్టంగా
నిర్మించుకున్న పంజరంలో
తానే రెక్క విరిగిన పిట్ట
ఇప్పుడు గాయాలకేం తక్కువ
ఏ గుండెను తడిమినా
దిగులు మనసు నిండా
పొరలిపోతూ
పోగులు పోగులుగా
గాయాలే
పచ్చినెత్తుటి వాగులే
నేడు గాయాలు అనేకం
ప్రేమగా పొదువుకుని
మెత్తని మాటల పసరుమందు పూస్తూ
కట్టుగట్టే చేతులే కరువిప్పుడు

-పద్మావతి రాంభక్త
9966307777

పుట్టిన తేది

ప్రజల కవిత్వం
ఎప్పుడు పుట్టింది
ప్రాచీనకాలల్లో కాదు
కన్నీళ్ళను కాగితం మీద
ఆరబెట్టినప్పటినుంచి...

పాత్రలు

వాడింట్లో
వంట పాత్రలు ఉండవు
ఫ్యాక్షనిస్టు కదా!
అన్నీ మందు పాత్రలే...

- డా॥కె.జి.వేణు
98480 70084

అన్ని దానాల కన్నా అవయవ దానం మిన్న

ఇతరులకు ఉపకారం చేయడాన్ని మించిన దానం లేదు. గతంలో అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది అనే నానుడి ఉండేది. కాని ఆధునిక కాలంలో అన్ని దానాల కన్నా అవయవ దానం గొప్పది. పరోపకారమ్ ఇద్దమ్ శరీరమ్ అన్నది పెద్దల మాట, అంటే ఈ శరీరాన్ని పరోపకారం కోసం ఉపయోగించాలని అర్థం. ఇతరులు కోలుకోలేనంత కష్టంలో కూరుకొనప్పుడు తోటి వారు స్పందించాల్సిన అవసరం ఉంది. తోటి మానవులేస్పందించి ఆ కష్టంలో ఉన్న వారిని ఆదుకోవాల్సి ఉంటుంది. మానవ శరీరంలో కొన్ని భాగాలు పాడైతే, ఆ అవయవాల్ని మార్కెట్‌లో కొనుక్కొనేందుకు వీలు లేదు. ఆ అవయవాల్ని కానీ, శరీర భాగాలు కానీ ఇతర మానవుల నుంచే తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు తోటి వారు ముందుకు వస్తే అనేక మంది ఆరోగ్యం మెరుగవుతుంది. అవయవ దానం మీద అవగాహన పెరిగితేనే ఇది సాధ్యం అవుతుంది. మరీ ముఖ్యంగా కాలేయం వంటి అరుదైన అవయవం పాడైతే వేరే ఇతర అవయవం ఆ విధుల్ని చేపట్టే అవకాశం లేదు. తప్పనిసరిగా ఇతరుల శరీరంలోని కాలేయాన్ని తీసుకొని అమర్చాల్సి ఉంటుంది. కాలేయ మార్పిడి అన్నది అంత తేలికైన ప్రక్రియ మాత్రం కాదు. ఇది చాలా జాగ్రత్తగా నిర్వహించాల్సిన ప్రక్రియ, రెండు వైపుల వారికి ఈ ప్రక్రియ గురించి వివరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత రక్త పరీక్ష అవసరం అవుతుంది. కాలేయం నుంచి వచ్చే స్రావాలు, బైలిరుబిన్, అల్బుమిన్, ప్రోత్రాంబిన్, త్రాబో ప్లాస్టిన్ వంటి అంశాల్ని పరీక్షిస్తారు. దీంతో పాటు బ్లడ్ గ్రూప్, వైరల్ స్టడీస్‌ను పరిశీలిస్తారు. కడుపు ప్రాంతంలో అల్ట్రాసౌండ్ పరీక్షతో పాటు అవసరానికి అనుగుణంగా బయాప్సీ తీసి పరీక్ష జరుపుతారు. రక్తం సరఫరాను పరిశీలించటంతో పాటు ఎకో కార్డియో గ్రామ్ వంటి పరీక్షల ద్వారా గుండె స్పందనను పరిశీలిస్తారు. అన్ని రకాల పరీక్షలు చేశాకే అవయవ మార్పిడికి సిద్ధం చేస్తారు. కాలేయ మార్పిడి అన్నది ఒక సుధీర్ఘ ప్రక్రియ. దాదాపు 8-12 గంటల దాకా సమయం పడుతుంది. కడుపు భాగంలో ఒక చిన్న రంధ్రం పెట్టి ఈ ఆపరేషన్‌ను మొదలు పెడతారు. ఆధునిక వైద్య శాస్త్రంలో లాపరోస్కోపిక్ చికిత్స చాలా అద్భుత ఫలితం అనుకోవచ్చు. కడునును కోయాల్సిన పని లేకుండా చ్ని గాటు ద్వారా చికిత్సను పూర్తి చేయటానికి వీలవుతుంది. దీని ద్వారా ఒక వీడియో కెమెరాను శరీరంలోకి పంపించి, అక్కడి దృశ్యాలను తెర మీద చూస్తుంటారు. దీని ఆధారంగా చికిత్స చేయాల్సిన శరీర భాగాన్ని గమనించి, అక్కడ చికిత్స పూర్తి చేస్తారు. జీర్ణ వ్యవస్థలో అతి ముఖ్యమైన కాలేయం ఒక ముఖ్యమైన అవయవం. జీర్ణాశయానికి కుడి వైపున ఇది అమరి ఉంటుంది. ఇది ఆహారాన్ని జీర్ణం చేయటంలో కీలక పాత్ర పోషించటంతో పాటు, ప్రోటీన్ సంశ్లేషణ, ఔషధ వినియోగం, మలినాల విసర్జన వంటి అనేక జీవన క్రియల్లో ఉపయోగపడుతుంది. నిరంతరాయంగా పనిచేసే క్రమంలో ఇది వ్యాధి గ్రస్తమవుతుంది. కాలేయం పూర్తిగా పనికి రాని స్థితికి చేరితే మాత్రం అసలు సమస్య ఏర్పడుతుంది.



కనీసం పది శాతం పనిచేసినప్పటికీ పర్వాలేదు. 30 శాతం పనిచేయగలిగితే కాస్తంత కుదుట పడవచ్చు. పూర్తిగా కాలేయం చెడిపోతే మాత్రం శస్త్ర చికిత్స ద్వారా మార్పుటం ఒక్కటే పరిష్కారం. దీన్నే కాలేయ మార్పిడిగా చెప్పవచ్చు. రక్తం మాదిరిగానే కాలేయాన్ని కూడా వేరే ఒక వ్యక్తి నుంచి సేకరించాల్సి ఉంటుంది. అందుచేత కాలేయం ఇచ్చే వ్యక్తిని దాతగా, తీసుకొనే వ్యక్తిని గ్రహీతగా వ్యవహరిస్తారు. కాలేయ మార్పిడిలో సాధారణంగా మూడు రకాలు ఉంటాయి. మృత దాత కాలేయ మార్పిడి (డిసిజెడ్ డోనార్ లివర్ ట్రాన్సు పాంటేషన్) అంటే బ్రెయిన్ డెడ్ లేదా మృత్యువు అంచుల్లో ఉన్న వారి నుంచి కాలేయాన్ని సేకరించి ఇతరులకు దాన్ని అమర్చడం అన్న మాట హృదయ స్పందన లేని దాతలు (నాన్ హార్టు బీటింగ్ డోనార్స్) పూర్తిగా చనిపోయిన వ్యక్తుల నుంచి (అంటే గుండె, మెదడు, ఊపిరితిత్తులు వంటి ప్రధానాంగాలన్ని నిర్జీవం అయిపోయిన స్థితి) కాలేయాన్ని సేకరించటం అన్నమాట, ఇటువంటప్పుడు చనిపోయిన వెంటనే అంటే దాదాపు 20 నిమిషాల్లోపే అవయవాన్ని ఇతరులకు అందచేస్తారు. సన్నిహితుల నుండి సేకరించటం (లివింగ్ రిలేటెడ్ లివర్ ట్రాన్సుపాంటేషన్) ఇటువంటి కేసుల్లో కుటుంబ సభ్యులు లేదా దగ్గర సన్నిహితుల నుంచి కాలేయాన్ని సేకరించి ఇతరులకు అందజేస్తారు. దాత నుంచి కాలేయాన్ని సేకరించాక గ్రహీతలోకి అమర్చటం అన్నది నిపుణులైన వైద్యుల టీమ్ మాత్రమే చేయగలుగుతుంది. ట్రాన్సుప్లాంటేషన్ సర్జన్, అనెస్థటిస్టు, వంటి నిపుణులు ఇందులో పాలు పంచుకొంటారు. కాలేయ మార్పిడిలో వివిధ విభాగాల మధ్య సమన్వయం చాలా అవసరం. అదే సమయంలో సదురు ఆస్పత్రిలో అన్ని హంగులు ఉన్న ఆపరేషన్ థియేటర్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, బ్లడ్‌బ్యాంక్, సపోర్టివ్ ల్యాబ్‌లు ఉండాలి. సుశిక్షితులైన సిబ్బంది కూడా ఉండాలి. ఇవన్నింటిని పరిగణలోనికి తీసుకొని ఆలోచిస్తే కాలేయ మార్పిడి చాలా ఖరీదైన అంశంగా గుర్తించాలి. కానీ, మిగిలిన దేశాలతో పోలిస్తే భారత్‌లో మాత్రం చౌకగా జరుగుతుందని చెప్పవచ్చు. ఆపరేషన్ సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తారు. ముందుగా శరీరంలో ద్రవాల కదలికలను పరిశీలిస్తారు. ఇందుకోసం కొన్ని ట్యూబులను శరీరంలోకి ప్రవేశ పెడతారు. విభిన్న స్రావాల ద్వారా ఆపరేషన్ కు ఆటంకం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. మరీ ముఖ్యంగా కాలేయ మార్పిడి అన్నది ఒక సుధీర్ఘ ప్రక్రియ. దాదాపు 8-12 గంటల దాకా సమయం పడుతుంది. కడుపు భాగంలో ఒక చిన్న రంధ్రం పెట్టి ఈ ఆపరేషన్ మొదలు పెడతారు. ఆధునికి వైద్య శాస్త్రంలో లాపరోస్కోపిక్ చికిత్స చాలా అద్భుత ఫలితం అనుకోవచ్చు. కడుపును కోయాల్సిన పని లేకుండా చిన్న గాటు ద్వారా చికిత్సను పూర్తి చేయటానికి వీలవుతుంది. దీని ద్వారా ఒక వీడియో కెమెరాను శరీరంలోకి పంపించి, అక్కడి దృశ్యాలను తెరమీద చూస్తుంటారు. దీని ఆధారంగా చికిత్స చేయాల్సిన శరీర భాగాన్ని గమనించి, అక్కడ చికిత్స పూర్తి చేస్తారు. అవయవ దానంలో కూడా అవసరమైనంత మేర మాత్రమే గాయం చేస్తారు. ఆ తర్వాత నెమ్మదిగా తొలగించాల్సిన కాలేయాన్ని గుర్తించి అక్కడ ఎంత వరకు శరీర భాగం వేరు చేయాలో నిర్ధారించు కొంటారు. ఆ తర్వాత ఆ శరీర భాగానికి సంబంధించిన పైత్యరసవాహికలు, రక్త కేశ నాళికల్ని జాగ్రత్తగా తప్పిస్తారు. మరో వైపు దాత శరీరంలో కాలేయ ప్రాంతాన్ని గుర్తించి కొంత భాగాన్ని సేకరిస్తారు. ఈ లోగ గ్రహీత శరీర భాగంలో ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి ఉంచుతారు. ఆ తర్వాత జాగ్రత్తగా ఈ కొత్త భాగాన్ని అక్కడకు చేర్చి అతుకుతారు. ఎంతో సంక్లిష్టమైన ఈ ప్రక్రియను నిపుణులైన సర్జన్‌లు మాత్రమే చేయగలుతారు. ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు పౌరులు మనసా వాచా కర్మనే అవయ వదానాన్ని ప్రోత్సహించాలి. మరొకరి జీవితంలో వెలుగు రేఖలు ప్రసరింపజేయాలి.

-రావుల రాజేశం
9848811424

మన'సు'కవి-మొగ్గలు

అక్షరాలతో నిత్యం కవితా సేద్యం చేస్తేనే
సాహితీ నేల బీళ్ళు పడకుండా ఉండేది
కవి స్వేదాన్నిఅప్యాయంగా ప్రేమించే రైతు

సిరాచుక్కలు నీటిచుక్కల్లా వెదజల్లితేనే
కవనవనంలో పూలపరిమళం గుభాళించేది
కవి ప్రకృతిని పలకరించే తోటమాలి

మదిలోని భావాలను ఇటుకల్లా పేరిస్తేనే
కావ్య సౌధం అందంగా నిర్మించబడేది
కవి కష్టాన్ని నమ్మే నిరంతర శ్రామికుడు

కలమనేఉలితో కాగితమనే శిలనుచెక్కితేనే
నవరసాల గ్రంథమనే శిల్పం మలచబడేది
కవి జీవం పోసే అద్భుతమైన శిల్పకారుడు

హృదయమనే కుంచెతో పదాలను సృశిస్తేనే
జనపదాల చిత్రాలుహృద్యంగా సృష్టించబడేది
కవి నిత్య నూతన చి(చరి)త్ర కారుడు

సాహితీ దేవతను నిష్టగా నిత్యం పూజిస్తేనే
చైతన్యమాటల మూటల వరాలు ప్రసాదించేది
కవి పరమ పవిత్రమైన పూజారి

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
94417912239

మతలబు

కర్పూర చందన కస్తూరికాదుల
తిన్న దేహమైనను
జవ్వాది అత్తరు సువాసనల
పులుముకున్న శరీరమైనను
నవరత్న రుద్రాక్ష మాలలు వేసుక
వెలిగిన ఏ కాయమైనను
మల్లి సంపంగి చేమంతుల హారాల
ఘన సన్మానాలు పొందినదైనను
విమానాలలొ దేశ దేశాలలో తిరిగి
పేరు ప్రఖ్యాతులు పొందినదైనను
నట గాయక నృత్య వైతాళికులవైనను
పీఠాదిపతులై మార్గ నిర్దేశకులవైనను
శ్వాస వశము దప్పిక
ఆ దేహమును శవ మందురేగాని
ఒక్కరైనా ఆహా ఎంత మంచి
శవమని అనరుగా
ఎక్కన జేరి ఏమోయ్! ఎలా ఉంది
ఈ దశ అని అడుగబోరుగ
అలా! వెళ్లొద్దమని భుజం మీద చేయివేసి
టీ, కాఫీలకు ఏ మిత్రుడూ పిలువ బోడుగా
మృత దేహమా!
చాలా మతలబుగాళ్లీ మనుషులు.

- తిరుమల వెంకటస్వామి
సెల్: 9391109616

ఆశను తొడిగిన పాదం

రాలిపడే బాధలన్ని చిత్రాలే
భాషింపలేని చిత్రాలే
మృత్యుముఖంలోని
శ్వాసను వలిచే విచిత్రాలే
సడలే ఊపిరిలే.

శిఖరంలా కూలిన ఆనందం
నిత్యం వినిపించే ఆర్తనాదమే.
ఎక్కడ తవ్వినా జ్ఞాపకాల తడే.
వ్రేలుకు తగిలే వెతల సవ్వడే.

వెలుతురు తునక కోసం
చీకటిని తోడుతూ
కన్నీటి సంద్రంగా మారి
ఉనికి పాలిట ఉప్పుపాతరయ్యినా

వెలుగు నీడలో
ఒడిసిన ప్రాణాలకు
ఓటమి భయమేలేని దైర్యమే
ఐకమత్యానికి ఊపిరి.

మెదిలే బరువు కరకుతనంలో
దూరంగా వెలిగే
చుక్కల మిణుకుతనాన్ని
ఓ కరదీపికగా చేబూని
తూర్పు దిక్కువైపుకు
కలను గురిపెట్టి నడిపించింది.

ఆశను తొడిగిన పాదానిది
అహర్నిశలు మెలుకువే.
వేకువను ఒడిసిపట్టాలన్నది ఎప్పుడూ
ఆత్మవిశ్వాసమే.

-చందలూరి నారాయణరావు
9704437247

నానీలు

వివేకం
పెంచే ప్రతీది విద్యే
విచక్షణ లేకుంటేనే
అంతా మిద్యే

అక్షర జ్ఞానం
విజ్ఞానం పెంచొచ్చు
విలువలు లేనిదే
వివేకం తగ్గొచ్చు

బళ్ళో చదివితేనే
విద్య కాదు
మడిలో చదివిన
కూడా విద్యే.

విద్య నేర్పే
తొలి గురువు అమ్మ
అనాధకైతే
ప్రకృతే అమ్మ.

అమ్మ ఒడే
విద్యకు తొలి బడి
విచక్షణకు
నాన్న నడతే గుడి.

విద్యను
పదిమందికి పంచు
విద్వాంసుడనేనని
అహాన్ని తుంచు.

అందరూ
విద్యావంతులే
ఎందుకో మరి
ఎక్కువ మంది వంచితులే.

-వి. పద్మ
9951445867

అభ్యుదయ కిరణం

కరి మబ్బులు కమ్ముకొన్న
ఆకాశాన్ని చీల్చుకొని
ప్రభాత కిరణం
భూదళాన్ని తాకుతుంది.

భీజ ధళాల మధ్య
దారి ఉన్న అంకురం
భూమిని బ్రద్ధలు చేసుకొని
మొలకై ఎదుగుతుంది

కష్టాలనే కంచెను
ముక్కలు ముక్కలు చేసి
మనం చేసే ప్రయత్నమే
మంచి ఫలితాన్ని అందిస్తుంది.

గుండెల్లో సుడిగుండాలు
ఎగిసిపడే అలలున్నా
తీరం దగ్గర సాగరం
ప్రశాంతంగా ఉంటుంది.

అంతరంగం శ్వేత వర్ణమై
కలల రుధిర తరంగమై
సమాజ లోపాన్ని ప్రశ్నిస్తే
ఆకదరం లోకానికి
మార్గదర్శన మవుతుంది.

అంతరాన్ని దాటి వచ్చిన
అభ్యుదయ కిరణమవుతుంది.

- శారదా .వి
సెల్: 814759 5455

అక్షర కౌముది

కొమ్మను తాకి, రెమ్మను మీటి
చిట్టి పాపాయి బుగ్గను సుతారంగా తడిమి
మేఘ మాలికను పిలిచి
చినుకులతో నడిచి
అన్నింటా తానై
అణువణువునా తానే అయిపోయిన చిరుగాలిలా...

నందూరి ఎంకి పాటను నే పాడి
విశ్వనాథ కిన్నెరసానిని నేనే అయి
కృష్ణ శాస్త్రి కవితను నేనాలపించి
శ్రీ శ్రీ శ్రామిక గీతాన్నందుకుని...

చలం మైదానంలో
గురజాడ నాటకంలో
శరత్ దేవదాసులో
రవీంద్రుడి గీతాంజలిలో

అన్నింటా నేనేనంటూ
అల్లుకుపోయిన అక్షర కొమ్మకు
పూచిన అందాల పూవును నేనై...

అనంత వినీలాకాశంలో
జాబిలి పూవు వెదజల్లే
అక్షర కౌముదిని నేనవ్వాలని

సాహితీ సాగరంలో
చిరు బిందువుగా మిగిలిపోవాలని ఆశే నాది!!

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

ప్రేమ

ప్రేమలో పడ్డ మనసు మాట వినదు
ప్రేమించిన వారిని క్షణమైనా విడువదు
పెను విషాదం ఎదురైనా
తన తీరు.. దారీ.. మార్చుకోదు!

ప్రేమ అనంత దుఃఖమొ..అపురూప సౌఖ్యమొ
అర్థమవని ప్రహేళికో.. అందమైన అనుభవమొ
చేదు నిజమొ.. తీపి అబద్ధమొ
మిన్నంటే మోసమొ.. ఊహకందని మొహమొ

తెలుసుకునే యత్నంలోనే
మిలమిలల వలలో చిక్కుకుంటుంది
గమ్మత్తైన హాయిలో మునిగి తేలుతుంది
మైకంలో ఉనికినే మరిచిపోతుంది!

అటుపై.. త్యాగం మాయమైనా కనిపెట్టలేదు
స్వార్థం.. పెరుగుతున్నా.. గ్రహించలేదు
శ్రద్ధ రంగు వెలిసినా చూసుకోదు
బంధం పలచబారినా పసి కట్టలేదు!

నిజాయితీ పరీక్షలో చిత్తుగా ఓడిపోయాక
అస్తిత్వం ఆసాంతం మంటగలిశాక
స్పృహలో కొచ్చి.. తట్టుకోలేకుంటే
ఉసురు తీసుకోమంటుంది!
ఉగ్రరూపం దాలిస్తే..
ఎదుటి వారి ఊపిరి తీయమంటుంది!

- ఎస్. కాశింబి
సెల్:90522 16044

కుటుంబం ఓ పూలపందిరి

నాలుగ్గాళ్ళ పూలపందిరి
కుటుంబం
అసలు స్థంభం ఆ ఇంటి యజమాని
యజమానురాలు మరో స్థంభం
యజమానికి జన్మనిచ్చిన
అమ్మానాన్నలు మిగిలిన స్థంభాలు
నాలుగు స్థంభాలు
పందిరికి నిర్మాణమే, కానీ
అసలు బంధమంతా
అల్లుకునే తీగలో వుంటుంది
ఆ పందిరికి అందమూ, గంధమూ
కేవలం పెనవేసుకునే పూలతీగె కదా!
పుత్రులు, పుత్రికలు
పత్ర హరితాన్ని నింపుకున్న
హరితపత్రాలు
ఆ తీగ తల్లి తొడిమ నుండి పుట్టే
పువ్వులే కదా!
మనవలూ, మనవరాళ్ళ నవ్వులు
గాలికి కదలాడే లతా సౌందర్యం
కుటుంబంలోని సుఖ సంతోషాల ఆంతర్యం
శిశిర వసంతాలకు ఆ పందిరి అతిథిశాల
కలసి వుంటే కలదు సుఖమన్న మాటకి
ఆ పందిరి ఒక పాఠశాల

- మద్దాళి రఘురాం
9866057777

పద బంధాల తెలుగు పరిమళం మాట మంగళకరము

వినరాని గుసగుస మాటలు విని
కొరకొర చూపులతో కోపాలరావు
ఒళ్లంతా చిమచిమలాడి
జరజరమని పరుగులుపెడ్తు
పటపటమని పల్లుకొరుకుతూ
మెకమెక మన్న మేకనుగాని
బెకబెకమన్న కప్పను గాని పట్టించుకోకుండా
చకచకమని తన పనులు చేసుకొని
కిచకిచమాటలాడిన వారి దగ్గరకి వెళ్లి
అడగవల్సిన నాల్గుముక్కలు టపటపమని అడిగేసి,
నకనకలాడే వారిపై కరకరమని కస్సుమంటే

వారు గజగజమని వణికిపోతూ
గబగబమని పారిపోతే గబుక్కుని పట్టుకొని
పరపరమని లాక్కెల్లి,ధనధనమంటు
బుగ్గలువాయిస్తే
వాయించిన వారందరు
గలగల,విలవిల,వలవల ఏకధాటిగా ఏడిస్తే

కొందరేమో కలకలమని నవ్వేరు,
మరికొందరేమో మలమలమన్నారు
తళతళలాడవల్సిన ఆ ప్రదేశము
వెలవెలబోయింది

చక్కగా కూహుకుహు మంటు రాగాలు తీయ,
కిలకిల నవ్వులతో
కువకువ లాడవల్సిన సమయములో
అక్కరలేని గలాటా మాటలు
గటగట,కటకట మంటూ టకటకమని పేలితే,
పేలిన మాటలు భగభగలాడి,
భుగభుగమని మంటలు రేపితే,
ఘుమఘుమలు వండే ఇంటిలో
దబదబలు,ధమధమలు మ్రోగకుండా ఉంటాయా?
కితకిత జోకులు సరసమైనా,సరదాకైనా
గణగణమని పేలిస్తే,
గునగునమంటూ కార్యాలు జరిపే వేళ
దడదడమంటు గుండెలదర
గడగడలు రాకుండా వుంటాయా?

మాటలన్నింటిని మూటకట్టి,
అవసరాన్నిబట్టి ఝుణఝుణమంటూ
మాట్లాడితే,గుసగుస మాటలు ప్రక్కకుపెట్టి
పకపక నవ్వులుకు,పగలబడి నవ్వులకు
దారివ్వకుండా వుంటే
కోపాలరావేకాదు,పాపాలరావు కూడా
మాటదారికి వచ్చి,మాటకు బందీయై,
కణకణలాడేచోట,కువకువలు పల్కిస్తాడు
"మాట మహతైనది-మాట మంగళకరమైనది.

-విశ్వనాథ నరసింహం
9490971589

ఆత్మహత్య

ఒక్క నిమిషమాగు
నామాట వినుకో
ఆత్మహత్య
పాపమని తెలుసుకో
ఈ ప్రయత్నం మానుకో
నీవు బతకాలి
నీ కోసం బతకాలి
నీ వారి కోసం బతకాలి
ఈ నాటి వెతలన్నీ
వుండవులే కలకాలం
చీకటి వెనుక వెలుతురు
కష్టం వెనుక సుఖం
ఇదేలే జరుగుతున్న నిజం
ఇదే జీవిత చక్రం
మానవులం మనం
మనదే ఉత్తమ జన్మం
ఈ జన్మదొరకడం
మన అదృష్టం
ఈబతుకు ప్రయాణం
తుఫానులమయం
జతగా సుడిగుండాలు
ఆటుపోటుల పరీక్షలు
అయినా అధైర్యపడకు
జీవించడం నేర్చుకో
ఒక్క నిమిషమాగు
నామాట వినుకో
ఆత్మహత్య పాపమని
తెలుసుకో
ఈ ప్రయత్నం మానుకో

-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

వెలిగే తెలుగు భాష

తెలుగు లేనిదే మనలో వెలుగు లేదు
తెలుగు మన మాతృభాషే కాదు
మాతృత్వపు భావన..
రాజయినా పేదయినా
పలుకుబడి సంపద తెలుగే కదా !
మాతృభాషలేని మనుగడెట్లు సాగు
పరాయి భాషలో పలుకుబడెట్లు రుచించు..
గిడుగు పిడుగు సముద్ధరించిన సంపదిది
మహాకవులు సంస్కరించిన భాషిది
వేదగోదారిలో కృష్ణమ్మ నడతల్లో
ఆబాలగోపాలాన్ని అలరించిన అందమిది
అశేష పాండితీ ప్రకర్షణాలతో విద్యుల్లతై
వెలిగిన చందమిది
విశేష అవధాన ప్రక్రియలతో అలరారుతోన్న
అనంత ప్రవాహమిది
తొలి రవి కిరణములా
నిండుచంద్రుని నైర్మల్య వెన్నెలలా
వసంత వర్ణశోభలా
మదిని మాధుర్యంతో నింపే
మన నిత్య శ్వాసే తెలుగు భాష..

- భీమవరపు పురుషోత్తం
సెల్ 9949800253

అక్షరమే అమ్మ

చదువంటే తెలియని అమ్మ
నా కోసం ముందు తాను
నేర్చుకుంది అక్షరాలు

ఆ జ్ఞానంతోనే నా చేయి
పట్టుకుని దిద్దించింది
అ,ఆ లతో మొదలైన అభ్యాసం
ప్రపంచ జ్ఞానాన్ని నేర్పింది

భావాలను తెలియజేసేందుకు
భాష అవసరమే..
ఆ భాషకు ఉన్న లిపి అక్షరాలు

దోచుకో బడుతుంది ధనం
ఎంత దోసిపెడుతూ ఉంటే
అంత పెరుగుతుంది మన జ్ఞానం

చరిత్రను తెలుసుకోవాలన్నా
వర్ధమానంలోని సమస్యలను
పరిష్కరించుకోవాలన్నా ..
అక్షరాల కూడికలు
తీసివేతలు ఎంతో అవసరం ..

అంతులేని సాహిత్య సముద్రాన్ని
ఈద గలిగే సాహసం చేయడానికి
అమ్మ నేర్పిన అక్షరమే తోడు ..
అందుకే అక్షరం అమ్మే !!

-సుజాత తిమ్మన
9391341029

మంచిమాటలు... !

మనిషి తీరుమారె:మమత విత్తముగోరె
పరుల సొత్తుపొంద:ప్రాణమాయె!
కరుణలేక తాను:ఖలుడుగా మారెను
పాడుబుద్ధి గల్గి:పతితుడాయె!!

వావివరుస మర్చి:వాచాలతనుపెంచె
కన్నుమిన్ను మర్చి:కఠినుడాయె
నీతిరీతి మార్చె:నిండు దోపిడిజేసి
మంచివాని వలె:మసలు చుండె!

యుక్తి శక్తులను,కు:యుక్తులుగామార్చి
మోసకారి తనము:మొదలు బెట్టి
తన మనాదులన్న:తాపత్రయమునుమార్చి
తగువులాట లన్న:తలను హెచ్చె!

ఆడ పడచు లన్న:నపహాస్యమునుజేసి
చెరచి జంపివేయు:చేతులొచ్చె
మనిషి మనిషిగాడు:మహిలోనరక్కసి
శిరము క్రిందిపాము:స్త్రీలకిలను!

పైకి పరమనీతి:పరగ జెప్పుచుండియు
లోన దోచుభంగి:లోభి తీరు!
పేరుకేమొ పెద్ద:పెనుదొంగ వీడును
చెంత చేరవద్దు:చెడుపు జేయు!!

మనుషులార మీరు:మరిజాగ్రత్తలతోడ
మసలు కునుటచాల:మంచి దౌను
చెప్పిన వినకున్న:చెడునులే జీవిక
పెద్దవారి మాట:పెరుగుసద్ది!!

-డాక్టర్ గన్నోజుశ్రీనివాసాచారి
8555899493

తీపిచేదు

ప్రేమ ఒక దేవాలయం
కామం ఒక అనారోగ్యనిలయం

ప్రేమ ఒక ఆకుపచ్చపూలతోట
కామం ఒక గన్నేరు పల్లేర్ల బాట

ప్రేమ ఒక మంచినీటి సెలయేరు
కామం ఒక కంపుకొట్టె మురికి నీరు

ప్రేమ ఒక విడిపోనిబంధుత్వాల బంధం
కామం ఒక బంధాలు లేని అనుబంధం

-రేడియమ్
9291527757

వర్ణమాలవేసి గురుని కొలుతు

అ- జ్ఞానపు చీకటులను
ఆ -వహింపనీడు గురువు
ఇ- లలో నీకలలనెల్ల
ఈ- శ్వరుడై తీర్చువాడు
ఉ- న్నత పీఠమ్మున్నుంచి
ఊ- హనిజము చేయు బ్రహ్మ
ఋ- జుమార్గంనేర్చువాడు
ఎ- ఱుక తెలియు పరుచువాడు
ఏ- రును దాటించువాడు
ఐ- కమత్యమెంచువాడు
ఒ- దలనిండ ప్రేమామృత ధారలనే నింపువాడు
ఓ- టమిలో పాఠాలను నేర్చమన్నవాడు గురువు
ఔ- రసునిగ జూచి నిన్ను
అం- దలమెక్కించువాడు
అంతః- పురవసమ్మును కోరనట్టి గొప్పవాడు

క- రములను జోడించి
ఖ-ర్జూరములనుంచి
గ- జముపై నెక్కించి
ఘ- నముగా పూజించి
చ- దువుచెప్పిన గురునికి
ఛ-త్రమును బట్టి నడచి
జ× దమట్టి ననుగని
ఝ- రములా మార్చిన
(ఞ)- జ్ఞాన దర్శికి పుడు నతులనిడుదు.!
ట- ముకుతో గురుకీర్తి చాటెదను నేను
ఠ- వరగా ననుతయారు చేసి
డ- బ్బు ముఖ్యముకాదు లోకమ్మననుచు
ఢ× మరుకము లేనిశివుడతండు
(ణ)× గణములై శిష్యులే వెంటరాగ
త- మోగణమును బాపి
(థ)కథలు జెప్పి మదిని ఆనందపరచి
ద- యతోడ సాకిన శ్రీహరిగ నెంతు
ధ- రలోని ధాతగా నా బ్రతుకు కూర్చి
న- డిపిన గురవునకు నమస్కరింతు
ప- రమశుంఠననునేను
ఫ- లవృక్షమును జేసె
బ-తుకు పండించె
భ-గవంతుడట్లు
మ-హిలోననునుగాచె మహనీయుడతడు
య- జ్ఞముగ విద్యనే అందించినట్టి
ర- సప్లావితమ్ముగా పద్యమ్ము జెప్పి
ల- లితపదములతోడ భావమ్ము జెప్పి
వ- ర్ణమ్ములను పేర్చి వ్రాతలను నేర్పె
శ- తవత్సరమ్ములు జీవించమనుచు
ష- ట్కర్మలను తెల్పి యవి సల్పమనుచు
స-హనభావము మేలు చేకూర్చుననుచు
హ- లమునెప్పుడు గౌరవించమనుచు
(ళ)- గళమెత్తి దైవ కీర్తనలు పాడమనుచు
క్ష- రముకానట్టి యక్షరములను నేర్పి
(ఱ)- మఱచిపోవలదు గురుపూజ చేయవలెను.

-కిలపర్తి దాలినాయుడు
7780589336

కరోనా మెరుపులు

ప్రపంచంలోని దేశాల్లోకెల్ల
అమెరికిలటి భారతదేశం
కరోనా వైరస్ వల్ల
లేకుండాపోయే వాటికిగాసం !!

కుభేరులను కరోనా
కుదురుగా వుండనీయ్యలే
ప్రపంచాన్నివణికిస్తూ కరోనా
ప్రశాంతంగ పండనీయ్యలే !!

ప్రాణాలు గుప్పిట్లో
పెట్టుకొని బతికారు
కరోనా వాకిట్లో
తిరుగుతుందని బెదిరారు !!

కరోనావల్ల దేశాల్లో
జీవనస్థితి అతలాకుతలం
ప్రజలు భయాందోళనలో
జీవించిరి భూతలం !!

బిక్కుబిక్కు మనుకుంటూ
బిగియపట్టారు ప్రాణాలు
కరోనా వదలనంటూ
చేసిందిప్రజలకు గాయాలు !!

పిట్టల్లా రాలినా
ప్రాణాల గుట్టలు
శవాలను కాల్చడానికైనా
దొరకలేదు కట్టెలు !!

ప్రాణాలు నిలపని
డాలర్లపైసలు వుండేందుకు
మనిషికి రక్షనివ్వని
ఎత్తుమేడలు కట్టెందుకు !!

దేశాలకు అంతుపట్టలే
కరోనాకు మందేదని
అధ్యక్షులకు అర్థంకాలే
పోయేప్రాణాల ఆపుడెట్లని !!

గర్వమెపుడు పనికిరాదు
కరోనాలాంటిది వచ్చినపుడు
నాకేమైతదని అనుకోరాదు
విపత్తు విజృంభించినపుడు !!

పైసలతో ప్రాణాల్ని
కాపాడలేమని తెలుసుకో
కరోనా గాయాల్ని
గుర్తుంచుకొని మసలుకో !!

-తాండ్ర చిరంజీవి
9959180762.

కరోనా... జన జీవన చిత్రం చిద్రం

విషవలయంలో విద్యార్థులు
విద్యా ప్రపంచానికి చీకటి రోజులు
విలువలేని ధనవంతుల ఐశ్వర్యా లు
విధి వంచించిన పరిస్థితులు
విరజిమ్ముతూ విలయ తాండవం చేస్తున్న కరోనా
విజృంభిస్తున్న వెల కట్టలేని విలువైన బతుకులు
విఘాతాలకు గురౌతున్న? మానవాళి
విజ్ఞమే కరోనా యజ్ఞమై
విగత జీవిగా మనిషి మారుతున్న వైనం
విధానాలకు పరిమితం కానీ
నినాదాలతో పరిపాలన
విస్తు పోయిన వలస మనుషుల పరిస్థితి
అగమ్య గోచరం
విన్యాసాలు ఆంక్షలకు పరిమితమైన
ఇరవై వేల కోట్ల సహాయం
విశాల జగత్తు చావుల విహంగమైంది
విహంగ వీక్షణం అనుక్షణం భయం భయం
విజ్ఞులు ,రసజ్ఞులు సర్వజ్ఞాన పరిజ్ఞులు
బహుభాషా కోవిదులు రాజులు రాజనీతిజ్ఞులు
ఎవరైనా కరోనా దాసులే
విషయాలన్నీ కరోనానే, విజయాలన్ని కరోనావే
విలువైన వేల వేల వస్తువులు

వేచి చూస్తున్నాయి షాపులో వుండలేక చేస్తున్నాయి
విశ్వాసంతో వుండలేని
ఆత్మ విశ్వాసం గల మనుషులయ్యారు

విఫలమవుతున్నాయి విలువైన పరిశోధనలు
విశేషం లేని శేష జీవితంలో
సహజీవనం గడుపుతున్న కరోనా

విస్మరించకూడదు వ్యక్తిగత జాగ్రత్తలు
విడిచి పెట్టొద్దు ఆరోగ్య సూత్రాలు
విమర్శిస్తే విలువైన జీవితం కాటికి పయణమవుతుంది

వివేకంతో మేదిలి కరోనా పై విజయం సాధించు
వికలమైన కాకా వికలమైన కరోనా బతుకులు
విశ్వపు ఈ వైకల్యాన్ని చిన్న జాగ్రత్తలతో తరిమికొట్టు
విశ్వ విజేతవై వెలుగొందు.
ఓ విశ్వ మానవ నీకు జయహో.....
వెక్కిరిస్తున్న మహమ్మారి కి చరమ గీతం పాడు
వేల సంవ్సరాల మానవాళి చరిత్రకి
మరో మలుపు నువ్వు.....

-దేశిని శ్రీధర్
9849818284

ఓ కరోనా నువ్వు తరలి పో

ఓ కరోనా పరదేశీ
నువ్వు దారి తప్పి వచ్చి
మా దేశంలో కూరుకుపోయావు
అడుగడుగడునా మమ్మ
పట్టి పీడించి విగత జీవులను చేస్తున్నావు
నిన్ను మట్టి కరిపించనిదే వదలం సుమా!
నిన్ను ఖతం చేయటమే మా లక్ష్యం
మా ఇండియన్స్‌ని ఆషా మాషీగా తీసుకోకు.
నువ్వు విదేశీయవని తెలిసినా
మా సరిహద్దులు దాటి
మా విను వీధుల్లో తిరుగుతున్నా
ఇంకా మర్యాదపూర్వకంగానే
నిన్ను పంపించాలని చూస్తున్నాము
నువ్వు మా లోగిళ్ళలోకి రావాలని చూడకు
ఇప్పటికే నీ కంపు భరించలేక
నిన్ను తరిమేందుకు
మా ముక్కులకు మాస్కులు వేసుకున్నాము
నీ ముఖం చూడలేక మేమంతా
గృహ బంధీలుగా మారిపోయాము
వేడినీళ్ళను మండే ఎండల్లో కూడా
అతికష్టం మీద గుటకలు వేస్తున్నాము
నిన్ను భరించే శక్తిలేక
అల్లాన్ని, ఉప్పు మూటలను తలకెత్తుకున్నాము
పసుపు నీళ్ళను సేవిస్తున్నాము

నిన్ను తరిమేందుకు
నిమ్మరసంతో నిరసన తెలుపుతున్నాము
నీ కరచాలనంతో మాకు పనిలేదని చెప్పినా
నమస్కారం పెట్టి పొమ్మన్నా
గడపలు వదలకుంటివి
నీ కాటుకు మందు లేదని
నివారణ ఒక్కటే మార్గమని
మేమెంత మొత్తుకుంటున్నా వదలనైతివి
సబ్బుతో చేతులు కడిగి కడిగి
ముక్కుకు మాస్కులు వేసుకున్నా
ప్రభుత్వంతో చేతులు కలిపి
గృహంలో బంధీలమైపోయినా
మమ్ములను విడిచి వెళ్లాలని లేదని
మారాం చేసి నిన్ను
ప్రపంచమంతా గొలుసు కట్టుగా
వట వృక్షంలా నాటుకుపోయే నిన్ను
పెకిలించక మునుపే
మరింత లాక్‌డౌన్తో బంధించి
సూదిమందుల వేక్సిన్
పొడవకమునుపే
నువ్వు తరలిపో.

-రాయవరపు సరస్వతి
9885656356

వలస జీవనం

సమూహంలో
నడిచిన నడక
ఇప్పుడు ఒంటరిదైనాయ్
కరోనా వికటట్టహాసంతో
విషాద గీతకలైనాయ్
సందడిగా నడిచిన
రహదారులన్నీ
వారి పాద ముద్రలు లేక
నిర్వేద రాగం ఆలపిస్తున్నాయ్

వలస కూలీ తోడు లేని
చెమట చుక్కలు
'కరోనా 'ఋతువుకు
తల్లడిల్లుతున్నాయ్
ప్రగతి రథ చక్రాలు
కదలలేక నిట్టూరుస్తున్నాయ్
గమ్యం తెలియని
గమనం లేని
నిరాశ్రయంతో

అన్నార్తుల కోసం
ఆపన్న హస్తాలకోసం
వలస జీవనం ఆశగా
ఎదురు చూస్తోంది

-కయ్యూరు
బాలసుబ్రమణ్యం
7780277240

ప్రాణ బంధువులారా..వందనం

అకుంఠిత దీక్షాపరులు
నిరంతర సేవా తత్పరులు
పరుల హితం కోసం
తమ ప్రాణాలను సైతం
పణంగా పెట్టిన..
ప్రాణ బంధువులు ..!
సమాజమే అన్నీ అంటూ ..
దేశపౌరుల క్షేమం కొరకై
కుటుంబాలని విడిచి
కరోనా పై పోరు సాగిస్తూ
మొక్కవోని ధైర్యంతో
ముందుకెళుతున్న
వైద్యుల్లారా ..మీకు వందనం..!

విశ్వ వ్యాప్తంగా కుదిపేస్తున్నా
మాయదారి మహమ్మారిని
మట్టుపెట్టడానికి
విధి నిర్వహణలో
కంకణబద్ధులైన
ప్రాణ దాతలారా ..
మీకు ఏమి ఇవ్వగలం..
మమ్మల్ని తలెత్తుకొనేలా
చేసిన మీకు ..తలవంచి
సలాం చేయడం తప్ప..!
కరోనా వ్యాప్తి చెందకుండా
ప్రతొక్కరూ అప్రమత్తంగా ఉండి
నేను సైతం అంటూ

క్యారెంటైన్లో ఉంటూ ..
కరోనాపై తిరుగుబాటు చేద్దాం..!
కరోనాపై సమరానికి ప్రతి ఒక్కరం
చేయి చేయి కలుపుదాం ..!
సూక్ష్మజీవి భూతాన్ని
కనిపించకుండా తరిమికొడదాం..!

-బండారు సునీత
9440671530

అజంతా పలుకు భాష

కమ్మనైన అమ్మ భాష
మధురమైన మాతృభాష
వంపు సొంపులతోడ
కాంతులీను తెలుగుభాష

తీయతేనియల భాష
అజంతా పలుకు భాష
కృష్ణదేవరాయలచే
కొనియాడబడిన భాష

జనులు మెచ్చిన భాష
వెలుగు జిలుగుల భాష
ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్‌గా
కీర్తిపొందిన భాష

జీవద్భాష తెలుగు
జీవనానికి వెలుగు
ప్రాచీన హోదాతో
పరిమళించిన తెలుగు

గద్యాలు, పద్యాలు
కవితలు, నాటకాలు
తెలుగులోన మెరిసెను
ఎన్నెన్నో ప్రక్రియలు..

-కందూకూరి భాస్కర్
9703487088

"రేపు మన గతేమిటో?"

(కథ)

తన ఏకైక పుత్ర రత్నానికి పెళ్ళైన పదేళ్లకు గాని సంతానం కాలేదు. కొడుక్కు సంతానం కాలేదని చాలా బాధపడే వాడు వృద్ధుడైన మల్లయ్య. ఏదైతే నేమి ఎదిరి చూస్తున్న తనకి మనవడు పుట్టాడు. కుటుంబమంతా సంబరపడిపోయింది.

బుడ్డోడు బుడిబుడి నడకలతో ఇంటిల్లాదు లను అలరిస్తున్నాడు. బుడ్డోడి బోసి నవ్వులు చూసే భాగ్యం లేదు వాడి నానమ్మకి ఆవిడేప్పుడో బాల్చీ తన్నేసింది "ఆవిడ కూడా ఉండుంటే ఎంత సంబర పడేదో" అను కుంటూ బాధ పడే వాడు మల్లయ్య.

ఎలాగైతే బుడ్డోడు పెరుగుతున్నాడో మల్లయ్యలో దగ్గు జ్వరం మాటి మాటికి రావడం ఎక్కువై పోయింది.

మనవడిని ఎత్తుకొని ముద్దాడుదామంటే కోడలు వాన్ని తన వైపే రానిచ్చేది కాదు. అడిగితే "నీ పాడు రోగం నా కొడుక్కి సోకుతుంది" అని గద్దించి పెట్టేది.

**"ఇంకెన్నేండ్లు బతుకు తాడటా? అటు భూమికి ఇటు మనకూ భారమై.
నీకేమీ కోట్ల ఆస్తి సంపాదించి ఇవ్వలేదు మీ అబ్బ"**

చేసేదేమీ లేక తనలో తాను కుమిలి పోయేవాడు ముసలాయన. అప్పుడప్పుడు అనిపించేది, 'ఆ ముసలిది ముందే పోవడం మంచిదైంది. ఆమె ఉండుంటే ఇంకెంతగా కుమిలిపోయేదో' అని.

బుడ్డోడు పెరిగినా కొద్ది మల్లయ్యలో రోగం కూడా పెరిగిపోతోంది.

తన కొడుక్కి పెండ్లాం మీద మనవడు పుట్టక ముందున్న కోపం ఇప్పుడు లేదు, ఇపుడు పెళ్ళామంటే బెల్లం అయిపోయింది వాడికి. ఆమె మాటే వేదం, ఆమె మల్లయ్యను తిట్టి, చీవాట్లు పెట్టినా కుయ్యమనడం లేదు వాడు. అందుకే కోడలి నోటికి చేతలికి అడ్డూ అదుపు లేకుండా అయిపోయింది.

ముసలాయనని చీటికీ మాటికి చీదరించు కుంటుంటే అది చూడలేక ఒకరోజు తన కొడుకు "ఏమే సుబ్బలక్ష్మీ ! మా అయ్యను అంతలేసి మాటలంటున్నావెంటే..?" అని.

ఇలా అడిగాడో లేదో వెంటనే విరుచుకు పడ్తూ"ఎంటీ లేక లేక కలిగిన నా బంగారు కొండ నాకు దూరం చేస్తారా? ఆ ముదనష్టపు రోగం అంటించ చూస్తున్నాడు ఆ ముసలాడు మీకు తెల్వదు. అయినా 70-80 ఏండ్లు దాటాయి కదా ! ఇంకెన్నేండ్లు బతుకు తాడటా? అటు భూమికి ఇటు మనకూ భారమై. నీకేమీ కోట్ల ఆస్తి సంపాదించి ఇవ్వలేదు మీ అబ్బ. బోడి ఒక చిన్న కొంపా, నాలుగెకరాల చేను అంతేకదా ?, అయినా ఈ వెధవ శాల్తీనీ ఇంకెన్ని నాళ్లని మొస్తాం. చాలు చాలు కరోనా వైరస్‌తో ఎంతోమంది బతకాల్సిన యువకులు చస్తున్నారే ? ఈ ముదునష్టపోనికి చావు రాదా ! ఏదో ఒక తోవ చూసుకుని చావొచ్చు కదా !. మెడ మీద చెయ్యేసి గెంటేస్తే గాని వెల్లేట్లు లేదు". ఇలా నానా తిట్లతో ఇంటి నుండి వెళ్ళి పోయెట్టు చేసింది కోడలు.

చీము నెత్తురున్న వాడెవ్వడూ ఆ మాటలకు ఒక్క క్షణం కూడా అక్కడుండ లేడు.

పెళ్ళాం మాటలు వినలేక కొడుకెప్పుడో పనికెళ్ళి పోయాడు. ఏమీ తోచడం లేదు మల్లయ్యకు. కడసారి మనవడు వైపు దీనంగా చూశాడు, ఇవే చివరి చూపులన్నట్టు, కళ్ళల్లో నీరు ఉప్పొంగి వస్తుంటే మూలకున్న చేతికర్ర తీసుకొని బయలు దేరాడు ఎక్కడికో.

అప్పటికే తన గమ్యం లేని ప్రయాణం మొదలై రెండు రోజులు గడిచాయి. ఆకలైతే సిగ్గిడిసి అడుక్కు తింటున్నాడు అప్పుడప్పుడు, లేదంటే పస్తులే రెండు మూడు సార్లు చద్దామని ప్రయత్నించాడు కూడా, ధైర్యం చాలలేదు పిరికి తనంతో ఆగిపోయాడు.

అప్పటికే వారం గడిచిపోయింది ఒంట్లో సత్తువున్నంత వరకు నడక సాగిస్తూనే ఉన్నాడు ముసలాయన.

ఒకచోట తోవలో వందలకొద్దీ జనం పోగై ఉంది. పోలీసులు ఉన్నారు. జనాల్నందర్ని వరుసలో నిలబెట్టి పేరూ వివరాలు అడిగి భోజనం పాకెట్లు ఇస్తూ మీరందరూ లాక్ డౌన్ పూర్తి అయ్యేంతవరకు ఇదిగో ఈ గుడారాల్లోనే ఉండాలి అని చెప్పి అందులో ఉంచేశారు. వారితో బాటు మల్లయ్య నూ ఉంచేశారు.

ఇలా లాక్ డౌన్ ఎత్తేసే వరకు అక్కడే ఉ న్నాడు. ముసలాయన.

కొంత కాలానికి కరోనా వైరస్ ఉధృతి తగ్గగానే అందరినీ ఎవరి గమ్య స్థానాలకు వార్ని పంపిస్తున్నారు.

కాని మల్లయ్య "నేను మాత్రం వెళ్ళను సార్ నేనిక్కడే ఉంటాను" అని అంటుంటే

"ఎందుకూ ఏమిటీ" అని ఇలా వివరాలన్నీ ఆరతీసి "మేము సరిదిద్దుతామని" హామీ ఇచ్చి తీసి కెల్లారు తన ఇంటికి మల్లయ్యను పోలీసులు.

తీరా చూస్తే ఇంటికి తాళం వేసుంది, "ఏమిటా ?" అని పక్కింటి వారినడిగితే

"అయ్యో ! నీకు తెలువదా మల్లయ్య బాబాయ్ నిన్ను ఇంటి నుండి వెళ్ళగొట్టిన మరునాడే దుబాయ్ నుంచి వచ్చిన మీ కోడలి తమ్మునితో బాటు, ఆమె తల్లీదండ్రీ కూడ వొచ్చి ఇక్కడే వారం పది రోజులున్నారు.."

"అయితే ఏమైందీ?...." అని అడిగాడు ఆశ్చర్యంగా మల్లయ్య.

"ఏమైందీ కాదు బయటి దేశాల నుండి వచ్చిన వారితో కరోనా వైరస్ పాకుతుందట కదా! అందుకని ఆమె తమ్ముణ్ణి అతని తోబాటు కల్సి ఉన్న వారినందరినీ పరీక్షించడానికి తీసుకెళ్లారు. అదీ సంగతి, పాపం నిన్ను అనవసరంగా గెంటేశారు. నీ ఉసురు ఊరికే పోలేదులే.." అన్నారు వాళ్లు.

"అయ్యో ! నా కొడుకూ నా మనవడూ .." అంటూ మల్లయ్య గుండెలు బాదుకుం టుంటే.

మళ్లీ పక్కింటావిడ అందుకుంటూ "తత్తిమా వాల్లకేమీ కాలేదట, వారందర్నీ క్వారంటెన్స ఉంచి, ఆమె తమ్మున్ని మాత్రం ఐశోలేన్లో ఉంచారట,"

"అలాగా ప్రాణ భయం లేదు కదమ్మా !....." అడిగాడు ముసలాయన.

పోలీసులు కలిగించుకొని తాళం పగల గొడుతున్నంతలో, అపుడే వైద్య సిబ్బందితో ఆంబులెన్సు నుండి కొడుకూ కోడలూ మనవడు దిగనే దిగారు. దిగడంతోనే కోడలు సుబ్బలక్ష్మీ వచ్చి మల్లయ్య పాదాల మీదపడి "క్షమించండి మామయ్యా! నాది తప్పైంది." అని ప్రాధేయపడుతోంది.

పెద్ద మనసుతో లేపి కోడల్ని ఓదార్చాడు మల్లయ్య.

అంతలోనే పక్కింటావిడ కలిగించుకుంటు ''మీ మామయ్యకు అంటు రోగమని ఇంటినుండి తోసేశావ్ కదా ! మరి ఈ రోజేమైంది. ఆయన రోగం వైద్యానికి నయమవుతుంది, అదే మీ తమ్ముని కొచ్చిన రోగం ఈ ప్రపంచాన్నే ముంచేసే రోగం. ఇప్పుడు నీ గతేమైంది. అందుకే ఇతరులను చీదరించుకునేటప్పుడు, వెనకా ముందూ ఆలోచించాలి. ఇతరులను ఏవగించుకోరాదు తెల్సా ! రేపు మన గతి ఏమిటో ఎవరికి ఎరుక.." అని అంది.

ఆవిడ మాటలకు కిక్కురుమనకుండా మల్లయ్య చేయి పట్టుకొని ఇంట్లోకి తీసుకెళ్ళింది కోడలు సుబ్బలక్ష్మి.

-దారం గంగాధర్
సెల్:9848384777

దిల్ దివాన్ ...

దివాన్ ఎంత రాజసికమో
కవిరాజులు కూర్చునే
విశాల హాస సింహాసనం కదా!
రాయల సభలా
రవీంద్ర భారతిలా !
పూర్వం అపూర్వంగా
ఇందూరులో ఎందరెందరో కవుల సాయంత్ర
సభా సంరంభ వాడుక వేదిక
దివాన్ కవుల వాడకట్టు !
ఆహ్వానంగా
నాల్గు కాళ్ల దివాన్ కవులందరి
సాహిత్య సభా బస !
సంచారంగా
సభకు సభ కదిలినట్లు
నాల్గు ఏండ్ల క్రితం రాజధాని
భాగ్యనగరానికి వేంచేసింది
ఎన్నెన్నో కవిసమయాలను
చెదరకుండా మోసుకుంటూ !
కలివిడితనం లేని కాలానికి
దివాన్ కు ఇప్పుడు దిగులే
ఐనా దివాన్ కు
దిండుకు ఒరిగిన
ప్రతి కవి స్పర్శ ఇంకా
సుపరిచిత యాదిగా వహ్వా !
చందన వ్యాఖ్యానంతో
దిల్ దివాన్
కవిసమ్మేళనం కవిత్వంతో
సుమధురంగా మేళనం !

గది నిండా దివాన్
గది కన్నా విశాలంగా దివాన్
దివాన్ దిల్ లో
కవులందరి హృదయ స్పందన
కాలం తెలిసేది కాదు
సాయంత్రం సైతం రాత్రి వరకూ
దివాన్ పై ఉండుడే మరి !
ఆపుకారి సూర్యప్రకాశ్
ఘనపురం - కాసర్ల
చింతల -కొండా - మోతుకూరి
ఇంకాఎందరో కవుల కాణాచి
ఈ దిల్ దివాన్ !
దివాన్ పై భవిష్యత్తు
ఆశగా పూలుపూలుగా
పరుచుకొని ఉంది -
తిరిగి భాగ్యనగర ఇందూరు
కవిచంద్రులతో పుష్పకమే
నా దిల్ దివాన్
రోజూ కందాళై దైరీలో
కవిత్వంగా పదపీఠమే నువ్వు !
దిల్ దివాన్ !
గట్టిగా కవులందరినీ పిలువు
కాలం మారి వసంతంగా
నీ పై సభ సాహితీ సామ్రాజ్యమౌతుంది
చదివిన ప్రతి కవి కవిత
కావ్యమౌతుంది !

- కందాళై రాఘవాచార్య
8790593638

వర్షం వాదనా సమంజసమే!

ఇది మీకు న్యాయమా...!
నన్ను నిందిస్తారు
మీరు మాత్రం మారనే మారరు!
వర్షించుట నా లక్షణం
వరదగా మారుట
ప్రవాహమై పారుట
వాగులై వంకలై
ఏరులై సెలఏరులై
ఉరకలు పరుగులు వేయుట
నా సహజాతి సహజం!
నా దారిని అక్రమించారు
నా ఉనికిని ప్రశ్నించారు
నా నడకను మళ్లించారు
నా ఊపిరి బందిస్తారు
నా ఉధృతిని ఆపుతున్నారు!
అడవులు నరికేస్తారు
కొండలు కూల్చేస్తారు
మట్టిని దొలిచేస్తారు

ఇసుకను లాగేస్తారు...!
కాంక్రీట్ జంగిల్ సృష్టికర్తలూ
సూటిగా అడుతున్నా...
నాదారిని నాకు వదిలారా...
ఆ గోదారినీ వదిలారా
అక్రమ కట్టడాలు...
అడ్డుగోలు నిర్మాణాలు...
నాగరికత పేరిట
నేల మొత్తంపై
అసహజ సిమ్మెంటు పూతలు
ప్లాస్టిక్ పరుపులు పరదాలు!
నాదారిని నాకు వదిలేయండి
మీ జోలికి నేను రాను
ముంపు ముప్పే వుండదు!
మనిషి పుట్టక ముందు నుండే
ఈ ప్రకృతిలో నేను ప్రధానం
పంచభూతాలతో నేను కీలకం!
పంటలు పండిస్తాను

మీ జీవదారలు అందిస్తాను
మీ జీవనాధారం అవుతున్నాను!
కాసేపు కురిస్తే తప్పు
కాసేపు నడిస్తే ముప్పు
కురవకుంటే... తిట్లు ఒట్లు
సవాలక్ష ఆంక్షలు నాపైనే!
నేను వర్షాన్ని హర్షించండి
నాదారిని నాకు వదిలితే...మీ
పంట పాడి పనులు చూసుకొని
మట్టితో...గోదాటిఒడ్డుతో ఆడుకొని
ఏరులై సెల ఏరులై పాడుకొని
సముద్రంలో కలిసిపోతా...
మీకు విందు కనువిందునౌతా!

-మీగడ వీరభద్రస్వామి
7893434721

అమ్మ భాష

అమ్మలోని మాధుర్యం
నాన్న లోని కారుణ్యం
అమ్మ బాషా ఆనందంగా నెర్వు
అందమైన నుడికారాలు
అరసున్నలు విసర్గలు
యతి ప్రాసలు ఒదిగిన
కమ్మని బాషా
నా తెలుగు
బ్రౌన్ దొరచే కీర్తించబడ్డ
కృష్ణదేవారాయులు ప్రొడాబు అయ్యి

ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్‌గా
పేరెన్నిక పొందిన భాష
ఇంగ్లీష్ భాష మోజులో
అమ్మ భాషను అటకెక్కిస్తూ
బోర్లాపడడం ఎందుకు
మాతృ భాష మానవ వికాస తరంగిణి
అమ్మను ప్రేమించే వాడు
అమ్మ భాషను కాదనగాలవా
జీతం కోసం ఇంగ్లీష్

జీవితం కోసం తెలుగు
మాతృభాషతో పరిపూర్ణజీవితం

-ఉమశేషారావు వైద్య
9440408080

మూలాలే మూలికలవ్వాలి

ప్రకృతిలో ప్రతీది కళాత్మకమే పరస్పర ఆధారితమే
అభివృద్ధి, ఆధునికతహోరులో నీతులు బూతులు కారాదు
నేల విడిచి సాము చేయరాదనే తపనలో
కవి తన భావాల పొలంలో అక్షర విత్తులు చల్లి
సాహితీ పంటలు పండించి సమాజాన్ని జాగృతపరుస్తాడు

పచ్చటి పాడిపంటల పల్లెలు కల తప్పుతున్నయి
అమావాస్య రాత్రి వెన్నెల కాంతుల వేటలో
సకల వృత్తులు కుంటుబడి వలసకూలీలై
నగరానికి జేరి.. పెనం నుంచి పొయ్యిలో పడ్డరు
మార్పు మంచిదే కాని పువ్వు మొగ్గ కావద్దు కదా
రైతు, కూలీ చెమటలో అన్నపురాసులు.. అగ్నిగోళముంది

నగరాలు ఆకాశహర్మ్యాలతో కాంక్రీట్ జంగల్లై
కాలుష్యం కమ్ముకుంది
పట్టపగలే నిండు నిశీధిలో కూరుకుపోతున్నయి
ఎకరాల నేల గజాల గజిబిజిలో నరకానికి నకల్లైనై నగరాలు
మనిషి ఎంత ధనమార్జించినా కరెన్సీ కట్టలే మింగలేరు

నేలమ్మ పెట్టే అన్నపు ముద్దే కదా
మనషుల్ని తల్లిలా సాదుతున్న పంచభూతాల్ని
మింగేయాలన్న దురాశ శృతి మించుతుంది
శాశ్వతమైన వాటికి లేనిది..
శ్వాస ఆగిపోయే మనిషి మూలాలను విస్మరిస్తే
ఫ్రేమ్ పగులుతుంది.. బొమ్మ(ఫోటో)
మిగులుతుంది

బతుకు పోరులోమూలాలే మూలికలవ్వాలి
మనిషి అశాశ్వతం.. మానవత్వమే శాశ్వతం
మనిషికి సన్మార్గమే దారిదీపం

-మేకిరి దామోదర్
9573666650

సంకల్పం

ఏదీ నీ వద్ద లేనపుడు
ఏదీ లేదనకు
ఓ గొప్ప బలం నీ వెంట
ఎపుడూ నిన్ను నడిపిస్తూ
జీవింపజేస్తూ
ఆశయాల వైపు
దారిని చూపిస్తూ జీవిస్తుంది
నిన్ను జీవింప జేస్తుంది.

గూటిని వదిలిన పక్షి
గూటిని చేరేంతవరకు
శక్తి ఏదయ్యింది ?
సంకల్పం.

తన ఆశయ రెక్కలతో
ఎగిరే పక్షి బలం ఏదవుతున్నది ?
సంకల్పం.

ఎంత కొట్టినా మోడు
చిగురిస్తుంది చూడు
సంకల్ప దారిణి చెట్టు
జీవం ఏదవుతున్నది ?
సంకల్పం .

సంకల్పం.
ఇది ఆత్మబలం
మనసు చేతనా గీతం.

ఇది ధృడం
ఇది బలం
ఇది తేజోమయం.
ఆలోచనా స్వరం.
వివేక జీవం.
ఏ పయనానికైనా

తీరం చేర్చుతుంది.

ఏ గమనానికైనా
దారిని నిర్దేశిస్తుంది.

నీ వెంట ఉంటూ
నడిపిస్తుంది
నీ ఆత్మ తోడుగా మనల్ని
నడిపిస్తుంది
సంకల్పం
దృడపడాలి .

సంకల్పం వివేకమవ్వాలి.
సంకల్పం తేజోవంతమవ్వాలి.

ఏదీ లేకున్నా
సంకల్పం ఎపుడూ నీ వెంటే
అందుకే
అన్ని హంగులున్న మనిషి
గుర్తించాలి ఆత్మ సంఘర్షణలో

గుర్తించాలి అపజయంలో
ఏది కొరవడినదో.
గుర్తించాలి సంకల్ప బలమెంతో.

ప్రాణం పోయాలీ
జీవిత గెలుపు గీతానికి
వివేకమై ఊపిరి పోయాలి
సంకల్పం
మనసు ధైర్య గీతానికి.

సంకల్పం
తోడవ్వాలి ప్రతి స్పందన
మానవతా హృదయంలో.

గుర్తించాలి మహాద్భుత శక్తి విలువ.
సాగాలీ బతుకులో తోడు చేస్తు
ప్రతి మనిషీ
బతుకు భవిత అర్థమై.

సంకల్పం
కనిపించని మనలోని శక్తి
నిర్ణయం తో జన్మిస్తుంది

ధైర్య రసంతో వికసిస్తుంది
ఆత్మ బలంతో నడుస్తుంది
నిర్ణయ శక్తికి బలమిస్తుంది
సాహస గుణ ఊపిరవుతుంది

గెలుపుల తీరం చేరే వరకు
కోరినది సాధించే వరకు
మేనుకు బలమై మేధస్సును
పరిగెత్తిస్తుంది.
స్పందనలోని జవమవుతుంది.
మనిషి విలువగా మనసు బలముగా
సంకల్పం నీ తోడవుతుంది
విజయాలకు వేసే దారవుతుంది.

-సిరిసిల్లా గఫుర్ శిక్షక్
9849062038

నిత్యస్మరణీయులు

శ్రీకృష్ణుడు

-దోరవేటి
సెల్:9866251679

తే॥ తల్లిదండ్రుల చెలిమల దైన్యమణచి
కంస దుర్యోధనాదుల గర్వమణచి
భక్తజన హృదయంబుల భయము నణచి
ధర్మమునుగాచు కృష్ణ! వందనము నొనుము!

ఉ॥ పూతన, జంపినావు; ప్రియ మోహన వేణువు నూదినావు; సం
ప్రీతిని నొల్లభీముల వివేకము పెల్గగ జేసినావు; వి
శ్వోత్తిగ నై కుచేలుని కయాచిత సంపదలిచ్చినావు; స
ద్భీత నొసంగి యర్జునుని ధీరుని జేసిన కృష్ణ! దండమున్!

తే॥ జనన ప్రేమను నొన్న కృష్ణయ్య నయ్య
అర్భకుల డెందమందు కన్నయ్య నయ్య
ద్రుపద నందినినే గాచిన కృపణ నయ్య
ధర్మరూప సోదర్గనోద్ధరి కృష్ణ!

శా॥ మాయోపాయము జూపి దుష్టజన సమ్మర్దంబు నిర్జించి, య
న్యాయంబల్ యెదిరించి సజ్జనుల మానప్రాణముల్ గాచుచున్
న్యాయంబై నిజధర్మ సంస్థితుల విస్తారంబుగా నిల్పి సు
శ్రేయోరూపముపైన నిన్నుదలతున్ శ్రీకృష్ణ మమ్మాటికిన్.



కరోనా శతకం

-హెచ్.ఆర్. చంద్రం
సెల్ : 9493248053

దీని దుంపతెంచ,దేశము నల్లక
ల్లోలపరచె నీ కరోన మారి!
నేను శతక మొకటి దీనిపై విరచింతు,
మిత్రులార!ప్రేమపాత్రులార!

చైన దేశమందుజన్మించిన కరోన
స్వల్ప సమయమందె ప్రబల మగుచు
వ్యాప్తిజెందె నీ ప్రపంచమం దెల్లెడ!
మిత్రులార! ప్రేమపాత్రులార!

మందులున్న జబ్బు మనిషికి సోకిన
వైద్యవరులు గలరు బాగుచేయ;
మందులేనిదాయె మాయదారి కరోన!
మిత్రులార! ప్రేమపాత్రులార!

అగ్రరాజ్యమైన అమెరికా సైత మీ
వింతవ్యాధి జూచి విహ్వలించె;
నిలువరించలేక కలవరపడుచుండె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

అన్ని రంగములను అభివృద్ధిగన్నట్టి
దేశములు కరోన పాశమునకు
చిక్కి కలతబడుట చిత్రముగానుండె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

వచ్చుచుండు పెక్కు వ్యాధులు జనులకు,
ఇంత భయము జూడ మింతవరకు;
హడలిపోవుచుండె నవనీత మ్మెల్ల!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఏమిటీ కరోన?ఎందు కింత హడలు?
వణకుచుండె నీ ప్రపంచ మెల్ల!
అడ్డుకొనిన ఆగదా యీ మహమ్మారి?
మిత్రులార! ప్రేమపాత్రులార!

రాక ముందు వేయు టీకాలు లేవట!
తగులుకొన్న ఔషధమ్ము లేదు!
కాననే కరోన కడు భయంకర మయ్యె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఎల్ల దేశములును ఈ కరోనా మహ
మ్మారి నణచగల్గు మార్గములను
కనుగొనగ శ్రమించి పనిచేయుచుండెను!
మిత్రులార! ప్రేమపాత్రులార!

గతమునన్ మసూచి,కలరా వగైరాలు
ఆహరించె జనుల నమిత సంఖ్య;
వాని మించునట కరోన వ్యాపనమును!
మిత్రులార! ప్రేమపాత్రులార!

అంటురోగమంట,అంటునంట కరోన
ప్రజలకు సులువుగ పరస్పరమ్ము;
ఒరులు వాడు వస్తువులు తాకరాదంట!
మిత్రులార! ప్రేమపాత్రులార!

భౌతికముగ'ఎడము' పాటించవలె నంట,
రోగి పరిసరాల కేగకుండ;
కొత్తవారి నంటుకొన్నచో ముప్పంట!
మిత్రులార! ప్రేమపాత్రులార!

జాగరూకు లగుచు జను లుండవలెనంట,
గుంపుగా చరించగూడ దంట;
ఇల్లు వీడి బయటకే వెళ్లరాదంట!
మిత్రులార! ప్రేమపాత్రులార!

వ్యక్తి వ్యక్తి నడుమ అధమపక్షము'మీట'
రుండవలయు నెడము ఖండితముగ;
లేనిచో కరోన రెచ్చి పైబడునంట!
మిత్రులార! ప్రేమపాత్రులార!

కౌగిలింత వలదు,కరచాలనము లేదు,
వందనములె చేయవలయు నంట;
కానిచో కరోన కళ్ళెర్ర జేయును!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ప్రజల మేలుగోరి పాలకులు విధించు
చున్నఆంక్ష లెల్ల నన్ని యెడల
ఆచరించ కుదుర దన్ని వర్గాలకు,
మిత్రులార! ప్రేమపాత్రులార!

కూలినాలి చేసుకొను పేదప్రజ లిల్లు
కదలకున్న దినము గడచు నెట్లు?
సహకరించవలయు సర్కారు వారికి!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఎంత మొత్తుకొన్న,కొంతమంది ప్రభుత్వ
శాసనమును సుంత సరకుగొనరు;
మందలించకున్న మాట వినరు వారు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

వ్యాధి సోకినట్టివారు బాధ్యత గల్గి
వైద్యసేవ లందవలయు గాని,
తప్పుకొని తిరుగుట తగదు,శిక్షార్హమౌ!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ప్రాణముల హరించు వ్యాధు లెన్నింటినో
అణచివేయగలిగె నౌషధములు;
మానవుడు కరోనమారి నణచితీరు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

వ్యక్తులందు నుండు వ్యాధి నిరోధక
శక్తితో కరోన సమయు నంట;
హెచ్చు'కేసు'లందు నిదియె జరుగునంట!
మిత్రులార! ప్రేమపాత్రులార!

వృద్ధులందు,చిన్నపిల్లలందు కరోన
వ్యాధి చూపు దుష్ప్రభావములను;
గాన శ్రద్ధ చూపగావలె వారిపై!
మిత్రులార! ప్రేమపాత్రులార!

వ్యాధి బాధితులకు ప్రాణాలకు తెగించి,
వృత్తిధర్మ మెరిగి ,విస్తృతముగ
సేవచేయు వైద్య'సిబ్బంది' వంద్యులు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

పొగడితీరవలయు పోలీసువారిని,
విధులు నిర్వహించు విధము జూచి;
ప్రాణభయముకన్న 'పని'ప్రధానమ్మాయె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

పారిశుద్ధ్యపుపనివారెల్ల వంద్యు,ల
వ్వారి మెచ్చుకొనగ వలయు ప్రజలు;
అనితరములు వార లందించు సేవలు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

కటికి పేదయైన,కలిగినవా డైన,
దేశనేత యైన,దాసు డైన
సమముగా గణించు 'సామ్యవాది'కరోన!
మిత్రులార! ప్రేమపాత్రులార!

వేరు ప్రాంతములకు వెళ్లివచ్చినవారు
సహకరించకున్న చాల ముప్పు;
మొత్తుకొందు రిదె ప్రభుత్వాల ప్రతినిధుల్!
మిత్రులార! ప్రేమపాత్రులార!

సహకరించవలయు సర్కారువారికి,
బాధ్యతాయుతముగ పౌరు లెల్ల;
కానిచో కరోన కట్టడి యగు నెట్లు?
మిత్రులార! ప్రేమపాత్రులార!

పౌరులెల్ల నిపుడు భౌతిక దూరము
పట్ల శ్రద్ధచూపవలయు, సంటు
కొన్నచో కరోన మిన్నకుండదు కదా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ప్రజలకొరకుగాదె ప్రకటించె'లాక్డౌను'
మన ప్రధాని మోది?జనులు ధాని
ఆచరించవలయు నాపద గడచుంగ!
మిత్రులార!ప్రేమపాత్రులార!

చేసుకొనగ వలయు స్వీయ నియంత్రణ,
బాధ్యతను వహించి పౌరు లెల్ల;
తరుముచున్న ఆపదను అడ్డవలెగదా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

మొండికెత్తి తిరుగ మూర్ఖత్వమౌను,సూ
చనల ననుసరించి సాగు టొప్పు;
పౌర ధర్మములను పాటించవలె జనుల్
మిత్రులార! ప్రేమపాత్రులార!

ప్రజల మేలు గోరి రాష్ట్ర-కేంద్ర ప్రభు
త్వాలు కఠిన నిర్ణయాలు కొన్ని
తీసుకొనుట జరిగె,తెలుసుకోవలె ప్రజల్
మిత్రులార! ప్రేమపాత్రులార!

గాలిలోన గలిసె వేలాది ప్రాణాలు
మేలుకొనకయే సకాలమందు;
తెలిసెగాదె కొన్ని దేశాల స్థితి యిదే!
మిత్రులార! ప్రేమపాత్రులార!

'మూసివేత'యెవరికోసము?దేశ ప్ర
ధాని స్వార్థమునక?కాని యెడల
రాష్ట్ర ముఖ్యమంత్రి లబ్ధికా?తెలియరో!
మిత్రులార! ప్రేమపాత్రులార!

వచ్చి పడినచో నుపద్రవ మేదైన,
తట్టుకొనగ కలసికట్టుగ ప్రజ
పోరు సల్పవలయు,పౌర ధర్మ మిది!
మిత్రులార! ప్రేమపాత్రులార!

స్వల్ప సమయముననె,సకలదేశములకు
పాకె నీ కరోన,పాడుగాను;
ఇంత శక్తి దీని కేలాగు వచ్చెనో?
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఈ కరోన గూర్చి యేవేవొ కథనాలు
వినగవలసి వచ్చె;విశ్వసించ
వలసినట్టి వేవొ తెలియకుండెను,కటా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

బాధ్యులైన వారు ప్రకటించు వార్తలే
నమ్మదగును సత్యనమ్మత మని,
గాలి వార్తలు విని కంగారు పడరాదు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

తెలియకున్న తమకు,తెలిసినట్టుల నెల్ల
విషయములను గూర్చి విస్తృతముగ
వాగువారు గలరు,పండితంమన్యులు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

కట్టుకథలు చెప్పి,కలవరవెట్టి,భీ
తిల్లజేసి యొరుల,తృప్తిజెందు
మాయదారి జనులు మనమధ్యనుందురు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

చెప్పుచుండినారు చిలుకకు చెప్పిన
తీరు జనుల మేలు గోరువారు;
కాని,కొంతమంది ఖాతరు చేయరే!
మిత్రులార! ప్రేమపాత్రులార!

జలుబు,దగ్గు,జ్వరము సామాన్యమే, వీని
కింత భీతిజెంద నేల? యనుట
కుదుర,దీ కరోన కొంగొత్త రోగము!
మిత్రులార! ప్రేమపాత్రులార!

పాత లక్షణాలె పైకి కన్పించును,
గాని,తెలియకుండె దాని గుట్టు;
పుట్టు కెరిగిన కనిపెట్టవచ్చును మందు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

లక్షణాల గని అలక్ష్యము చేసిన,
కొలది దినములందె కొంప మునుగు;
తప్పుగలదు ముప్పు తగు రీతి వర్తించ!
మిత్రులార! ప్రేమపాత్రులార!

చెప్పుచుండినారు స్వీయ నియంత్రణ
వలన నుండు తగిన ఫలిత మనుచు;
చెప్పుచున్న మాట చెవిబెట్టవలె గదా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

కొంతమంది నాయకుల మాటలేమిలే,
చాలమంది పారిటీలు మరచి,
ప్రజల మేలుగోరి పనిచేయుచున్నారు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఆర్థికముగ సాయ మందించుచున్నారు
కొంతమంది శక్తికొలది; ఆస్తి
పరులు సమయ మెరిగి స్పందించవలె గదా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

కష్టకాలమందు కలవారు తగురీతి
ఆదుకొనుట లెస్స ఆర్తజనుల;
కలరు దానగుణము గలవారు పెక్కురు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఇంత అంత అనక,ఇయ్యగల్గిన యంత
యిచ్చి సాయపడగవచ్చు;నగదు
రూపముగను, వస్తు రూపమం దైనను!
మిత్రులార! ప్రేమపాత్రులార!

కోట్ల నిచ్చువారు కొందరే,స్వచ్ఛంద
సేవ పేదయైన చేయవచ్చు;
ఆదుకొనుట ముఖ్య మాపత్సమయమున!
మిత్రులార! ప్రేమపాత్రులార!

కష్టకాలమందు కలవారు నిర్లిప్త
వర్తనులుగ నుంట పాడి కాదు;
శక్తికొలది వారు స్పందించ వలయు ను!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఇచ్చు దానికన్న హెచ్చుగా వెచ్చించి
పత్రికాదులందు ప్రకట పరచి,
తృప్తిపొందు'దాత'లెందరో లోకాన!
మిత్రులార! ప్రేమపాత్రులార!

'మూసివేత' సమయమున పేదసాదల
దుస్థితికి చలించి,తోచు రీతి
సాయపడవె కొన్ని స్వచ్ఛంద సంస్థలు?
మిత్రులార! ప్రేమపాత్రులార!

అణచివేయకున్న నతివేగముగ ఉగ్ర
రూపమునకు ఈ కరోన మారు;
అట్టి దారుణమ్ము నెట్టులూహింతుము?
మిత్రులార! ప్రేమపాత్రులార!

పట్టువిడుపు లుండవలె కొన్నిసమయాల,
మొండివారి పట్ల దండనీతి
అమలుపరచవలయు నవసరమ్మైనచో!
మిత్రులార! ప్రేమపాత్రులార!

చదువుకొన్నవారు,సంస్కార వంతులు
వెర్రి వేషములను వేయ,దగున?
సహకరించవలదె సర్కారువారికి?
మిత్రులార! ప్రేమపాత్రులార!

చదువు సంధ్య లేని,సదసద్వివేకమ్ము
లేని పామరులకు పూని చెప్ప
వలయు మరల మరల తలకెక్కువరకును!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఈ కరోన 'బూచి' యెల్ల దేశములందు
విలయ తాండవమ్ము సలుపుచుండె;
చూపుచుండె 'విశ్వరూపము'నందందు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

తీసివేయరాదు తేలికగా దగ్గు,
జలుబు,జ్వరము చాల సహజ మనుచు;
నిజము తేల్చు వైద్యనిపుణుడు వీక్షించి!
మిత్రులార! ప్రేమపాత్రులార!

తనకు వ్యాధి సోకె నను నిజం బెరుగని
మనిషి కలసి తిరిగి మందితోడ,
అందరికిని దాని నంటించు చుండును!
మిత్రులార! ప్రేమపాత్రులార!

లేదు వ్యాధి యని పరీక్షలో తేలిన
సంచరించవచ్చు సంతసముగ;
ఉన్న యెడల దాచుకొన్న ముప్పే కదా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

అధిక మగుచునుండె
వ్యాధిగ్రస్తుల సంఖ్య, పోరుచుండె నిరు
ప్రభుత్వములును;
సాయపడగ బూనె సైనిక వర్గాలు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

అవసరమ్ము కొంత,అజ్ఞాన మొక కొంత
అడ్డుపడును పలు ప్రయత్నములకు;
ఐన,చేయవలె ప్రయత్నమ్ము లాపక!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఉబుసుపోక,కొంద రున్నవి లేనివి
పోగుజేసి,కల్లబొల్లి కతల
నల్లి వ్యాప్తిచేతు,రవి ప్రమాదకరాలు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

మంతరాలు వేసి,చింతకాయల్లు రాల్తు
మనెడు వారి మాట వినుట తగదు;
ఇట్టివారి వల్ల రెట్టించు నిక్కట్లు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

తరచు సబ్బుతోడ పరిశుభ్రముగ హస్త
ములను కడుగుకొనగ వలయునంట;
వాంఛనీయమె కద వ్యక్తిశౌచము సదా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

బాధ్యులైనవారు బహుముఖమ్ముల హెచ్చ
రించుచున్న ,నాలకించకున్న,
ఈ ఉపద్రవమ్ము నెట్లు తరించుట?
మిత్రులార! ప్రేమపాత్రులార!

కాలయాపనమ్ము కాకుండ,
ఈ కరో నా పిశాచి దూకు డాపకున్న,
ప్రాణనష్ట మెంతగా నుండునో మరి?
మిత్రులార! ప్రేమపాత్రులార!

కుల మతాది భేదములబట్టి
గాక, అందరికి అంటరానితనము నంట
గట్టె నీ కరోన,గమనార్హ మిది కదా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

అల్ప బుద్ధు లుందు రందందు,
తాముగా చేయ రెదియు గాని,చేయు వారి
పనుల జూచి వంకలను పెట్టుచుందురు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

అదుపు చేయవలయుప్రాణనష్టము ముందు,
ఖర్చు లెక్క లిపుడు కట్టరాదు;
మృతుని ధనపు రాశి బ్రతికించజాలునా?
మిత్రులార! ప్రేమపాత్రులార!

అప్రమత్తమయ్యె అన్ని ప్రభుత్వ శా
ఖలు కరోన తోడ కలసి పోర;
మట్టుపెట్టు వరకు పట్టు విడువరాదు!
మిత్రులార! ప్రేమపాత్రులార

ఎంత చేయుచున్న ఈ విపత్సమయాన
పనులలోన లోటు పాటు లుండు;
ప్రజలు సహకరించవలె ప్రభుత్వాలకు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ప్రజలలోన నున్న భయము
ముందుగ తొలగించి,నమ్మిక కలిగించ వలయు;
బెంగ మాన్పులను క్రుంగజేయును గదా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

భయము నూరిపోయు వా రెక్కువైనారు,
వివిధ మాధ్యమములు వేదికలుగ;
అదుపు చేయవలయు నట్టివారిని పట్టి!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఏమి చెప్పవలయు?సృష్టించి
అలజడుల ప్రజలలోన,తృప్తి పడెడు వారు
ఉందు రందునందు,'ఉలిపికట్టెలు' వారు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

సార్సు(రాంఖీ)మాతృభూమి చైనా, కరోనాకు
నడియె మాతృభూమి యయ్యె,రెండు
'వైరసులు'ప్రమాదకారులై వర్తించె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఎవరి నోట విన్న ఈ కరోనా నామ
జపమె,జనులలోన జడ్డుపు ప్రబలె;
భయవిముక్తి కెంత వ్యధి పట్టునొ మరి?
మిత్రులార! ప్రేమపాత్రులార!

జలుబు,దగ్గు,జ్వరము సామాన్యములె,కరో
నాకు నవియె లక్షణమ్ము లగుట
నాని తలపు గూడ భయకారణమ్మాయె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

జాగరూకు లగుచు చరియించ వలె గాని,
చొరవజేసి బయట తిరుగరాదు;
పౌర బాధ్యతలను గౌరవించుట విధి!
మిత్రులార! ప్రేమపాత్రులార!

జరిగిన పొరపాటు క్షంతవ్యమగు గాని,
ఒప్పరాదు తెలిసి తప్పుచేయ;
ఆటలాడ గూడ దంట్రు రోగాలతో!
మిత్రులార! ప్రేమపాత్రులార!

వారిపైన వీరు,వీరిపై వారు దు
మ్మెత్తి పోసుకొన్న నేమి ఫలము?
కలసి ఈ విపత్తు కడతేర్చవలె గాని!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఉందు రొక్క కొంతమంది మూర్ఖులు, వారి
గుణము నెపుడు మార్చుకొనరు;పిడుగు
నకును వియ్యమునకు నొకటియే మంత్రము!
మిత్రులార! ప్రేమపాత్రులార!

మానవులకు ఈ కరోనా మహమ్మారి
వలన ప్రాణహాని కలదు గాన,
మూడలిపోవుచుండె యావత్ప్రపంచము!
మిత్రులార! ప్రేమపాత్రులార!

గుడ్డ మొగముపైన అడ్డముగా కట్టి,
బయటి కరుగవలసి వచ్చె,కర్మ!
గుర్తు పట్టజాలకున్నాము మనుజుల!
మిత్రులార! ప్రేమపాత్రులార!
ప్రతి విషయము బోధపడకున్న, చెవి బెట్ట
వలె నిపుణుల సూచనలను జనులు;
చేయి దాటిన తుది చింతించిఫల మేమి?
మిత్రులార! ప్రేమపాత్రులార!

మనుజ రూపమందు మాయదారి కరోన
వచ్చెనేమొ యన్న భయమొ ,యేమొ?
మనిషి జూచి మనిషి అనుమాన పడుచుండె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఇది 'కరోన సమయ',మిపుడెల్లవారు దీ
నిని గురించి చెప్పుకొనుట,తలచి
వడకుటయును,భయము పడుటయు కన నౌను!
మిత్రులార! ప్రేమపాత్రులార!

చాప కింద నీటి చందాన ప్రాకిపో
యెను కరోన భూమి నెల్ల కదల;
గురుతు పట్టు సరికె కొంప లంటుకు పోయె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

దిమ్మదిరిగిపోయె దిగ్గజములవంటి
పెద్ద దేశములకు;పేద-చిన్న
దేశములకు దిక్కు దేవుడే యగునేమొ?
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఉడుత వోలె సాయపడవచ్చు తమ శక్తి
కొలది యెవ్వరైన,తలచుకొన్న;
తృణము కష్టకాలమున మేరు వనిపించు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

మేలు కాదు మీనమేషాల లెక్క ల
త్యవసర సమయాల,తక్షణమ్మె
చేయగలది యేదొ చేయుటయే లెస్స!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఒడ్డుపైన కూరుచుండి చెప్పగవచ్చు
మాట లెన్నియైన,మనసు పెట్టి
పనులు చేసినపుడె ఫలితాలు దక్కును!
మిత్రులార! ప్రేమపాత్రులార!

క్లిష్ట సమయమందు కష్టమౌ సేవ లం
దించినట్టి వారి కెల్ల ప్రజలు
వందనాలు చేయవలె మనస్ఫూర్తిగా!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఎల్ల దేశములకు ఈ కరోనా పేరు
తెలిసె,దీని శక్తి తెలిసె,దీని
పరిధి జూడగా ప్రపంచ విస్తృత మాయె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ప్రాణు లన్నిటికిని ప్రాణాలపై ప్రీతి,
మరణ భీతి మెండు మానవులకు;
కాననే కరోన కడు భయంకర మయ్యె!
మిత్రులార! ప్రేమపాత్రులార!

మానవాళి నడుమ మరణ మృదంగము
మ్రోగుచుండె నీ కరోనవలన;
ప్రాణభయము లేని మానవు లుందురా?
మిత్రులార! ప్రేమపాత్రులార!

సార్సు,మెర్సు,జీక,స్వైన్ ఫ్లూ, ఎబోలాలు
నిలువరించబడవె?నేటి దైన
ఈ కరోన నట్లె యెదిరి పోరగలేమె?
మిత్రులార! ప్రేమపాత్రులార!

గతమునను కరోన కనిపించె, నిది వినూ
తన కరోన,దీని గుణము వేరు;
కాన,కొత్త మందు కనుగొనవలె నంట!
మిత్రులార! ప్రేమపాత్రులార!

కొత్త జబ్బు గమక ,కొత్త మందులు కను
గొనగవలసె,దాని కొరకు పనులు
జరుగుచుండె,వచ్చు త్వరలోనె ఫలితాలు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

త్వరిత గతిని సాగి పరిశోధవలు,మందు
కనుగొనబడునంచు మనము కోరు
కొంద,మిక కరోన ప్రందుట తథ్యము!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఎన్ని మొండి జబ్బు లింతకు ముందు రా
లేదు,తట్టుకొనగ లేదు జనులు?
ఈ కరోన చరిత మీలాగె ముగియును!
మిత్రులార! ప్రేమపాత్రులార!

భయము హెచ్చరికగ భావించి,
జాగ్రత్తపడిన ,దాన కొంత ఫలము దక్కు;
భయము బతుకు కతకు భరతవాక్యము కాదు!
మిత్రులార! ప్రేమపాత్రులార!

బతికినన్ని నాళ్లు భయములు,బాధలు
వచ్చి పోవుచుండు వరుసగట్టి;
జీవిత మన నేమి?చీకటి వెలుగులే!
మిత్రులార! ప్రేమపాత్రులార!

మంచి జరుగు నంచు, మనిషి ఆశావాది
యై చరించవలె,నిరాశ నెపుడు
దరికి జేరనీయ దగ దెంతమాత్రము!
మిత్రులార! ప్రేమపాత్రులార!

చాలమంది కవులు స్పందించి, ఈ భయం
కర కరోన పైన కలము పట్టి
వ్రాయుచుండినారు పలు ప్రక్రియలలోన!
మిత్రులార! ప్రేమపాత్రులార!

ఇది కరోన శతక,మెల్లర కర్థమౌ
సులభ శైలి, నాటవెలదులందు
వ్రాసినాడ,సెలవు!పాఠకులకు స్వస్తి!
మిత్రులార! ప్రేమ పాత్రులార!

నైటింగెల్ వారసులకు వందనం

విషపురుగు విశ్వమంతా ఇసురుకుంటూ
మరణ మృదంగం మోగిస్తూ
నా పెయ్యిని చుట్టుముట్టి, ఖైదీని చేస్తుంటే
ప్రాణం నిలబెట్టే దేవాలయంలోకి వెల్లగానే
మెడలో సర్పంలా స్టెతస్కోప్ వేసుకొని
కంటితో రిపోర్టులను స్కాన్ చేసి
కరోనా కాలనాగని సెలవిచ్చాడు

శరీరం మొత్తం శవరింగ్ తో
క్వారంటైన్ లో కాలుపెట్టగానే
శ్వేత వస్త్రంలో దేవతలా
శాంతికి చిహ్నం పావురంలా ఎదురొచ్చి
ఆప్యాయతల అమృతాన్ని కుమ్మరించి
గస్తీ కాసే సైనికుడిలా
కంటికి రెప్పలా నన్ను కాపాడింది

ఆమే మాటల్లో అమ్మను
అమే ధైర్యం లో నాన్నను
ఆమే అనురాగంలో
అన్నదమ్ములను చూపిస్తూ,
వైరస్ ను ఊడ్చేస్తూ
అందరిలోటును తీర్చింది

సరియైన సమయానికి
ఔషధాలు, ఆహారాన్నిచ్చి
నా పెయ్యి లో తాకతు పెంచింది
కరోనాతో పక్కోడు కాలం జేస్తే

నాలో ధైర్యపు ఇటుకలను పేర్చి
ఆశల భవనాన్ని నిర్మించింది
నాలో నిరాశ మేఘాలు కమ్ముకుంటే
జీవితంపై కొత్త మొలకలు మొలిపించింది

సొంత ఇంటిని , పిల్లలకు దూరమై
నైటింగెల్ వారసులై
నాకు పునర్జన్మనిచ్చి, సంజీవనిలా కాపాడింది
ఏమిచ్చి రుణం తీర్చుకోను
చేతులు జోడించి నమస్సులు తెలపడం తప్పా,
ఏమిచ్చి రుణం తీర్చుకోను
గుండె లోతుల్లోంచి ఆశీస్సులు అందించడం తప్పా,

ఏమిచ్చి రుణం తీర్చుకోను
పాదాభివందనం చేయడం తప్పా.

(కరోనా రోగులకు సేవలు చేస్తున్న
నర్సులకు పాదాభివందనాలతో.)

-తాటిపాముల రమేష్
7981566031

అందినవి

పుస్తకం: ముద్దుబాల శతకం
రచయిత: డా॥నలపోలు నరసింహారెడ్డి
ప్రతులకు: తెలుగు సాహితీ పీఠము
ఇ.నెం.9-9-144, ఫ్లాట్ నెం.39
రెడ్డికాలని, చంపాపేట్
మం॥ సరూర్‌నగర్, జిల్లా॥ రంగారెడ్డి
హైదరాబాద్. సెల్: 9848898515



పుస్తకం: భక్తిలతా మాధవీయం
రచయిత:పొడ్డుటూరి మాధవీలత
ప్రతులకు: హిమజా లేడీస్ టైలర్
అనిల్ టాకీస్ రోడ్
బోధన్-503 185.నిజామాబాద్.
సెల్: 9030573354/73884 83664

పుస్తకం: ఒక కలం-రెండు గళాలు
రచయిత:మాచవోలు శ్రీధరరావు
ప్రతులకు: 311, బ్లాక్ 2,
సి.బి.ఆర్. ఎస్టేట్స్ దీప్తిశ్రీ నగర్,
మియాపూర్-500 049
సెల్: 9441833788



పుస్తకం: ఆకాశమంత చూపు
రచయిత: బి. గోవర్ధనరావు
ప్రతులకు:ఎస్.సన్యాసిరావు, ఎడిటర్: విశాఖ సంస్కృతి
సెల్: 9603076777



పుస్తకం: గరీబోని గోడు
రచయిత: యు.కె.మేఘు (హిమాగ్ని)
ప్రతులకు:సంజ్ కిరాణ ఎదురుగా
గావ్‌దేవి రోడ్, న్యూ బాలాజీనగర్
అంబర్‌నాథ్(ప)-421 505 ఠాణే జిల్లా.మహారాష్ట్ర
సెల్: 9860709745



పుస్తకం: ఆశల విరులు
రచయిత: ఉదయశ్రీ ప్రభాకర్
ప్రతులకు: ఫ్లాట్ నెం.203
పద్మశ్రీ హైట్స్, పద్మాక్షి కాలనీ
హన్మకొండ, వరంగల్..అర్బన్
సెల్: 9866687134



పుస్తకం: వింటూ ఉంటే చెపుతూ ఉంటా
రచయిత:డా॥మాదిరాజు బ్రహ్మానందరావు
ప్రతులకు:ఆనందవాణి నిలయం. 6-59/29
దమ్మయ్‌గూడ, నాగారం పోస్ట్
క్రిష్ణ సినిమా హాల్, కీసర మండలం,మెడ్చల్ జిల్లా.
హైదరాబాద్. సెల్: 9247 836 873.



పుస్తకం: తెలంగాణ మహోదయం
రచయిత:డా॥ ఆచార్య ఫణీంద్ర
ప్రతులకు:జి. సావిత్రి, శ్రీకారం,
6-34/48/1, దమ్మయ్‌గూడ,
హైదరాబాద్-500 083 సెల్: 9959882963

నానీలు

ప్రగతి గుర్రం
పరిగెత్తడం లేదు
అవినీతి కళ్లెం
అడ్డుచ్చింది

కరువు కాటుతో
పోవటం లేదు
రైతుల ప్రాణాలు
పాలకుల వెన్నుపోటుతో

స్వాములు
స్కాములు
కోకొల్లలు
పుణ్యభూమి

ఎన్నిసార్లు
రోడ్డు వేసిన
ఉండ టం లేదు
నేతలు బాగు పడ్డారు

ధనానికి
పాపపుణ్యాలు
తెలియని తెలియవు
ఎక్కడున్నా విలువే

అందాల నగరానికి
దిష్టి బొమ్మలు
నగర చివర ఉన్న
మురికి వాడలు

తుఫాన్‌లో
కొట్టుకుపోయాయి
ప్రజల ధన, ప్రాణాలే కాదు
నేతల దరిద్రం కూడ.

ఉత్తరానికి
ఉత్తర క్రియలు
జరిగిపోయే యి
తదిన్నాలే మిగిలాయి

ప్రేమ పోయి
చాలాకాలం అయ్యింది
అందుకే
ప్రేమికుల దినం

కడుపు
కాలిపోతుంది
పాదాలు
వలసబాట పట్టాయి

పుట్టడంలో
ఎవరైనా ఒక్కటే
బతికి బట్ట కడ్డడంలోనే
తేడా

తల ఎత్తుకొలేని
నేరాలు చేశాడు
అందుకే
రాజకీయాలలో ఉన్నాడు

పర్యావరణం
ప్రమాదంలో పడింది
మానవ మృగాల
వికృ త చేష్టలతో

చెఱకు
తియ్యగా లేదు
అమ్మితే గాని
తెలియలేదు

వినాయకుడు
పాలు తాగుతున్నాడు
నిజమే
అవినీతి పాలు

సాయం చేస్తే
అమ్మ
లేకుంటే నీయమ్మ
నేటి కాలం

శల్య సారథ్యంలో
కీచకులు
ఎక్కువైయ్యారు
రక్షణ కరువైంది

రుద్రాక్ష పిల్లి
నీతులు చెబుతుంటే
ఆషాఢ భూతులు
వినకుండా ఎలా ఉంటారు

చందమామ
దిగిరాదు
అందుకే
అందంగా ఉంటుంది

అమాయకుడే
నోట్లో వేలు పెడితే కొరకడు
జేబులో డబ్బు పెట్టు
స్వీకరిస్తాడు

కారం తగిలితే
నోటికే మంట
వె ట కారానికి
ఒళ్లంతా మంట

ఏ ఎండ కా గొడుగు
అందుకే
అవినీతిలో
ముందడుగు

ఓటరు
ఎన్నికలలో
తమలపాకు
తర్వాత కరివేపాకు

పుట్టింది
కుంభకోణం
అవినీతే
అతని ప్రాణం

కాగితం పులి
పాలనలో
పథకాలు
కాగితాలకే

కోరి కష్టాలను
కొని తెచ్చుకోవడం
నేరగా ళ్ల ను
ఎన్నుకోవటం

–ఆచార్య గిడ్డి వెంకట రమణ
9440984416

నవలోకం

నిరుపేదలు , నిరుద్యోగులు లేనీ లోకమొకటి
చింతలువింతలు లేని లోకమొకటి
ఆకలి చావులు ,ఆశల ఎండ మావులులేని లోకమొకటి
అన్యాయం ,అధర్మం లేని లోకమొకటి
కరువుకాటకాలు లేని లోకమొకటి
మానవుణ్ణి మానవుడే వంచించే నాటకాలు లేని లోకమొకటి
హత్యలు ,ఆత్మ హత్యలు లేని లోకమొకటి
కష్టాలు, కన్నీళ్లులేని లోకమొకటి
దౌర్జన్యం,దారిద్ర్యం లేని లోకమొకటి
దోపిడి,రాపిడీ లేని లోకమొకటి
దాడులు,పాడులు లేని లోకమొకటి
మోడులు ,బీడులులేని లోకమొకటి
వడగాడ్పులు,జడ ఏడ్పులు లేని లోకమొకటి
తప్పులు,అప్పులు లేని లోకమొకటి
హింసలు,ధ్వంసములేని లోకమొకటి
కక్షలు,వివక్షలులేని లోకమొకటి
ప్రమాదాలు,ప్రళయాలు లేని లోకమొకటి
ప్రకృతి ధ్వంసం లేని లోకమొకటి
కార్చిచ్చులు, కర్షకుల అప్పుల ఉచ్చులు లేని లోకమొకటి
అసత్యం ,అశాంతి లేని లోకమొకటి
పొరుగువారి పోరుగోలలు,
సరిహద్దుల్లో గొడవలు లేని లోకమొకటి
కులాలు, మతాలు లేని లోకమొకటి
ఈర్ష్యా, ద్వేషాలు లేని లోకమొకటి
కోపాలు, తాపాలు లేని లోకమొకటి
వాదాలు,వివాదాలు లేని లోకమొకటి
రాక్షసత్వం,దానవులు లేని లోకమొకటి
అబద్ధం,అణుయుద్ధం లేని లోకమొకటి

సమసమాజపు నవలోకమొకటి
శోకమెరుగని మానవలోకమొకటి
అలాంటి ఆ నవలోకంకోసం
విశ్వవీధుల నిలచి
అష్టదిక్కుల పిలచి
పంచభూతాలను తలచి
నవభావకవనం విరించి
హృదయశంఖరావం
యువరాగంలో పూరించి
స్వాగతమంటాను
నేను స్వాగతమంటాను.

–నల్లగొండ
83094532179

దునియాకు వెలుగులు పంచే దీపం అతడు

విద్యుత్ కాంతులతో విశ్వాన్ని
వెలుగులతో వికసింపచేస్తావు నువ్వు.
గుండెల్లో దాగిన బాధను దిగమింగుకొని
దినరాత్రులు, దిపాలజ్వాలకై తపనపడతావు నువ్వు.
విద్యుత్ స్తంభాలే నీ నేస్తాలు.
నిత్యం కరెంటు తీగలతో యుద్ధమే,
అనునిత్యం కత్తులు వంతెనపై ప్రయాణమే,
ఎప్పుడు యమధర్మరాజుతో పొరాటమే.
పసిపాపలు పదిలంగా నిద్రపోవాలన్నా,
యంత్రాలన్నీ పరుగులు తీయాలన్నా,
చరవాణిలు మా చేతిలో మ్రోగాలన్నా,
అంతర్జాలంలో ప్రపంచం అంతా పరుగెత్తాలన్న,
నిదురించని నీ కళ్ళతో,కండలన్ని కరిగించి,
విపత్తును కూడా వినోదంగా భరించి,
నీ కష్టాల చెమటచుక్కల దారలనుండి,
విద్యుత్ శక్తిని ప్రవహింపచేస్తావు నువ్వు.
తెరచాటున దాగిన చీకటి పొరల్లో
కష్టాలన్నీ నీ దేహానికి సుడిగుండాల్లా చుట్టుకున్న,
క్షణక్షణం మృత్యుఘంటికలు మ్రోగుతున్న,
ప్రతిబింబ కాంతులను పంచడం కోసం,
రేయనక పగలనక పరితపిస్తావు నువ్వు.
వెలుగుతున్న కరెంటు బుగ్గల మధ్య
అతి సుందరంగా కనిపించే,
మా బాబుబొమ్మవు నువ్వు.
దునియాకు వెలుగును పంచి
దారిచూపిస్తున్న కరెంటన్నవు నువ్వు.
మా అందరి బంధువు నువ్వు.

–అశోక్ గోనె
సెల్.9441317361

హైకూలు

మట్టి మనిషి
కప్పుకున్న దుప్పటి
ఈ పంటపొలం

మేఘం కన్నీరు
రైతు సంతోషానికి
రాల్చే పన్నీరు

నల్లమబ్బులు
దోబూచులాడినవి
రైతు ఆశతో

ఆకాశంలోని
విహరించే మేఘాలు
జలపాతాలు

అందాల పిట్ట
అద్దాన్ని పొడుస్తోంది
ఎంత అసూయ!

అనుబంధాలు
ధనానికి దాసోహం
కాల మహిమ!

వర్షం ఆగింది
నేల చెక్కిలిపైన
మేఘ దర్పణం

నేల సిగపై
ఉదయించే సూరీడు
ఎర్ర గులాబీ

ప్రకృతి కాంత
కట్టిన పట్టు కోక
నా పల్లెటూరు

వాన తల్లికి
కప్పల అరుపులు
స్వాగత గీతం

నింగి నెత్తిన
రంగుల కిరీటము
ఇంద్రధనుస్సు

–మల్లెఖేడి రామోజీ
6304728329

నేటినిజాలు

తల్లిదండ్రులే నీకు ప్రత్యక్ష దైవాలు
వారి ఆశీర్వాదమే నీకు పురోగతి
తల్లి పాదాల కింద స్వర్గం
నేడు సంతానం అవుతోంది వారికి నరకం
తల్లి జన్మనిస్తే
తండ్రి దారి చూపితే
వారికి నువ్విచ్చే బహుమతి వృద్ధాశ్రమం
కనుమ మాట..ముత్యాల మూట

తల్లి నుదుట చుంబించినప్పుడు
తండ్రి భుజాలకెత్తు కున్నప్పుడు
వారికి తేలిక
నేడు వారవుతున్నారు నీకు భారం
ఉన్న మాట..కనుమ మాట

నీ మల,మూత్రాలు తీసేసిన తల్లి
తల్లి లేనప్పుడు నీ తండ్రి చేసే సేవ
అయినా వారి కనుసన్నలలో ఎప్పుడూ నీవు
ఉన్నమాట..కనుమ మాట

అమ్మ స్టేషన్ కు/బస్ స్టాండ్ కు
వస్తుందంటే అర గంట ఆలస్యం
భార్య వస్తుందంటే అర గంట పడిగాపులు
ఉన్నమాట..కనుమ మాట

నీకు కొలువు దొరికితే
తమకే వచ్చిందని తల్లిదండ్రుల.ఆనందం
గుళ్ళో అర్చనలు,పేదలకు అన్నదానాలు
నీవేమో డాబాలలో పార్టీలు
క్లబ్బుల లో విలాస నాట్యాలు
ఉన్నమాట..కనుమ మాట

వివాహ సమయంలో
తల్లిదండ్రుల మోము వివర్ణం
కొడుకు ఓ ఇంటి వాడవుతున్నాడనే సంతోషం
వివాహం తర్వాత
భార్యనే అల్లం
భార్యనే బంగారం
తల్లిదండ్రులు పూచిక పుల్లలు
వారి ఆవాసం వృద్ధాశ్రమం
ఉన్నమాట..కనుమ మాట

తల్లిదండ్రుల కు సుస్తిచేస్తే ప్రభుత్వ ఆసుపత్రి
భార్యకు సుస్తిచేస్తే కార్పొరేట్ వైద్యం
ఉన్నమాట..కనుమ మాట

వివాహం ముందు
తల్లిదండ్రుల మాటే వేద వాక్కు
వివాహం తర్వాత
భార్య మాటే బంగారు వాక్కు
ఉన్నమాట..కనుమ మాట

తల్లిదండ్రులు తీర్థయాత్రకు వెళతాం అంటే
చీవాట్లు
భార్య విహార యాత్రకు దగ్గర ఉండి ఏర్పాట్లు
ఉన్నమాట..కనుమ మాట

తల్లిదండ్రుల షష్ఠి పూర్తికి లేని ధనం
భార్య పుట్టినరోజుకు బాకీ చేసిన వైనం
ఉన్నమాట..కనుమ మాట.

–కనుమ ఎల్లారెడ్డి
93915 23027

హరిత రంగవల్లులు

అవనిని పిలిచి ఆకాశం అడిగింది –
తెలంగాణ వాకిట హరిత రంగవల్లులు ఏమిటని?

అవని బదులు పలికింది–
పల్లె పల్లె వీధి వీధి
మొక్కల చుక్కలు పెడుతున్నారని
హరిత రంగవల్లుల తీర్చిదిద్దుతున్నారని.....

దూరం జరుగుతున్న అడవి, పల్లె చేరువ రావాలని
పలచబడిన వాన ఇక చిక్కని ముసురవ్వాలని
ప్రతి పట్నం ప్రతి పల్లె హరితహారం అలరారాలని
పాతాళపు జలసిరులు పై పైకి ఉబకాలని
ప్రతి ఇల్లు ప్రతి వీధి పచ్చదనం నిండాలని
సిరులవల్లి తెలంగాణ తల్లికివి ఆకుపచ్చ బోనాలని ....

ఆకాశం సంబరపడింది –
సూర్యుని కోరిక కోరింది
వేడిమి కొంచెం తగ్గించాలని
మొక్కలు ఇంకాస్తా చిగురించాలని.....

ఆకాశం హరివిల్లై విరిసింది –
గాలికి ఓ మాట చెప్పింది
శీతల పవనాల వీయుమని
మొక్కల సంరక్షణ తప్పక చూడాలని....

ఆకాశం నలుపై ముసిరింది –
మేఘాలని పిలిచి చెప్పింది
చినుకు ముత్యాల
మొక్కల చుక్కల సింగారించాలని
హరిత రంగవల్లుల
మెరుపు హంగులు అద్దాలని...

(హరితహారం సందర్భంగా...)

–అశోక్ గుంటుక
సెల్ నం. 9908144099

మట్టి గీతం

యుద్ధం అంటే
నీకో, నాకో కాదు
నేలకూ నాగలికి
భూమిలో నాల్గు విత్తులు
వేసాకే మొదలవుతుంది
గాలి గారడీలు
ఋతుపవనాల ఫిరాయింపులూ
నకిలీ విత్తనాలు
పకపకలూ
పనిచెయ్యని క్రిమి సంహారక మందులూ
పాలిపోయి వాడిన కంకులూ
ఎదురొచ్చే శత్రువైతే ఎదిరించొద్దు
నమ్మకపు లేబిల్‌తో
నడిపించే వాళ్ళతో
యుద్ధం కష్టమే
శ్రమనీ చిందించాక
నాలుగు ముద్దలు
నోట్లోకి పోతేనే కదా
యుద్ధానికి సార్థకత
మేఘం మురిసి కురిసాక
కొన్ని ఆశలు తీరి మురియాలి
కన్నీటిని పులుముకొన్న కళ్ళు
సేదతీరి ఆనందంతో వెల్లి విరియాలి
మాగాణి యుద్ధం ముగిశాక
మనో నేత్రాలపై కలలు
ఆశల పిట్టే వాలి
మట్టిగీతం ఆలపించాలి.

– మహబూబ్ బాషా చిల్లెం
9502000415

గురుదేవోభవ మెరుపులు

గురువే దైవమురా
నిత్యం పూజించుటకు
గురువే ఆయుధమురా
కష్టాలతో పోరాడుటకు !!

చూపుతోనే పసిగట్టి
సమస్యలను ఎండగడతడు
విద్యార్థులపై దృష్టిపెట్టి
విజయాలకు మూలమైతడు !!

గురువు అండవుంటే
కొండలను ఢీకొట్టవచ్చు
గురువు తోడుగుంటే
ధైర్యంగ బతకవచ్చు !!

లోతైన మర్మాలను
విడమరచి చెబుతాడు
లోతులున్న జీవితాలను
పైకిదీసి ప్రకాశింపజేస్తాడు !!

ఉత్తమమైన గురువు
తనకుతాను ఉప్పొంగడు
భారం మోయలేనిగురువు
నవశకం సృష్టించడు !!

గురువుకార్చే చెమట
సమాజానికి శ్రేయస్సు
గురువు నోటిమాట
కలిగించులోకానికి ఉషస్సు !!

గురుదేవోభవ అంటేనే
కలుగుతుంది వైభవం
గురువు మాటవింటేనే
సిద్ధిస్తుంది మనకు అనుభవం !!

కుటుంబ సమస్యలను
గుండెల్లో దాచుకుంటారు
విద్యార్థులజీవితాల్లో వెలుగులను
నూతనంగ ప్రకాశింపజేస్తరు !!

గురువు నిత్యవిద్యార్థి
అనుభవంతో భోదిస్తడు

విద్యార్థులలో విద్యార్థి
ఒపికతో అక్షరాలుదిద్దిస్తడు !!

గురువు బాధపడుతూ
ఉత్తమంగా పాఠాన్నిబోధిస్తడు
విద్యార్థులపై నమ్మకంపెడుతూ
మార్పుకొరకు ప్రయత్నిస్తడు !!

ఎపుడైనా గురువు
హోదాల్ని చూడడు
పాఠాన్నిబోధిస్తూ గురువు
పైకానికి ఆశపడడు !!

గురువు సగమైతడు
బోధిస్తే వినకుంటే
గురువు దైవమైతడు
చెడును అనుసరించకుంటే !!

దేవతలకైనా దానవులకైనా
గురువులేనిది గుడ్డిదీపం
రాజుకైనా అధికారికైనా
గురువే బ్రతుకునేర్పేదీపం !!

గురువు కష్టాలకుఅడ్రస్సు
ప్రగతికి ముందుంటడు
గురువుఇచ్చు యశస్సు
విద్యార్థులకు తోడుంటడు !!

రామకృష్ణ పరమహంస
వివేకానందునికి గురువయ్యాడు
వదిలిపెట్టాడు హింస
ప్రపంచానికే మంచివక్తయ్యాడు !!

–తాండ్ర చిరంజీవి
9959180762.

జనగణ 'మన' స్వరం

గంగా తరంగాల జల గళ రవాలు
భారతావని వెలుగంగ మంగళ స్వరాలు.
బోసి నవ్వులలోన పూచే అహింసా నినాదం.
ఎర్రగులాబీ లోన శాంతి సందేశం.
ఒక బుద్ధుడు,అశోకుడు,
గుండు దెబ్బకు నిలుచు గుండె నిబ్బరం,
ఇంద్రధనుస్సులో ఉదయించిన ఏడు వర్ణాల భిన్న మతాలు,
భిన్నత్వంలో ఏకత్వం.అవని తత్వం.
ఒక చెంప చూపించిన పట్టుదల.
శతాబ్దాల శృంఖలాలు ఛేదించిన గెలుపుదల.
మాతృ దాస్యపు విముక్తి సాధించిన రోజు
జనగణ మన మంటూ ముక్త కంఠముతో పలికిన రోజు.
భాష లెన్ని వున్నా భావాత్మ ఒకటే,
ధనవంతుడు,,పేదవాడు, తల్లి ఒకతే.
శ్రామికులం ,కర్షకులం
అలుపెరుగని యోధులం
భారతావని బహు పావని
విబుధావని. ,విపులావని

–సముద్రాల శ్రీదేసి,
9949837743

విశ్వ దార్శనికులు

నిన్న మొన్నటి పాఠాలే ఆధారం
ఇవాళ్టి కోసం రేపటి మనకోసం
మనుగడ పదికాలాలు సాగటంకోసం.
ఎవరు ఏమిచెప్పినా ఏమేమిచెయ్యమన్నా
అదంతా లోక కల్యాణం కోసం
ప్రపంచం చూపంతా వారివైపే.

సందుచూసుకొని మేమూ అనేవాళ్ళూ
ఈ సమయం మాదేనంటూ రెచ్చిపోయేవాళ్ళు
ఏచోట ఎప్పుడు చూసినా ఉంటుంటారు
ఇప్పుడూ అలాంటి వాళ్ళకు లోటులేదు
వారందరూ దార్శనికులే అనుకుంటే ఎలా?

మార్గం చూపటం కాదు సన్మార్గం చూపాలి
ఆ మార్గం అందరికీ ఆదర్శయోగ్యం కావాలి
తరతరాలు ఆ బాటనే నడుస్తుండాలి
మన సంస్కృతి సంప్రదాయాలు
ఆచారవ్యవహారాలు చెప్పిందెవరైతేనేం
వారంతా ద్రష్టలూ అసలైన దార్శనికులు?

కట్టూ బొట్టూ ధూపదీపారాధనలయినా,
ముంగిళ్ళ కల్లాపి ముగ్గులయినా
ఆచార ఆహారవ్యవహారాలేవైనా
నాగరికలోకానికి నమస్కార సంస్కారంనేర్పి
ఆరోగ్యానికి ఆనందానికి వేసినబాటకదా
ప్రపంచానికి దార్శనికులమైంది మనమేకదా.

–డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి
9849331554

కలం-హలం

పుడిమి తల్లి గర్భాన దాగిన
పోషకాలను హలం చేతబూని
హాలికుడు పొలాన్నీ దున్నీ తీసి,
జానెడు పొట్ట క్షుధ్బాధను
తీర్చే ధాన్యసిరులను పండిస్తే..

కవి కలం చేతపట్టీ మనోమదిని దున్నీ
మనసులను పట్టి పీడిస్తున్న అజ్ఞానపు తిమిరాలను పారద్రోలే ..
జ్ఞాన కిరణాలను వెదజల్లే
భావ సిరులను పండిస్తాడు..

హలం ప్రతీ మట్టి పెళ్లను
చీల్చీ మొలకెత్తే విత్తుకు

ఊతమైతే..
కలం ప్రతీ మనిషి జ్ఞానసంద్రముని చిలికీ
అద్భుతమైన విజ్ఞానపరిమళాలను వెదజల్లుతుంది..

కలం..హలము సమాజ శ్రేయస్సుని కోరే శరాలే..
నమ్మిన వాళ్ళని ఉన్నత శిఖరాలకు చేర్చే దేవుని వరాలే..

–శ్రీదేవి సురేష్ కుసుమంచి
7032760484

భారతీయ స్త్రీ

పొద్ద పొడుపులా నుదుటన బొట్టు
అబ్బురపరిచే చీర కట్టు
నవతరానికి దారిలా పాపిట సింధూరం
నల్లని కురులు, సిగలో విరులు
ఉరకలెత్తే గోదారిలా గాజుల గలగళలు
ముచ్చట గొలిపే మువ్వల సవ్వడులు
తరాల సాంప్రదాయాల చెరగని
ముద్రగా నిలిచిన ఘనత
సంస్కృతిని నిలిపిన వనిత
అతిథి సత్కారాలలో ఆమెకు లేరు సాటి
అవని నుంచి ఆకాశం దాకా అన్నింటా మేటి
విద్య ఉద్యోగ వ్యాపార రాజకీయ రంగాలలో
బహుళ నైపుణ్యాలను ఒడసిపట్టి
తనదైన ముద్ర కొరకు
స్థిరస్థానం నిలుపుటకొరకు
అంధకారం చెరిపేసి అన్నింటా నేననుచు
ఆత్మస్థైర్యంతోదూసుకుపోతున్న భారత వనితా
నీకు వందనం

– ప్రియాంక
9652717548

అద్దాల అంగడి మాయాజాలం

జేబులో దమ్మిడి లేని ఎనుకటి రోజుల్లో
బట్టకు పొట్టకు ఎల్లదీసుకని
బతకటమే గొప్పనుకునేటోళ్ళు.
కష్టసుఖాలను వలపోసుకుంటూ
కల్గినంతలోనే కాళ్ళు సాపుకోవడం వాళ్ళకు
కాలం నేర్పిన విద్యే.
బుర్లుబాకి బోర్లబడకుండిరా అంటూ
హెచ్చరించే పెద్దరికం ఎప్పుడూ
వెన్నంటి ఉండేది
కాలంతో పాటు రుచులు అభిరుచులు అన్నీ మారి పోయే.

ప్రపంచీకరణ పెంచిన ప్రదర్శనా ప్రభావం
ఇంతింతై వటుడింతై అన్నట్లుగా
ఇంట్లో తిష్ఠవేసింది.
గాజు తెర అంగడిలో
మోజుపడ్డ నాజూకు సరుకులన్నీ
మెడకు జుట్టుకొని మెలికలు
తిప్పుతుంటే.

పులిని జూసి నక్క వాతలు బెట్టుకున్నట్లు
పర్సు బలం ఉన్న పక్కింటాయన విసిరిన సవాలుకు
అప్పోసప్పో జేసి
ఇల్లంతా సరుకులమయం జేసి
లేని యిలువను అతికించు కొంటిమి.

సరుకుల స్పర్శతో ప్రదర్శనతో పులకరించే పలకరింపులతో
మనిషితత్వాన్ని మార్కెట్ ఎప్పుడో మింగేసింది.

ఖరీదైన వస్తువు శరీరం పై కప్పడానికి
కరెన్సీ వేటలో పడరాని పాట్లెన్నో.

ఆఖరికి ఎట్లాగో
నానా గడ్డితిని నాలుగు రాళ్ళు
ఎనుకేసుకోవడం
నాగరికత నేర్పిన
న్యాయమైన బాటైంది.
అన్యాయం విపణి వీధిలో
అందినకాడికి దండుకున్నోడికే
అగ్రతాంబూలం.
ఆడమ్ స్మిత్ అదృశ్య హస్తమే
ఆదర్శమైన ఆధునిక మానవుడు
కూడబెట్టడానికి అల్లే కుట్రల పర్వంలో
బక్కచిక్కిన బడుగు జీవులను
రొంపిలోకి లాగే
అద్దాల అంగడి మాయాజాలమే
ఈ ఆధునిక ప్రపంచం.



–గన్ రెడ్డి ఆదిరెడ్డి
9494789731

ఆదర్శ భారత్

సీ// సీతమ్మ పతిభక్తి గీతలో విస్ఫూర్తి
శాక్య మునీంద్రుని శాంతి పథము
జాతిపిత యహింస శాస్త్రి నిజాయితీ
దానశీలి దదీచి త్యాగ నిరతి
అల పురుషోత్తము నాత్మాభిమానమ్ము
ఝాన్సిలక్ష్మి తెగువ జాతి కాదర్శము
వేదము వెలసిన విజ్ఞాన క్షేత్రము
విలువలు పంచిన విద్యల ధుని

సత్య వ్రతుడు హరిశ్చంద్ర చక్రవర్తి
ధర్మ పాలకుడు అశోక ధరణి ధవుడు
అంతరిక్ష శాస్త్రజ్ఞుడు ఆర్యభట్టు
దార్శనికుడు వివేకానంద పరయోగి

కవికులాంబుధి చంద్రుడు కాళిదాసు
వర సుచిత్రాల సృజన కర్త రవివర్మ
కల్పనా జాతికి నిల కల్పవల్లి
జ్ఞాన పుంగవ మూర్తుల కన్నతల్లి

–చిరమన వెంకట రమణయ్య
94413 80336

మానవతా.. మెరుపులు

అనాధలైన వారిని
ఆదుకునే నేస్తం
అన్నార్తుల ఆర్తిని
తీర్చే సమస్తం !

బాధలను చూస్తూ
ఊరుకోదు
తనబాధగా తలుస్తూ
ఆదుకునేదాక పోదు !

కన్నతల్లి రుణం
తీర్చుకుంటుంది
సమాజ సౌభాగ్యం
కావాలనుకుంటుంది !

అందరి క్షేమాన్ని
ఆకాంక్షిస్తోంది
పరుల హితాన్ని
కోరుకుంటుంది !

అహం ప్రదర్శించకుండా
అన్నీ అందిస్తుంది
ఏమీ ఆశించకుండా
కష్టాలను తీరుస్తుంది !

అణగారిన వర్గాలకు
అండగా నిలుస్తుంది
వారి భవిష్యత్తు కొరకు
నిత్యం ఆలోచిస్తుంది !

హాని తలపెట్టిన
మేలు చేస్తుంది
ఆపదలో అక్కున
చేర్చుకుంటది !

అమావాస్య చీకటిలో
వెలుగై వ్యాపిస్తుంది
చీకటి బ్రతుకులో
వెన్నెలను ప్రసాదిస్తుంది !

కులమతాల లోగిలిలో
అతీతంగా నిలుస్తుంది
బాధపడే గుండెలకు
ఆసరై నడుస్తుంది !

నిద్రాణంగా ఉన్నవాళ్లను
మేల్కొలుపుతుంది
నిర్వీర్యమైన యువతను
శక్తివంతం చేస్తుంది !

సమాజ అభివృద్ధికి
మార్గదర్శిగా నడుస్తుంది
నైతిక విలువలకి
నాంది పలుకుతుంది !

అవినీతి అక్రమాలకు
అడ్డుకట్ట వేస్తుంది
నీతి నియమాలకు
పునాదులు వేస్తుంది !

రాగ ద్వేషాలకి
చలించి పోతుంది
దాతృత్వ గుణానికి
అడుగు ముందుకేస్తుంది !

ఐక్యత సాధించడానికి
ఉపయోగపడే సాధనం
సామాజిక దృక్పథానికి
తోడ్పడే ఆయుధం !

చిరునవ్వై నిత్యం
నిన్ను పలకరిస్తుంది
ఆత్మీయురాలై నిత్యం
నీడై నడుస్తుంది !

ఇతరుల కన్నీరును
తనదిగా భావిస్తుంది
ఇతరుల కష్టాలను
తనవనుకుని నెరవేరుస్తుంది !

అమ్మ చేతి స్పర్శలా
మెత్తగా తాకుతుంది
చిరునవ్వుల సెలయేరులా
గలగలా పారుతుంది !

బాధలో భాగమై
ధ్వనిస్తుంది
వేదనలో వేదమై
ద్రవిస్తుంది !

బడుగుల బతుకులకు
ఆసరాగా నిలుస్తుంది
బలహీనుల గుండెలకు
భరోసాగా నడుస్తుంది !

బీటలు వారుతున్నా
బంధం వదులుకోదు
అపార్థాలు ఎన్నున్నా
ఆత్మీయత మరువదు !

శత్రువు గాయపరిచినా
కనికరం చూపుతుంది
విరోధి గాయపడినా
లేపనం రాస్తుంది !

కష్టసుఖాల సంగమంలో
ఆత్మీయ నేస్తం
కష్టాల కడలిలో
ఆపన్న హస్తం !

స్వలాభం కొరకు
ఆశించదు
స్వార్థం కొరకు
పని చేయదు !

కాలిన మేనుకు
లేపనమవుతుంది
మాడిన కడుపుకు
మెతుకవుతుంది !

కన్నీరుని చూస్తే
చలించి పోతుంది
ఆదుకోమని వస్తే
అభయమిస్తుంది !

–రవి చంచల
8500330700

నాటి సభలు, సమావేశాలు...

సెప్టెంబర్ 9 నుండి సెప్టెంబర్ 15 వరకు

సెప్టెంబర్ 9

జ్ఞాపకాలు

సెప్టెంబర్ 9, 2018న ప్రముఖ కవి, ఉద్యమకారుడు కాళోజీ జయంతి సందర్భంగా రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో బైస దేవదాసు సంపాదకత్వంలో వెలువడిన "మట్టి మనిషి దిక్కార స్వరం" కవితా సంకలనం ఆవిష్కరణలో శ్రీమతి బైస వీణదాస్, శ్రీమతి డా॥కె. నీహారిణి, ఆవిష్కర్త తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డా॥నందిని సిధారెడ్డి, బైస దేవదాసు, డా॥ నాళేశ్వరం శంకరం, బి. సూరజ్

సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

సెప్టెంబర్ 9

జ్ఞాపకాలు

సెప్టెంబర్ 9, 2018న కాళోజీ జయంతి వేడుకల్లో కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులతో అతిథులు డా॥ ఏనుగు నరసింహారెడ్డి, బైస దేవదాసు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాహిత్య అకాడమీ చైర్మన్ డా॥నందిని సిధారెడ్డి, డా॥ లక్ష్మణ చక్రవర్తి, నారాయణశర్మ తదితరులు.

సెప్టెంబర్ 9, 2018న కాళోజీ జయంతి వేడుకల్లో కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులతో అతిథులు డా॥ ఏనుగు నరసింహారెడ్డి, బైస దేవదాసు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం,సాహిత్య అకాడమీ చైర్మన్ డా॥నందిని సిధారెడ్డి, డా॥ లక్ష్మణ చక్రవర్తి, నారాయణశర్మ తదితరులు.

సెప్టెంబర్ 9

జ్ఞాపకాలు

సెప్టెంబర్ 9 రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కాళోజీ వేడుకలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసును సత్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాహిత్య అకాడమీ చైర్మన్ డా॥నందిని సిధారెడ్డి.

సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

సెప్టెంబర్ 10

జ్ఞాపకాలు



సెప్టెంబర్ 10, 2014న తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో ఏ.వి. కాలేజిలో 'ప్రజాకవి కాళోజి 101వ జయంతి' సందర్భంగా జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, బైస దేవదాసు, డా॥అమ్మంగి వేణుగోపాల్, రాజేందర్‌రెడ్డి, గంటా జలందర్ రెడ్డి.

సెప్టెంబర్ 10న తెలంగాణ సచివాలయంలో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం, భారత్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో మహాకవి కాళోజీ జయంతి సందర్భంగా 'కాళోజీ జీవిత చరిత్ర' సిడి ఆవిష్కరణ సభలో బైస దేవదాసు, డా॥ సుద్దాల అశోక్‌తేజ, నాగబాల సురేశ్ కుమార్, పార్థసారథి-ఐ.ఎ.ఎస్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి, మామిడి హరికృష్ణ.

సెప్టెంబర్ 11

జ్ఞాపకాలు

సెప్టెంబర్ 11, 2011న "శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య" ఆధ్వర్యంలో కళా సుబ్బారావు కళావేదికపై రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ రచించిన "తృప్తి నీవెక్కడ" పుస్తక ఆవిష్కరణ సభలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, శ్రీమతి వీణదాస్‌లను సత్కరిస్తున్న లయనెస్ భారతీ కమలాకర్, శ్రీమతి భాను, లంకా వెంకటసుబ్రహ్మణ్యం, రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ, పెద్దూరి వెంకటదాసు.

సెప్టెంబర్ 11, 2019న త్యాగరాయ గానసభలో "వినోబాభావే జయంతి" సభలో పాల్గొన్న వై. రాజేంద్ర ప్రసాద్, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, కళా వి.యస్. జనార్దనమూర్తి, బైస దేవదాసు, గాయనిమణులు శారద, రేణుక.

సెప్టెంబర్ 12

జ్ఞాపకాలు

సెప్టెంబర్ 12, 2019న త్యాగరాయ గానసభలో బండికల్లు వేంకటేశ్వర్లు ట్రస్టువారు నిర్వహించిన జాతీయ కవితల పోటీలోని విజేతలతో అతిథులు సర్వా పరమేశ్వర రావు, మౌనశ్రీ మల్లిక్, పెద్దూరి వెంకటదాసు, ముఖ్య అతిథి నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు,పొత్తూరి సుబ్బారావు, కళా జనార్దనమూర్తి,

సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

సెప్టెంబర్ 12

జ్ఞాపకాలు

సెప్టెంబర్ 12, 2019న శ్రీ విహారిగారికి బండికల్లు వేంకటేశ్వర్లు "జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న బైస దేవదాసు, బండికల్లు జమదగ్ని, పెద్దూరి వెంకటదాసు, శ్యాం, కళా జనార్దనమూర్తి, గుదిబండి వెంకటరెడ్డి

పొత్తూరి సుబ్బారావుకు జ్ఞాపికను బహూకరిస్తున్న బండికల్లు జమదగ్ని, బైస దేవదాసు, గుదిబండి వెంకటరెడ్డి, బండి కల్లు శ్యాం.

సెప్టెంబర్ 13 & 14

జ్ఞాపకాలు

సెప్టెంబర్ 13, 2012న పొనుగంటివారి "సాక్షి" వ్యాసాల శతజయంతి సందర్భంగా డా॥ ద్వా.నా.శాస్త్రికి త్యాగరాయ గానసభలో పొనుగంటి లక్ష్మీనరసింహారావు పురస్కారం ప్రదానం చేస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, బైస దేవదాసు, ఓలేటి పార్వతీశం, అభినందన భవాని, కృష్ణకళ.

సెప్టెంబర్ 14, 2019న త్యాగరాయ గానసభలో బుర్రకథా పితామహులు సుద్దాల హన్మంతు జ్ఞాపకార్థం జరిగిన "బుర్ర కథా సప్తాహం"లో గుమ్మడెల్లి సైదులును సత్కరిస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు, కళా జనార్దనమూర్తి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, తదితరులు.

సెప్టెంబర్ 15

జ్ఞాపకాలు

సెప్టెంబర్ 15, 2013న ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మం॥ బండల నాగాపురంలో 'ఉదారి నాగదాసు' స్మారక కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బైస దేవదాసు, జి.ఆర్.కుర్మే, డా॥ చెమన్ తదితరులు.

సెప్టెంబర్ 15, 2018న శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య 2018 కవితల పోటీ పురస్కార దినోత్సవంలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.వేదికపై డా॥ ఈటెల సమ్మన్న, దాస్యం సేనాధిపతి, డా॥పాలకుర్తి మధుసూదన్‌రావు, ఎల్వీ సుబ్రహ్మణ్యం, పొత్తూరి జయలక్ష్మి.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

నిర్వహణ: *డా॥ప్రతికంఠం మాలతీలత*

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ప్రథమ బహుమతి విజేత

శీర్షిక: **అతడు తెలంగాణ -గుండె చప్పుడు**

మనసున్న మారాజు కాళన్న
అతడే కాళోజీగా కీర్తి వహించిన
కాళోజీ నారాయణ
తెలంగాణ ప్రజల గుండెచప్పుడు
ప్రజా హక్కుల ఊపిరి అతడు
అతడి మాట తెలంగాణ
అతడి బాట తెలంగాణ
"తెలంగాణ వాదం" ఆయన నినాదం.
"నిజాం దొరల నిరంకుశత్వాన్ని"
"సిరాచుక్కలు"గా చేసి
కలం గళంగా ఎలుగెత్తిన ధీశాలి
తన సాహితీ పరంపరతో ప్రజల
"మస్తిష్క మథనం" చేసిన అనభవశాలి
అణుకువ చూపి. "గాంధీ మార్గం"
అవలంబించాడు
అవసరమైతే హింసా మార్గం
అనుసరించాడు.
॥తెలుగు భాష॥కు పట్టంకట్టాడు
ఓ తెలుగోడ!
అన్యభాషల పొందెందుకని
ఆంధ్రమే ముద్దని చాటి చెప్పాడు
॥పలుపురస్కారాలెన్నో॥
గ్రహించిన పద్మ విభూషణుడు
కలకాలం ప్రజలందరి గుండెల్లో
మహా మనీషిగా గూడుకట్టుకుని నిలచిన
॥ప్రజల మనిషి॥
చావు పుట్టుకలే తనివి
తన బతుకంతా తెలంగాణాకి
అంకితం చేసిన ధన్యజీవి.

-కొలచన విజయ భారతి

ద్వితీయ బహుమతి విజేత

శీర్షిక: **అక్షర యోధుడు కాళోజీ**

ఓరుగల్లుకు వలస వచ్చి
కాకతీయ పౌరుషాన్ని తనలో
నింపుకున్న ఒక విప్లవ శంఖారావం
కలంలో రక్తం దింపుకొని
గళంలో కత్తులు నింపుకుని
'నిజాం నిరంకుశత్వం'పై
సాహితీ సమర శంఖం పూరించాడు

కవి 'మస్తిష్క మథనం' చేయగా
అతని కలం నుండి జాలువారిన
'సిరా చుక్కలు'
లక్ష మెదళ్లకు కదలిక అని
కాళోజీ భావన.
అన్య భాషలు నేర్చి
అమ్మభాషను మరిచే
ఆంధ్రుల హిపోక్రసీపై
గళమెత్తి గర్జించాడు
'తెలుగు భాష'కు
యాసకు పట్టం కట్టాడు
ఎన్నో సాహిత్య ప్రక్రియలలో తనదైన
ముద్ర వేసిన కాళోజీ ని
'వరించిన పురస్కారాలు'
పద్మ విభూషన్,కళాప్రపూర్ణ
ఇంకా మరెన్నో....
ప్రజల గొడవే తన గొడవగా చేసుకుని
ఉద్యమమే ఊపిరిగా
బ్రతికిన 'ప్రజల మనిషి'

'గాంధీ మార్గం'లో చరించి
తాడిత పీడిత
పక్షాన నిలిచి
తన కలాన్ని ఝుళిపించాడు!!

తెలంగాణే జీవితంలా బ్రతికి
'తెలంగాణా వాదం' బలపరిచిన
అసలు సిసలు తెలంగాణా వాది
ప్రజా చైతన్య దిక్సూచి
ఉద్యమకెరటం
అక్షరయోధుడు కాళోజీ!!

-పరిమి వెంకట సత్యమూర్తి

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల కోసం టీఆర్ఎస్‌లో క్యూ

రోజురోజుకూ పెరుగుతున్న ఆశావహుల సంఖ్య

దేశిపతి, వేణుగోపాలాచారి,గోరటి పేర్లు పరిశీలన?

హైదరాబాద్,సెప్టెంబర్16 (ఆంఎన్ఎ): గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల కోసం టీఆర్ఎస్‌లో ఎవ్వరికి వారు ఆశలు పెట్టుకున్నారు. అయితే అభ్యర్థుల ఎంపికలో తుది నిర్ణయంమాత్రం సిఎం కెసిఆర్‌దే అని అందరికీ తెలిసిందే. సిఎం ఓఎస్డీగా ఉన్న దేశిపతి శ్రీనివాస్‌కు ఖాయమని ప్రచారం సాగుతోంది. అలాగే కేంద్రమాజీ మంత్రి వేణుగోపాలచారి కూడా నామినేటెడ్ ఎమ్మెల్సీ కోసం ఎదురు చూస్తున్నారు. ఆయన గత చాలకాలం నుంచి తనకు అవకాశం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీలో అధికార ప్రతినిధిగా ఉన్న ఆయన పోస్టును మరోమారు పొడిగించలేదు. దీంతో ఆయనకు ఎమ్మెల్సీ దక్కుతుందని అనుచరులు కూడా ఆశగా ఉన్నారు. ఇదే సమయంలో పదవీకాలం ముగిసిన నాయిని నరసింహారెడ్డి, కర్నె ప్రభాకర్‌లు మరోసారి అవకాశం ఇస్తారని ఎదురు చూస్తున్నారు. మూడు ఖాళీలు ఉండటంతో ఒకటి ఓసీకి, మరొకటి బీసీకి... ఇంకొకటి ఎస్సీ లేదా ఎస్టీకి ఇస్తారన్న లెక్కలు వేసుకుంటున్నారు. అయితే నాయినికి వయసు మీద పడడంతో ఆయనకు ఇస్తారా లేదా అన్నది కూడా అనుమానమని అంటున్నారు. ఈ దశలో ఉద్యోగానికి రాజీనామా చేయించి, ఓఎస్డీగా పెట్టుకున్న దేశిపతి శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ ఖాయమని అంటున్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ మదిలో ఎవరున్నారన్నది మాత్రం బయటకు రాలేదు. అయితే గతంలోలాగ రాజకీయ నేతలతో నింపేయకుండా గవర్నర్ కోటాలో ప్రముఖులను తీసుకునే ఛాన్స్ ఉందని కూడా అంటున్నారు. ఈ క్రమంలోనే వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి అవకాశం కల్పించాలని అనుకుంటు న్నారని సమాచారం. అందుకే కవులు, కళాకారులు ఈ కేటగిరిలో ఛాన్స్ దక్కుతుందని అభిప్రాయ పడుతున్నారు. అన్ని వర్గాల నుంచి ప్రశంసలు వచ్చేలా పార్టీలకు అతీతంగా తెలంగాణ కోసం పనిచేసిన కళాకారులను ఎంపిక చేయాలని సీఎం కేసీఆర్ సంప్రదింపులు చేస్తున్నారని తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్లలె కన్నీరు పెడుతుందో అని తెలంగాణ ప్రజా జీవితాన్ని ప్రపంచానికి చాటిన జానపద కవి... గాయకుడు గోరటి వెంకన్న పేరు చర్చలోకి వచ్చినట్లు సమాచారం. ఆయనది పాలమూరు జిల్లా. తెలంగాణ ఉద్యమంలో పార్టీలకు అతీతంగా ప్రజల తరఫున పోరాడిన కవిగా, గాయకుడిగా ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏ రాజకీయ పార్టీలోకి వెళ్లకుండా తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రజలకు మేలు చేసే పనులను ప్రశంసిస్తూ ప్రభుత్వాన్ని మెచ్చుకుంటూ సంయమనం పాటిస్తూ రావడం గోరటి వెంకన్నకు కలిసొచ్చిన అంశంగా చెబుతున్నారు. అందుకే వెంకన్న పేరును సీఎం కేసీఆర్ సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక కసరత్తు దాదాపుగా కొలిక్కి వచ్చిందని.. ఒకేసారి ముగ్గురు పేర్లను ప్రకటించే వీలుందని పార్టీ వర్గాల సమాచారం. దేశిపతి, గోరటి వెంకన్న, వేణుగోపాలచారిల్లో ఎవరికి ఛాన్స్ వస్తుందన్నది చూడాలి. ఈ ముగ్గురిలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన గోరటి వెంకన్న పేరు ఉంటుందని అనుకుంటున్నారు. అదీకాకుండా.. పార్టీకి చెందని వ్యక్తిగా వెంకన్నకు అవకాశం ఇస్తే.. అటు ఉద్యమకారులకు.. ఇటు విమర్శకులకు సమాధానం ఇచ్చినట్లు అవుతుందని లెక్కలు వేస్తున్నారు. అయితే ఈ ముగ్గురూ సిఎంకు బాగా కావాల్సిన వారు కావడంతో ఎవరికి దక్కుతుందో చూడాలి.

అప్పలాయగుంటలో ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): తిరుపతి అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం రాత్రి మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. టిటిడి ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కరోనా వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా ఆలయంలో ఏకాంతంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం రాత్రి యాగశాలలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో ఝాన్సీరాణి, ఏఈవో సుబ్రమణ్యం, సూపరింటెండెంట్ గోపాలకృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

"ప్రపంచ ఓజోన్ డే" కవితల పోటీ ఫలితాలు

సెప్టెంబర్ 16న "ప్రపంచ ఓజోన్ డే" సందర్భంగా తెలంగాణ అటవీ శాఖ-ములుగు రేంజ్, ములుగు జిల్లా, లీడ్ ఫౌండేషన్ మరియు తెలంగాణ సాహితి సంయుక్తంగా నిర్వహించిన కవితల పోటీలో విజేతల వివరాలు-**మొదటి బహుమతి** : డి నాగజ్యోతి శేఖర్, ఆకుపచ్చని ప్రమాణం అనే కవితకు, **ద్వితీయ బహుమతి**గా డాక్టర్ మోపిదేవి విజయగోపాల్ - సంజీవని అనే కవితకు, **తృతీయ బహుమతి** గా శైలజామిత్ర రచించిన వృక్ష వారధులవుదాం అనే కవిత ఎంపిక అయ్యాయని నిర్వాహకులు తెలియజేసారు.

ప్రత్యేక బహుమతులు గా ఫణి మాధవి కన్నోజు రచన 'ఓజోన్ అను నేను... ఇచ్చు నీ మరణ వాంగ్మూలం' ఉషారాణి - సమ్మె, బండారి రాజ్ కుమార్ రచన ఆఖరి మోకా, వెంకటేష్ పువ్వాడ రచన ఆకుపచ్చని చెరసాల, సుష్మ రచన కానుకివ్వు, గిరి ప్రసాద్ చెలమల్లు రచన పర్యావరణం. ఆర్ ఎల్ స్వామి రచన కొత్త పరిమళం. వేణుమాధవ్ రచన ఉపద్రవం, మొహమ్మద్ అఫ్సర వలీషా రచన నవలోకం, దాకోజు కుసుమ కుమార్ - పచ్చ'ధనం', చొక్కాపు లక్ష్మనాయుడు - పచ్చని సంతకం ఎంపిక అయ్యాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒక సద్భావంతో చేసిన ఈ ప్రయత్నంలో పాలుపంచుకున్న కవి మిత్రులందరికీ ధన్యవాదాలు. కవితాసంపుటికై ఎంచుకున్న కవితల వివరాలను త్వరలోనే తెలియజేస్తామని నిర్వాహకులు ఎం. రామ్ మోహన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ములుగు రేంజ్, ములుగు జిల్లా, తెలంగాణ. లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాసుల రవికుమార్, వరంగల్ తెలిపారు.

నేటి నుంచి ఇగ్నో టర్మ్ ఎండ్ పరీక్షలు

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఇగ్నో దేశవ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరం టర్మ్ ఎండ్ పరీక్షలను ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు నిర్వహిస్తున్నట్లు ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ ఎస్ ఫయా జ్ అహ్మద్ తెలిపారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇకపోతే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ చివరి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చేనెల 10 నుంచి నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్ చూడాలని కోరారు.

ఈనెల 12న త్యాగరాయ గానసభలో ప్రముఖ సాహితీవేత్త తల్లా పజ్జల శివశంకర శాస్త్రి జయంతి సందర్భంగా జ్యోతి వెలిగించి నివాళి అర్పిస్తున్న ప్రముఖ రచయిత విమర్శకులు రమణ వెలకమన్ని. వేదికపై కళా వి.యస్.జనార్దనమూర్తి, డా॥ బి. జయరాములు, శ్రీమతి టి. లలితారాణి



చేతన సచివాలయ సారస్వత వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవం (కాళోజీ జయంతి)రోజున అంతర్జాతీయ వేదిక ద్వారా జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు టి. కృష్ణవేణిగారు, ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ మరియు గౌరవాధ్యక్షులు కేతవరపు రాజ్యశ్రీ, గౌరవ అతిథులుగా చంద్రశేఖర్, మనోహర్‌బాబు, రఘువీర్ ప్రతాప్ తమ సందేశాన్ని వినిపించారు. ఈ వేదిక ద్వారా వై. కనకతార, చంద్రకళ, శారద, భవాని,ప్రమోదిని, రాధ, శ్రీపతిలు తమ కవితా గానాన్ని వినిపించారు.

ఆయుర్వేద బిల్లుకు రాజ్యసభ ఆమోదం

-చర్చ సందర్భంగా వివరాలు వెల్లడించిన హర్షవర్ధన్

న్యూఢిల్లీ,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ టీచింగ్ అండ్ రీసర్చ్ ఇన్ ఆయుర్వేద బిల్లుకు రాజ్యసభ ఆమోదం దక్కింది. ఇవాళ ఆయుర్వేద బిల్లుపై వివిధ పార్టీల ఎంపీలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బిల్లుపై మాట్లాడిన ఎంపీలకు ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ థ్యాంక్స్ చెప్పారు. ఆధునిక వైద్యంలో డాక్టర్ అయినా.. ఆయుర్వేదంతో పాటు ఇతర సాంప్రదాయ వైద్య విధానాలను తాను ప్రశంసిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జామ్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న ఇన్స్‌టిట్యూట్‌కు సంబంధించి మంత్రి క్లారిటీ ఇచ్చారు. దేశంలోని ఇతర సంస్థలకు కూడా గౌరవం ఇస్తున్నామన్నారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఆరోగ్య సంస్థలు దేశంలో 103 ఉన్నాయని, కానీ ఆయుర్వేదకు ఏదీ లేదని ఆయన తెలిపారు. జామ్‌నగర్ ఆయుర్వేద కాలేజీకి జాతీయ హోదా ఇవ్వడంలో పక్షపాతం లేదన్నారు. జామ్‌నగర్‌లో ఉన్న ఇన్స్‌టిట్యూట్ చాలా పురాతనమైనదని, దాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేసిందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలిసి పనిచేస్తున్న ఆయుర్వేద సంస్థ అది ఒక్కటే అన్నారు. జామ్‌నగర్ ఇన్స్‌టిట్యూట్ ఈ హోదాకు తగినదని, మిగితా సంస్థలు కూడా అప్‌గ్రేడ్ అయిన తర్వాత వాటికి కూడా జాతీయ ప్రాముఖ్యత కల్పిస్తామని మంత్రి తెలిపారు. మూజువాణి ఓటు ద్వారా ఆయుర్వేద బిల్లును పాస్ చేశారు.

ఆయుర్వేదానికి ప్రపంచ గుర్తింపు వస్తోంది: కెకె

ఆయుర్వేద వైద్యానికి ప్రపంచ గుర్తింపు వస్తోందని టిఆర్ఎస్ ఎంపీ కె.కేశవరావు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇదో ప్రధాన వైద్య విధానంగా పరిణితి చెందిందన్నారు. ఆయుర్వేద ఉత్పత్తుల్లో వృద్ధి గణనీయంగా ఉన్నట్లు చెప్పారు. దేశంలో సుమారు 75 శాతం మంది ఆయుర్వేద ప్రొడక్ట్స్‌ను వినియోగిస్తారన్నారు. సాంప్రదాయ పద్ధతిలో ఆయుర్వేదంలో పరిశోధన కొనసాగాలని టీఆర్ఎస్ ఎంపీ కేశవరావు తెలిపారు. రాజ్యసభలో ఇవాళ ఆయుర్వేద బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ఎంపీ కేశవరావు మాట్లాడారు. తెలంగాణలో ఆయుర్వేద కాలేజీలు చాలా ఉన్నట్లు ఆయన చెప్పారు. యునానీ, హోమియోపతి, సిద్ధ కాలేజీలు కూడా ఉన్నట్లు తెలిపారు. సాంప్రదాయ జ్ఞానంపై జరుగుతున్న బోధన, పరిశోధనను స్వాగతిస్తున్నట్లు కేశవరావు తెలిపారు. ఆయుర్వేద విధానం మనదేశానికి చెందినదన్నారు. ఆయుర్వేదం వేదాలకు సంబంధించినదని, భౌతిక, శారీరక, మానసిక పద్ధతుల్లో చికిత్స వేల ఏళ్లుగా కొనసాగుతోందన్నారు.

నేటి నిజాలు

శిశిరంలో రాలుతున్న ఆకులాంటి.. నీ అమృతనాన్ని
మా గుండెలో దాచుకోలేకపోయాను

నీ పాదాలకింద దూళిలా బతకాల్సిన నేను
నీకు దుఃఖాన్ని పంచాను
కొయ్య తెడుకులతో.. కడుపు నింపలేకపోయాను
నీడనిచ్చాల్సిన నేను
నిన్ను మండుటెండలోకి గెంటాను
నీ చనుబాలతో ఊలకిపోసుకున్న బతికిన నేను
నీ ఊలకిపోయేదాకా
ఆ.. రుణం తీర్చుకోలేకపోయాను
క్షమించు తల్లీ.. నీకు పాదాభివందనం..!

- కెరె జగదీష్



Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.